ప్రాంతం	నెల్లూరు	కావలి	ఆత్మకూరు	ఉదయగిరి	కందుకూరు
గరిష్ఠం	41.6	39.0	42.0	42.0	38.0
కనిష్ఠం	32.6	27.0	26.0	25.0	28.0


డెల్టా, ఉత్తర కాలువకు నీటి సరఫరా పెంపు

అనంతసాగరం : సోమశిల నుంచి డెల్టా, ఉత్తర కాలువకు నీటి సరఫరా పెంచారు. డ్యాం సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ఆదివారం నాటికి 8.456 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 15 క్యూసెక్కుల నుంచి 200, ఉత్తర కాలువకు 5 నుంచి 50 క్యూసెక్కులకు పెంచారు. ఇక దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

ఎడాపెడా చార్జి!

- నాలుగేళ్లలో కరెంటు వడ్డన రూ.808 కోట్లు
- యూనిట్ ధర పెంపుతో రూ.342 కోట్లు
- వ్యత్యాసపు ధర, ఎఫ్‌పీపీసీఏ చార్జీల రూపంలో రూ.466 కోట్లు
- జగన్ పాలనలో చార్జీల షాక్‌తో మూర్ఛిల్లిన ప్రజలు





ఉదయగిరి వెంకటేశ్వర్లుది వరికుంటపాడు మండలం. ఈయన ఇంట్లో నెలకు ఓ 200 యూనిట్ల కరెంటు వినియోగం జరుగుతుంది. 2019లో వెంకటేశ్వర్లుకు 600 నుంచి 700 రూపాయల మధ్యలో బిల్లు వచ్చేది. ఇప్పుడు కూడా అన్నే యూనిట్లు ఖర్చు చేస్తున్నాడు. కానీ బిల్లు మాత్రం రూ.1500 వరకు వస్తోంది.

నెల్లూరు నగరానికి చెందిన మొహమ్మద్ పీరు అనే మధ్య తరగతి కుటుంబీకుడి ఇంట్లో 300 యూనిట్ల కరెంటు వినియోగం జరుగుతోంది. 2019లో ఇతని కరెంటు బిల్లు నెలకు రూ.2100 వరకు వచ్చేది. ఇప్పుడు రూ. 4వేలకు చేరుకుంది.

ఇవి ఉదాహరణలు మాత్రమే. జిల్లాలోని లక్షలాది మంది గృహ వినియోగదారుల బిల్లులన్నీ ఇలాగే పెరిగిపోయాయి. నాలుగేళ్లుగా ప్రజలు ఈ కరెంటు చార్జీల కాటుకు గురవుతూనే ఉన్నారు. ప్రతి నెలా కళ్లనీళ్లు కుక్కుకొంటూ వేలకు వేల రూపాయలు కరెంటు చార్జీల రూపంలో చెల్లిస్తూనే ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం గృహ వినియోగ విద్యుత్‌కు ఇవ్వాల్సిన రాయితీలను ఇవ్వకపోవడంతో విద్యుత్ శాఖ జనం మీద పడి బాదేస్తోంది. ఆ బాదుడు ఎంతలా ఉందంటే గడిచిన నాలుగేళ్లలో జిల్లా ప్రజలపై పడిన అదనపు భారం ఎంతంటే రమారమి రూ.808 కోట్ల పైమాటే. సంక్షేమం.. సంక్షేమం అంటూ అరుస్తూనే బటన్ నొక్కుడు ద్వారా ఇచ్చిన డబ్బును కరెంటు చార్జీల రూపంలో గుంజేసింది. 2019లో చార్జీలను, ఇప్పటి చార్జీల లెక్కలను ఒకసారి పోల్చిచూస్తే తెలియకనే జిల్లా ప్రజలు వందల కోట్ల రూపాయలను అదనంగా చెల్లించాల్సిన వచ్చిన దారుణం అవగతం అతువుంది.

- నెల్లూరు, ఆంధ్రజ్యోతి

● 2019లో ఇలా..

2019-20లో యూనిట్ చార్జీల ధరలు ఇలా ఉండేవి. 50-100 యూనిట్లకు ఒక్కో యూనిట్‌కు రూ.2.60 పైసలు, 101-200 వరకు రూ.3.60, 200-300 వరకు 6.90, 300 యూనిట్లు దాటితే రూ.7.75 చొప్పున వసూలు చేసేవారు. అంటే అప్పటి ధరల ప్రకారం అన్ని కేటగిరీలను కలుపుకుంటే సగటున యూనిట్ ధర రూ.5.21 పైసలుగా ఉండేది.

● 2020 నుంచి ఇలా..

కేవలం 30 యూనిట్లలోపు వినియోగించే గృహస్థులకు మాత్రం రేటు తగ్గించి రూ.1.90 పైసలుగా నిర్ణయించి అంతకన్నా ఎక్కువ వినియోగించే యూనిట్ల ధరలు అమాంతం పెంచేశారు. 31-75 కేటగిరీకి రూ.3.00, 76-125కు 4.50, 126-225కు రూ.6.00, 226-400లకు రూ.8.75, 400లకు పైబడితే రూ.9.75 పైసలుగా వసూలు చేస్తున్నారు. అన్ని క్యాటగిరిల సగటు తీసుకుంటే ఒక యూనిట్ ధర రూ. 5.65 పైసలు అవుతుంది. అంటే 2019-20వ తో పోల్చితే యూనిట్ మీద సగటున రూ.0.44 పైసలు పెరిగింది.

● 800 కోట్ల వడ్డన!?

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గడచిన నాలుగేళ్లలో పెరిగిన యూనిట్ ధరల రూపంలో సుమారుగా రూ.342కోట్లు, సర్‌చార్జీల రూపంలో 466 కోట్లు మొత్తం 808 కోట్ల రూపాయల అదనపు భారం జిల్లా గృహ విద్యుత్ వినియోగదారులపై పడింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా కరెంటు బిల్లులు షాక్ కొడుతున్నాయనడానికి ప్రధాన కారణం పెరిగిన యూనిట్ ధరతోపాటు అదనంగా పడిన సర్‌చార్జీలే. 2019 తరువాత యూనిట్‌పై 0.44పైసలు చార్జి పెరిగితే సర్‌చార్జీల రూపంలో 80 పైసలు పడింది. విశేషమేమంటే ఒక యూనిట్ ఆరంభపు ధర రూ.1.90 పైసలు అయితే ఆ యూనిట్‌పై అదనంగా వసూలు చేస్తున్న మొత్తం (పెరిగిన యూనిట్ ధర 0.44+ రెండు సర్‌చార్జీలు 0.80 కలిపి) రూ. 1.22పైసలు. అంటే వాడుకున్న కరెంటు ఎంత బిల్లు వస్తోందో అందులో 70 శాతం మొత్తం సర్‌చార్జీలు, పెరిగిన యూనిట్ ధరల రూపంలో అదనంగా బిల్లులో కలుస్తోంది.



● ఈ వడ్డన.. అమ్మఒడి డబ్బంత!

అదనపు కరెంటు చార్జీల భారం ఎంతంటే.. వైసీపీ ప్రభుత్వం ఘనంగా చెప్పుకునే అమ్మఒడి డబ్బంత అని జనం అనుకొంటున్నారు. లెక్కలు కడితే ఇది నిజమనే అనిపిస్తోంది. అమ్మఒడి కింద ఇప్పటికి నాలుగు విడతలుగా నగదు పంపిణీ చేశారు. జిల్లాలో సుమారుగా 2లక్షల మంది లబ్ధిదారులకు ఏడాదికి 13వేలు చొప్పున ఏడాదికి 260 కోట్లు పంపిణీ చేశారు. ఇప్పటికి నాలుగు విడతల్లో రమారమి వెయ్యి కోట్లు పంపిణీ చేసారు. కానీ జిల్లా పరిధిలోని అమ్మలు అదనపు కరెంటు చార్జీల రూపంలో 800 కోట్లకుపైగా అదనంగా చెల్లించారు. ఇది చూస్తే ఈ జగన్ రూపాయి ఇచ్చి వంద లాకొంటున్నాడు అని ప్రతిపక్ష నేత చంద్రబాబు పదే పదే ప్రస్తావిస్తున్న విషయం వాస్తవమే కదా అని జనం అనుకొంటున్నారు.

● రూ.342 కోట్లు పిండేశారు

ఒక నెలకు జిల్లా గృహవినియోగానికి ఖర్చు చేసే కరెంటు 16కోట్ల 19లక్షల 72వేల యూనిట్లు. యూనిట్ మీద 0.44 పైసలుతో లెక్కిస్తే నెలకు పడిన అదనపు భారం రూ.7 కోట్ల 12 లక్షల 67వేలు. ఈ పెరిగిన చార్జీలు గత నాలుగేళ్లుగా అమలులో ఉన్నాయి. అంటే 48 నెలల కాలం. నెలకు రూ.7.12 కోట్ల చొప్పున వినియోగదారులపై పెరిగిన యూనిట్ ధర రూపంలో పడిన అదనపు భారం రమార మి 342 కోట్ల రూపాయలు. ఇది అన్ని యూనిట్ల సగటు లెక్క మాత్రమే. అదే కేటగిరీల వారీగా తీసుకుంటే ఈ అదనపు భారంలో 80 శాతం మధ్య తరగతి కుటుంబాలపైనే. జిల్లా విని యోగదారుల్లో 126-225 యూనిట్ల మధ్య వినియోగించే సర్వీసులే 80 శాతం వరకు ఉంటాయి. అంటే యూనిట్ ధర పెంపు కారణంగా గత నాలుగేళ్లలో పడిన అదనపు భారం 342 కోట్లలో 80 శాతం మొత్తం మధ్యతరగతి కుటుంబాలపైనే పడిందని తెలుస్తోంది.

సర్‌చార్జీల రూపంలోనూ..

సాధారణంగా విషసర్పాలు, క్రూర మృగాల పేర్లు చెబితే గగుర్పాటుకు గురి కావడం సహజం. కానీ ఇప్పుడు జిల్లా ప్రజలు సర్‌చార్జీలు అనే పేరు వింటే అంతకన్నా ఎక్కువ కలవరపాటుకు గురవుతున్నా రు. కారణం ఈ సర్‌చార్జీల రూపంలో గడిచిన 36 నెలలుగా జిల్లా ప్రజలు 466 కోట్ల రూపాయలు విద్యుత్ శాఖకు బిల్లుల రూపంలో చెల్లించారు. ఖర్చు చేసిన కరెంటు చార్జీకి సమానంగా ఈ సర్‌చార్జీలు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం కరెంటు బిల్లులో రెండు సర్‌చార్జీలు వస్తున్నాయి. ఒకటి 2019కి పూర్వ విని యోగానికి సంబంధించిన వ్యత్యాసపు ధర, రెండవది పెరిగిన విద్యుత్ ఉత్పాదక వ్యత్యాసపు ధర (ఎఫ్‌పీపీసీఏ). ఒక్కో సర్‌చార్జిపైన రూ.0.40 పైసలు చొప్పున రెండు సర్‌చార్జీల రూపంలో ఒక యూనిట్‌పై అదనంగా 0.80 పైసలు వసూలు చేస్తున్నారు. జిల్లాలో ఇక నెల గృహవినియోగం 16.19 కోట్ల యూనిట్లు. ఒక్కో యూనిట్‌పై 80 పైసలు చొప్పున సర్‌చార్జీల రూపంలో నెలకు పడే అదనపు భారం రూ.12.95 కోట్లు. గత 36 నెలలుగా ఈ సర్‌చార్జీలు వసూలు చేస్తుండగా, ఇప్పటి వరకు రూ.466.47 కోట్లకుపైగా చెల్లించారు. ఎన్నికలు వచ్చాయి కాబట్టి సర్‌చార్జీలు ఆగిపోతాయనుకుంటే పొరబాటేనండోయ్. ఇంకా 12 నెలల కాలం ఈ సర్‌చార్జీల భారం తప్పదు. అంటే ఇంకా ఓ 156 కోట్ల రూపాయలు చెల్లించాలన్నమాట. సాధారణంగా ఈ వ్యత్యాసపు ధరలను విద్యుత్ శాఖకు ప్రభుత్వాలు చెల్లించాలి. అలా చెల్లించకపోవడ ంతో ఆ భారం ప్రజలపై పడిందనే వాదన బలంగా ఉంది.

మధ్య తరగతికి పిడుగులే



కలిగిరి: మధ్యతరగతి, సామాన్య కుటుంబీకులకు ప్రస్తుతం వచ్చే కరెంటు బిల్లులు పిడుగుల్లా కనిపిస్తున్నాయి. నా పేరు బొలిగర్ల మధు, ఓ ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తున్నాను. గతంలో రూ.200 నుంచి 300 వచ్చే కరెంటు బిల్లు ఇప్పుడు రూ.800 వరకు వస్తోంది. ఈ వేసవిలో ఇంట్లో కాసేపు ఫ్యాన్, కూలర్ వేసుకుందామనుకుంటే ఎక్కడ రూ.2వేలు బిల్లు వస్తుందోనని భయపడి పోతున్నాం. ప్రభుత్వం మధ్య తరగతి ప్రజలపై కనికరం చూపి కరెంటు బిల్లులు తగ్గించాలని కోరుతున్నాం.

- బొలిగర్ల మధు, సిద్దనకొండూరు, కలిగిరి మండలం



ఇతని పేరు కోలమూరి శ్రీనివాసులు. బేల్దారి మేస్త్రీ. నెల్లూరురూరల్ పరిధిలోని ధనలక్ష్మీపురంలో ఉంటున్న ఈయనకు కొన్ని నెలలుగా నెలవారి విద్యుత్ బిల్లు రూ. 1400-1500 వరకు వస్తోంది. గతేడాది ఇదే నెలలో రూ. 700-800 మాత్రమే వచ్చేది. రెండింతల బిల్లు ఎందుకు పెరిగిందో తెలియదు. గతేడాది ఏవైతే విద్యుత్ పరికరాలు ఉన్నాయో ఇప్పుడు అవే ఉన్నాయి. పెరిగిన బిల్లుపై అధికారులను అడిగితే అది అంతేనన్నారు. పైగా పెరిగిన బిల్లు కారణంగా అమ్మవడి పథకానికి కూడా దూరమైయ్యాం.

టెన్షన్



- నేడు పదో తరగతి ఫలితాల విడుదల
- జిల్లాలో 32,746 మంది ఎదురుచూపు
- ఫలితాలపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఉత్కంఠ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 21 : పదో తరగతి(టెన్త్) పబ్లిక్ పరీక్షల ఫలితాలను సోమవారం విడుదల చేసేందుకు పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ఫలితాల కోసం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి పరీక్షలు రాసిన 16,709 మంది బాలురు, 15,987 మంది బాలికలు కలిపి మొత్తం 32,746 మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది పరీక్షలు పూర్తయిన వెంటనే వేగవం తంగా స్పాట్ వాల్యుయేషన్ చేపట్టి త్వరతగతిన ఫలితాలను విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తొలుత మే నెల మొదటివారంలో ఫలితాలు విడుదలవు తాయని అందరూ భావించినా పాఠశాల విద్యాశాఖ ముందుగా ఫలితా లను విడుదల చేస్తుండటంతో అందరిలో ఉత్కంఠ నెలకొంది.

మార్కులే ప్రామాణికం కాదు..

పదోతరగతి ఫలితాలు విడుదలవుతున్న నేపథ్యంలో పరీక్షలు రాసిన విద్యార్థులు, తల్లిదం డ్రులు టెన్షన్‌కు గురవుతున్నారు. తాము ఊహించిన ఫలితం వస్తుందో.. లేదో అన్న ఆందోళన నెలకొంది. కానీ ఏ ఫలితం వచ్చినా, ఎన్ని మార్కులు వచ్చినా ఒత్తిడికి గురికాకూడదని, మా ర్కులే ప్రతిభకు కొలమానం, ప్రామాణికం కాదని, సంయమనమే ప్రధానమని నిపుణులు సూచిస్తున్నారు.

చంద్రబాబు సభకు ఎందుకెళ్లావ్!?

● టీడీపీ నాయకుడిపై వైసీపీ నేత దాడి



గాయపడిన పామంజి శ్రీరాములు

తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 21 : 'చంద్రబాబు సభకు ఎందుకు వెళ్లావ్!?' అంటూ టీడీపీ నాయకుడిపై అధికార పార్టీకి చెందిన నాయకుడు దాడి చేశాడు. శనివారం పొదల కూరులో జరిగిన టీడీపీ అధినేత చంద్రబాబు బహిరంగ సభకు కోడూరు పంచాయతీ వెంకటేశ్వపాలెంకు చెందిన టీడీపీ నాయకుడు పామంజి శ్రీరాములు వెళ్లి రాత్రి స్వగ్రా మానికి చేరుకున్నాడు. వెంటనే అక్కడకు వచ్చిన వైసీపీ నాయకుడు పామంజి ఈశ్వరయ్య చంద్రబాబు సభకు ఎందుకెళ్లావ్ అంటూ అసభ్య పదజాలంతో దూషించాడు. ఆ తర్వాత సహనం కోల్పోయి విచక్షణ రహితంగా గొడ్డలితో శ్రీరాములుపై దాడి చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న శ్రీరాములును బంధువులు ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లాడు. ఎస్ఐ జంపానికు మార్‌ను వివరణ కోరగా నిందితుడ ఈశ్వరయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మా ఊళ్లో వాళ్లదే పెత్తనం!

- మూడేళ్లలో ఎన్ని నిధులొచ్చాయో తెలియదు!
- బ్రాహ్మణపల్లి సర్పంచు పెద్దఓబులేశు



వైసీపీ నేతలు బలపరిస్తే మూడేళ్ల కిందట మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లి సర్పంచ్‌నయ్యా. కానీ పేరుకే సర్పంచును. పెత్తనమంతా వారిదే. ఈ మూడేళ్ల నా గ్రామానికి ఎన్ని నిధులు వచ్చాయో నాకే తెలియదు. పంచాయతీ కార్యదర్శిని అడిగితే పైవాళ్లను అడగమంటున్నాడు. నా సంతకాలను ఫోర్జరీ చేసి నిధులు పక్కదారి పట్టించారు. అందుకే సమాచార హక్కు చట్టం కింద వివరాలకు దరఖాస్తు చేసుకున్నా."నని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి స్వగ్రామం బ్రాహ్మణపల్లి సర్పంచ్ పెద్దఓబులేశు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆత్మకూరు మండలం కరటంపాడులో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గూటూరు మురళీకన్నబాబు ఆధ్వర్యంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దళిత సర్పంచ్‌నని వైసీపీ నేతలు నిర్లక్ష్యం చేసి పెత్తనం వారి చేతుల్లోకి తీసుకున్నారని వాపోయారు. తాను సొంతంగా చేసిన అభివృద్ధి పనులకు సైతం బిల్లులు పెట్టుకోలేని పరిస్థితి ఉందని ఆవేదన చెందారు. గ్రామంలో చేపట్టాల్సి అభివృద్ధి పనుల విషయమై మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డిని అడిగితే మనవాళ్లు చూసుకుంటారులే.. అని సమాధానం ఇస్తున్నారని చెప్పారు. గ్రామంలో ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉత్సవ విగ్రహంలా తాను మిగిలిపోయినట్లు తెలిపారు. అందుకే తాను వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నట్లు స్పష్టం చేశారు.

- ఆత్మకూరు

కారుపై 'నిఘా నేత్రం'



కారుపై సీసీ కెమెరా అమర్చుతున్న సిబ్బంది

సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ అన్ని చర్యలు చేప డుతోంది. అందులో భాగంగా ఎన్నడూలేని విధంగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తమ వాహనాలకు సీసీ కెమెరాలు అమర్చుతున్నారు. 2 కెమెరాలు స్థానిక ఆర్వో కార్యాలయంతోపాటు నెల్లూరు, విజయవాడ కమాండ్ కంట్రోల్ రూమ్‌లకు అనుసంధానం చేశారు. వాహనాల తనిఖీల్లో బృంద అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదనే ఉద్దేశంతో ఈ కెమెరాలు ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా సుమారు 78 వాహనాలకు, ఉదయగిరి నియోజకవర్గంలో 9 వాహనాలకు ఈ కెమెరాలు ఏర్పాటు చేశారు. అలాగే చెక్‌పోస్టుల్లో సైతం సీసీ కెమెరాలను అమర్చుతున్నారు.

- ఉదయగిరి రూరల్

'ఓటుకు రూ.10 వేలు ఇస్తారు.. పూటుగా మద్యం తాగించి లొంగదీసుకుంటారు.. అవసరమైతే బెదిరిస్తారు.. వారి మాయలో పడ్డారా మళ్లీ చీకటి రోజులే..' ఇదీ ప్రతిపక్షాలు ప్రజలకు చేస్తున్న హెచ్చరికలు. ఇందుకు తగ్గట్టుగానే అధికార పార్టీ నేతలు ఎన్నికల్లో విచ్చలవిడిగా మద్యం పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఎక్కడికక్కడ ఛీప్ లిక్కర్‌ను డంప్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదివారం సర్వేపల్లి నియోజకవర్గం ముత్తుకూరు మండలంలోని పంటపాలెంలో సెబ్ అధికారులు భారీ మద్యం డంప్‌ను పట్టుకోవడం కలకలం రేగింది. అదీ వైసీపీ నాయకుడికి చెందిన రొయ్యల గుంతల వద్ద డంప్ చేయడం, అధికారులు దాడులకు వస్తున్నారని తెలిసి వైసీపీ నాయకుల కార్లలో మద్యం సీసాలు కలిగిన బస్తాలను మరోచోటకు తరలించే ప్రయత్నం చేయడం ప్రతిపక్షాల ఆరోపణలకు బలం చేకూరుతోంది. ఈవిధంగా ఇంకెన్ని ప్రాంతాల్లో డంప్‌లు చేశారోనన్న అనుమనాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఇంత భారీస్థాయిలో మద్యం రవాణా జరుగుతూ డంప్ చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

ఛీప్ పాలిట్రిక్స్!

- ఎన్నికల్లో విజయం కోసం వైసీపీ అడ్డదారులు
- ఎక్కడికక్కడ ఛీప్ లిక్కర్ డంప్
- 'సర్వేపల్లి'లో 4,232 సీసాలు పట్టుకోవడంతో కలకలం
- సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు.. క్షణాల్లో అక్రమార్కులకు సమాచారం లీక్!
- కార్లలో మద్యం తరలించే యత్నం
- ఎవరా ఇంటిదొంగలు?

● ఆ మద్యం ఎక్కడిది!?

ఎలాగైనా మళ్లీ గెలవాలనే ఉద్దేశంతో వైసీపీ నాయకులు కొన్నిరోజులుగా ఎన్నికల్లో పంపిణీకి సరిపడా మద్యాన్ని డంప్ చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ మద్యం ఎక్కడి నుంచి వచ్చిందన్నదే అసలు ప్రశ్నగా మారుతోంది. సర్వేపల్లి నియోజకవర్గంలో పట్టుబడిన 4,232 మద్యం సీసాలు రాష్ట్రంలో తయారైనవేనని అధికారులు చెబుతున్నారు. మరి అంత పెద్ద మొత్తంలో మద్యం వైసీపీ నాయకుల చేతుల్లోకి ఎలా చేరిందన్న ప్రశ్న తలెత్తుతోంది. ఆ బాటిళ్లను స్కాన్ చేస్తే ఏ మద్యం దుకాణం నుంచి వెళ్లిందో అర్థమవుతుంది. మరి ఏ దుకాణం నుంచి తరలించకపోతే నేరుగా మద్యం తయారీ డిస్టిలరీ కేంద్రాల నుంచే తరలించారా.. అన్నది తేలాల్సి ఉంది. అయితే ఆ దిశగా అధికారులు విచారణ చేస్తున్నారా.. అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఎందుకంటే ఇప్పటి వరకు జిల్లాలో వేల బాటిళ్ల మద్యం పట్టుకున్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. మరి ఆ మద్యం ఎక్కడి నుంచి బయటకు అక్రమ మార్గంలో వెళ్లిందన్నది మాత్రం తేల్చలేదు.

● ముందుగా వారికెలా తెలిసింది?

పంటపాలెంలో భారీ మద్యం డంప్ ఉన్నట్లు సీ విజిల్ యాప్ ద్వారా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు అందింది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సీ విజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులను బయటకు చెప్పకూడదు. మూడో కంటికి తెలియకుండా నేరుగా దాడులు నిర్వహించాలి. కానీ అధికారులు దాడులు చేయడానికి వస్తున్నారన్న విషయం మద్యం దాచిపెట్టిన వారికి ముందుగానే తెలిసిపోయింది. అధికారులు స్పాట్‌కు వెళ్లే సరికి డంప్ చేసిన మద్యాన్ని మూడు వాహనాల్లో తరలించేందుకు సిద్ధమయ్యారు. ఒక వాహనాన్ని అక్కడే పట్టుకోగా మిగిలిన రెండు వాహనాలను మరికొంత దూరం వెళ్లాక పట్టుకున్నట్లు తెలిసింది. అధికారులు రాక ముందే మరికొంత మద్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా మరో చోటకు తరలించినట్లు స్థానికంగా చెప్పుకుంటు న్నారు. మరి అధికా రులు దాడులకు వస్తున్నారన్న సమాచారం మద్యం డంప్ చేసిన వ్యక్తులకు ఎలా తెలిసిందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సెబ్, పోలీసు సిబ్బందిలో ఎవరో ఒకరు ఈ పని చేసి ఉంటారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● గుబులు పుట్టిస్తున్న గతం

2014 ఎన్నికల సమయంలో ఇతర రాష్ట్రాల్లో తయారు చేసిన కల్తీ మద్యాన్ని లేబుళ్లు మార్చి పేదలకు పంచారు. ఆ మద్యం తాగి పలువురు పేదలు ప్రాణాలు వదలగా, మరికొంత మంది ఆసుపత్రుల పాలయ్యారు. ఆ ఘటనలను తలుచుకొని ప్రజలు భయపడిపోతున్నారు. నాటి కల్తీ మద్యం కేసుల్లో ప్రస్తుత మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలు నిందితులుగా ఉండడం గమనార్హం.

మద్యం కేసులో నలుగురి అరెస్టు

ముత్తుకూరు : పంటపాలెంలో అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్న కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఎన్నికల ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఆధ్వర్యంలో శనివారం జరిగిన దాడుల్లో సెబ్, రెవెన్యూ, పోలీసుల సంయుక్త దాడుల్లో 1780 క్వార్టర్ బాటిళ్లు, 2452 వైట్ హోల్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వైసీపీ నాయకులు మారు సుధాకర్‌రెడ్డి, లోకవరపు వెంకట నారాయణ, పుచ్చలపల్లి నాగేశ్వరరావు, చిలకా రాములను అరెస్టు చేసినట్లు చేసి, మూడు కార్లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా మన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం బస్తాలు, అరెస్టు చేసిన వారితో సెబ్ అధికారులు

వీపీఆర్‌కు సొంత గ్రామస్థుల అభినందన



వీపీఆర్‌ను కలిసి అభినందనలు తెలిపిన ఇందుపూరు గ్రామస్థులు

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 21 : నెల్లూరు పార్లమెంటు స్థానం నుంచి ఎన్‌డీఏ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో ఆయన స్వగ్రామం అల్లూరు మండలం ఇందుపూరు గ్రామస్థులు ఆదివారం కలిశారు. నగరంలోని వీపీఆర్ నివాసంలో వేమిరెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. సోమవారం వీపీఆర్ నామినేషన్ వేయనున్నారు. ఈ విషయం తెలుసుకుని ఇందుపూరు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఆయన్ను కలిసి ఎన్నికల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేమిరెడ్డి మారుమూల గ్రామంలో పుట్టి పారిశ్రామిక వేత్తగా దేశవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించడం తమకెంతో గర్వకారణమన్నారు. వేమిరెడ్డికి భారీ మెజారిటీ వచ్చేందుకు గ్రామగ్రామాన ప్రచారం చేస్తామని చెప్పారు.

నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటిపై ఫిర్యాదు

ఆత్మకూరు, ఏప్రిల్ 21 : నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిపై ఆత్మకూరు మున్సిపల్ ఛైర్ పర్సన్ జి వెంకటరమణమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూడు రోజుల క్రితం మర్రిపాడు మండలంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో తనను కులం పేరుతో ప్రస్తావించడమేగాక అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆమె ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. కావున విచారణ జరిపి మేకపాటి రాజమోహన్‌రెడ్డిపై చర్యలు తీసుకుని, తనకు రక్షణ కల్పించాలని కోరారు.

కావలి కందుకూరు

కాకర్ల నామినేషన్‌కు తరలిరండి

కొండాపురం, ఏప్రిల్ 21: ఉదయగిరి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ సోమవారం నామినేషన్ వేస్తారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి రావాలని టీడీపీ లీగల్ సెల్ సభ్యుడు సందిరెడ్డి రామారావు, తదితరులు పిలుపునిచ్చారు. ఆదివారం వారు మండలంలో పర్యటించి మండల కన్వీనర్ ఎం ఓంకారం, పార్టీ పరిశీలకుడు పి సుబ్బారావు తదితరులతో చర్చించారు. మండలంలో కాకర్లకు 8 వేల ఓట్లకు పైగా మెజారిటీ తీసుకు రావాలని కోరారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం



కందుకూరు : సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కందుకూరు, ఏప్రిల్ 21: పట్టణంలోని కనిగిరి రోడ్డులో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపంలో ఆదివారం ఆలయ అర్చకులు శ్రీరామచంద్రాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువలా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి తిలకించారు. రామనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగగా గాయకుడు రాయసం రమేష్ భక్తిగానామృతంతో భక్తులు తన్మయత్వం చెందారు. ఆలయ స్థల దాతలు మందలపు వెంకటేశ్వర్లు, లక్ష్మమ్మ దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

● విశ్వనాథరావుపేటలో



బిట్రగుంట : కల్యాణ వేదికపై కొలువుదీరిన సీతారాములు

బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేట రైల్వే లోకో రామాలయంలో శ్రీరామనవ మి ఉత్సవాల్లో భాగం ఆదివారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఆల య అర్చకులు వేదగిరి నరేషాచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పసుపులేటి తిరుపతయ్య, సూర్యకళ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పసుపులేటి చెంచయ్య, సుజాత దంపతులు అన్నసంతర్పన కార్యక్రమం చేశారు. సాయంత్ర స్వామి అమ్మవార్ల ఊయల సేవ కార్యక్రమాలు జరిగాయి.

మహీధరరెడ్డి జన్మదిన వేడుకలు

కందుకూరు, ఏప్రిల్ 21: కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర రెడ్డి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఆదివారం కందుకూరులో ఘనంగా నిర్వహించారు. కొండికందుకూరు సర్పంచు కుమ్మర బ్రహ్మయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మహీధరరెడ్డి కార్యాలయంలో ఆయన అభిమానులు, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు కేకు కట్‌చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో రోగులకు, కోవూరు రోడ్డులోని దివ్యాంగుల పాఠశాలలోని చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. సన్నారెడ్డి సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని బొగ్గులసంఘం, విప్పగుంట రోడ్డు ప్రాంతాలలో నివశిస్తున్న నిరుపేద కుటుంబాలకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దండే రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ అంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదు..

బ్యాక్ బోన్ ఆఫ్ సొసైటీ : పసుపులేటి సుధాకర్

కావలిటౌన్, ఏప్రిల్ 21: బీసీ అంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదు.. బ్యాక్ బోన్ ఆఫ్ సొసైటీ అని పీఎస్సార్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పసుపులేటి సుధాకర్ అన్నారు. ఆదివారం ట్రంకురోడ్డు గాయత్రినగర్‌లోని తన కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని తన అనుచరులు, అభిమానులతో నిర్వహించిన సమావేశం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తాను రాజకీయాలు, కులమతాలు, ప్రాంతాలకతీతంగా పీఎస్సార్ ట్రస్ట్ ద్వారా సొంత నిధులతో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించానన్నారు. ఈ క్రమంలో కావలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు.

కలగా మిగిలిన డబుల్ రోడ్డు!

- ప్రతిపాదనల దశ దాటి పరిస్థితి
- లింగసముద్రం, వలేటివారిపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానం
- సింగిల్ రోడ్డుపై వాహనచోదకుల ఇబ్బందులు

లింగసముద్రం, ఏప్రిల్ 21 : ప్రతి నిత్యం రద్దీగా ఉండే లింగసముద్రం-వలేటివారిపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డు డబుల్ రోడ్డుగా మార్చాలన్న ప్రతిపాదనలు ఆచరణకు నోచుకోవడం లేదు. దీంతో వలేటివారిపాలెం నుంచి లింగసముద్రం మీదుగా రాళ్లపాడు ప్రాజెక్టు వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ సింగిల్ రోడ్డుపై ప్రయాణానికి వాహనచోదకులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. 2018లో అప్పటి కందుకూరు ఆర్‌అండ్‌బీ కార్యాలయ అధికారులు 14 కి.మీ ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అయితే నిధులు మంజూరయ్యేలోపు ప్రభుత్వం మారి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే 2018లోనే అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రస్తుత సీఎం జగన్మోహన్‌రెడ్డి ఈ గోతులమయమైన రోడ్డుపైనే పాదయాత్ర చేశారు. ఈ రోడ్డును ప్రత్యక్షంగా చూసినప్పటికీ ఈ రోడ్డు అభివృద్ధికి నిధులు మాత్రం మంజూరు చేయలేదు. దీంతో ఈ రోడ్డుకు మోక్షం కలగలేదు. అయితే రెండేళ్ల క్రితం కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి ఈ రోడ్డును డబుల్ రోడ్డుతో పాటు మోడల్ సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు పంపించారు. కానీ అది కూడా కార్యరూపం దాల్చలేదు. ఈ రోడ్డుపై పెదపవని మీదుగా కావలికి, కలిగిరి మీదుగా నెల్లూరు, చెన్నైకి, అలాగే కలిగిరి వింజమూరు మీదుగా బెంగళూరుకు వెళుతుంటారు. అలాగే కొండాపురం, మొగిలిచెర్ల, శాయిపేట గ్రామాల నుంచి లింగసముద్రం మీదుగా ప్రతినిత్యం కందుకూరు, ఒంగోలుకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ రోడ్డును ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై వాహనదారులు, ప్రజలు తీవ్ర విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.



డబుల్ రోడ్డుకు నోచుకోని లింగసముద్రం, వలేటివారిపాలెం రోడ్డు



సోమశిల నీరు అందక ఎండిన వరిపైరు (ఫైల్)

నీరందక.. పైర్లు పండక..!

- అల్లాడుతున్న ఆయకట్టు రైతులు
- సాగునీటి కాలువ డైవర్షన్ నిర్మాణానికి వైసీపీ మోకాలడ్డు
- బిల్లులు మంజూరు కాక ఆగిన పనులు
- కావలి, ఉదయగిరి ప్రాంత రైతులపై ప్రభుత్వం శీతకన్ను

జలదంకి, ఏప్రిల్ 21: ఈ ఏడాది రబీలో కావలి కాలువ ద్వారా సాగునీరందక కావలి, ఉదయగిరి ప్రాంతాల్లోని మాగాణి భూములు బీళ్లుగా మారాయి. సోమశిలలో పుష్కలంగా నీరున్నా కావలి కాలువ కింద జలదంకి మండలం చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయరు పనులు చేయకపోవడమే ఇందుకు ముఖ్య కారణం. చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) నిండితే కానీ సోమశిల జలాలు కాలువ చివరి ఆయకట్టు భూములకు అందవు. చివరి ఆయకట్టు భూములకు నీరందక ప్రతి ఏటా ఉదయగిరి, కావలి ప్రాంతాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇది గుర్తించిన అప్పటి ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావులు పరిస్థితిని అప్పటి సీఎం చంద్రబాబుకు వివరించి బైపాస్ కాలువకు రూ.34.45కోట్లు కేటాయింపులు చేయించారు.ఈ క్రమంలో 2019 మార్చి7న జలవనరుల మంత్రి దేవినేని ఉమ చేతుల మీదుగా సీబీఆర్ ఇన్‌ఫాల్ వద్ద కాలువ డైవర్షన్ పనులకు శంకుస్థాపన చేశారు.

రివర్స్ టెండరింగ్‌తో..

2019లో టీడీపీ అధికారం కోల్పోవడం, కొత్తప్రభుత్వం ఏర్పడడం జరిగింది. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 25శాతం లోపు జరిగిన పనులను గుర్తించి రివర్స్ టెండరింగ్ తీసుకువచ్చింది. కొత్తగా ఆహ్వానించిన టెండర్లలో రూ. 29.75కోట్లతో రీటెండర్ పనులు దక్కించుకున్న టీఎస్ఆర్ నిర్మాణ సంస్థ మట్టిపనులు చేపట్టింది. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో ఆ నిర్మాణసంస్థ పనులు ఆపేసింది. నాలుగేళ్ల క్రితం ఆగిన పనులు నేటికీ ప్రారంభం కాలేదు. ఆ నిర్మాణ సంస్థకు నేటికీ రాష్ట్రప్రభుత్వం పైసా కూడా ఇవ్వలేదు. చిరకాలం నుంచి బైపాస్ కాలువ నిర్మాణం చేయాలని పోరాటం చేసిన రైతులకు గత టీడీపీ ప్రభుత్వం తీపికబురు చెప్పగా, రైతాంగం ఆశలపై వైసీపీ ప్రభుత్వం నీళ్చచల్లింది. డైవర్షన్ పనులు పూర్తయితే కావలికాలువ చివరిఆయకట్టు భూములకు పుష్కలంగా నీరందే అవకాశం ఉంది. ఉదయగిరి, కావలి ప్రాంతాల వైసీపీ నాయకులు ఆదిశగా ప్రయత్నాలు చేసిన దాఖలాలు కూడా లేవు. ఫలితంగా వరినాట్లకు సాగునీరందక నిట్టనిలువునా ఎండిపోయాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతులపై వైసీపీ ప్రభుత్వం కపటప్రేమ ఒలకపోస్తున్నదనడానికి కావలి కాలువ బైపాస్ పనులు చేయపోవడమే ప్రత్యక్ష ఉదాహరణ.



అప్పటి ఇరిగేషన్‌శాఖ మంత్రి దేవినేని ఉమ ఆవిష్కరించిన కావలి కాలువ డైవర్షన్ పనుల శిలాఫలకం



బిల్లులు మంజూరు కాక నిలిచిపోయిన డైవర్షన్ కాలువ పనులు

బీఫారం అందుకున్న ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఏప్రిల్ 21: కందుకూరు నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదివారం బీఫాం అందజేశారు. ఈనెల 23న నామినేషన్ దాఖలు చేసేందుకు ముహూర్తం నిర్ణయించినందున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి ఆశీర్వదించి జయప్రదం చేయాలని నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు పామూరు రోడ్డులోని టీడీపీ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని, మధ్యాహ్నం 12 గంటలకు సబ్ కలెక్టరు కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తామని తెలిపారు.



చంద్రబాబు నాయుడు నుంచి బీఫారం అందుకుంటున్న ఇంటూరి నాగేశ్వరరావు


నకిలీ మద్యం కేసులో ఎమ్మెల్యేని అరెస్ట్ చేయాలి

● 36వ వార్డులో కావ్య క్రిష్ణారెడ్డి విస్తృత ప్రచారం

కావలి, ఏప్రిల్ 21 : నకిలీ మద్యం సరఫరా చేసి కొందరి ప్రాణాలను బలికొన్న కేసులో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డిని అరెస్ట్ చే యాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం ఆయన కావలి పట్టణం 39వ వార్డులో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే పేదలు నివాసం ఉండే ప్రాంతాల్లోనే కాలనీ ఇళ్లు కట్టించి ఇస్తామని భరోసా ఇచ్చారు. అభివృద్ధి జరగాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చేన వెంటనే అందచేసే సంక్షేమ పథకాల గురించి వివరించారు. పెంచిన పించన్ రూ.4 వేలు ఏప్రిల్ నుంచే అందజేస్తామన్నారు. కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. గ్రావెల్, ఇసుక, మట్టి అన్నీ దోచేశాడని, ప్రశ్నించిన వారిపై దాడులు చేశారన్నారు. దొంగే దొంగ అన్న చందంగా ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి సచివాలయంలో మద్యం దాచి పెట్టి తనిఖీలకు వస్తున్నారని తెలిసి టీడీపీ వారు దాచిపెట్టారని మభ్యపెట్టే మాటలు చెబుతున్నారన్నారు. తప్పు చేస్తే సిగ్గుపడే వారిని, తలదించుకునే వారిని చూశాము కానీ ఇలాంటి దుర్మార్గులను చూడలేదన్నారు. 2014లో నకిలీ మద్యంతో కొందరి ప్రాణాలను బలిగొన్న ప్రతాప్‌రెడ్డి అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారన్నా రు. అరాచక ఎమ్మెల్యేను తరిమి కొట్టి కావలి నియోజకవర్గ అభివృద్ధి కోసం నాకు ఒక్క అవకాశం ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ క్రిషోర్, మలిశెట్టి వెంకటేశ్వర్లు, కూరపాటి శ్రీనివాసులు, తాతా వెంకటేశ్వర్లు, పోట్లూరు జయలక్ష్మి, జనసేన నే తలు పొబ్బా సాయి విఠల్, మన్నేపల్లి రిషికేష్, పవన్, బీజేపీ నేతలు కే. బ్ర హ్మనందం, వింతా రంగా రెడ్డి, హూనూరు మాధవి తదితరులు పాల్గొన్నారు.



కావలి : 36వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న క్రిష్ణారెడ్డి



కావలి : చంద్రబాబు నుంచి బీఫారం అందుకున్న క్రిష్ణారెడ్డి

బీఫారం అందుకున్న కావ్య

కావలి నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డికి ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదివారం బీఫాం అందజేశారు.

టీడీపీ నేతల ముమ్మర ప్రచారం

అల్లూరు : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలో టీడీపీ నేతలు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఏ గ్రామానికి ఆ గ్రామంలో నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా ఎన్నికల ప్రచారాలు చేపట్టారు. మండలంలోని నార్తుమోపూరులో నెల్లూరు నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో బండి అమర్‌రెడ్డి, విడవలూరు దశరథరామిరెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లు తదితరులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. అలాగే పురిణి పంచాయతీలో నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మేనల్లుడు ఏ.చందన్‌రెడ్డిలు ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాసులు రెడ్డి, ఊటు శ్రీకాంత్ రెడ్డి, మర్రిబోయిన సురేంద్ర, నెట్టంబాక పోలయ్య, చేజర్ల హరీష్, షేక్ మహబూబ్ బాషా, ఎల్లు శీనయ్య, చింతల పోలయ్య, అరగల రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో భారీగా వైసీపీ నేతల చేరిక

బిట్రగుంట : బోగోలు మండలంలోనితాళ్లూరు పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు ఆదివారం మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, నేతలు కుంచాల తిరుమలేష్, లక్కాకుల మాధవరావుల ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. అరవపాలెం, చెంచులక్ష్మీపురం, అక్కరాజువారికండ్రికల నుంచి పలువురు బోగిరి ప్రభాకర్ ఆధ్వర్యంలో టీడీపీ కండువ కప్పుకున్నారు. ఎస్సీపాలెం పంచాయతీకి చెందిన ఆదిశేషయ్య యాదవ్, రాజు శ్రీనివాసులు రెడ్డి, నాగార్జున, ఇస్కాటి ప్రసాద్, పెయ్యల శీనయ్యల ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరగా వారికి దగుమాటి వేణుగోపాల్‌రెడ్డి పార్టీ కండువా వేశారు. మరోవైపు కావలి టీడీపీ అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డి సమక్షంలో అల్లిమడుగు, కడనూతల గ్రామాలకు చెందిన వారు పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, స్థానిక నేతలు అభివద్ధిని పట్టించుకోకపోవడంతోనే వైసీపీని వీడి టీడీపీలో చేరినట్లు తెలిపారు.



అల్లూరు : ప్రచారంలో పాల్గొన్న అమర్‌రెడ్డి, తదితరులు



బిట్రగుంట : టీడీపీలో చేరిన వారితో దగుమాటి వేణుగోపాల్‌రెడ్డి

నా భర్తను ఆశీర్వదించండి !

● ఇంటూరి సౌజన్య అభ్యర్థన

వలేటివారిపాలెం, ఏప్రిల్ 21 : కందుకూరు టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు సతీమణి ఇంటూరి సౌజన్య స్వగ్రామం మండలంలోని కళ్లవళ్లలో ఆదివారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తన భర్త విజయం కోసం గడప గడపకు వెళ్లి మీ ఇంటి ఆడపడుచుగా వచ్చా నా భర్తను ఆశీర్వదించండి అని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు బారీ సంఖ్యలో పాల్గొన్నారు.



మేనిఫెస్టో కరపత్రాలు అందజేస్తున్న ఇంటూరి సౌజన్య

టీడీపీలో ఎస్టీ కుటుంబాల చేరిక

కందుకూరు : నియోజకవర్గంలోని ఉలవపాడు మండలం చాకిచర్ల ఎస్టీ కాలనీ, సుబ్బరాయుడు సత్రంకు చెందిన పలు కుటుంబాల వారు ఆదివారం టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య సమక్షంలో టీడీపీలో చేరారు. ఎస్టీ కాలనీకి చెందిన మానికల వెంకయ్య, రవి, రమేష్, రఘురామయ్య, వెంకటేశ్వర్లు, పెదసుబ్బారావు, ప్రసాదు, సుబ్రహ్మణ్యం, అనిల్, సురేష్, మాల్యాద్రి, సింహాద్రి, మురళి, నరేంద్ర, హరిబాబు, తిరుమల తదితరులకు ఆమె పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అలాగే సుబ్బరాయుడుసత్రం నుంచి తాటి అభిజిత్, గుత్తా బాలకోటేశ్వరరావు, మలిశెట్టి బాలకోటయ్య, నిమ్మల సుధాకర్, చొక్కరాతి బాలకృష్ణ, సాయి, పాములపాటి వెంకటేశ్వర్లు, మునగపాటి నాని, భావన సుబ్బారావు, కొప్పోలు రమణయ్య తదితరులు వైసీపీని వీడి ఇంటూరి సౌజన్య సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మిరియం మల్లికార్జున, తెలుగుదేశం పార్టీ నాయకులు ఎందేటి శ్రీను, చాతల భాస్కర్, సుదర్శి సాంబయ్య, పరమాల వెంకటేశ్వర్లు, రామకృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాజీనామా చేయాలని వలంటీర్లపై ఒత్తిడి!

- బలవంతంగా 30 మంది రిజైన్
- కేటాయించిన కుటుంబాల ఓట్ల బాధ్యత వారిదే..
- డబ్బు, మద్యం పంపిణీకి సిద్ధంగా ఉండాలంటున్న వైసీపీ నేతలు?

ఉలవపాడు, ఏప్రిల్ 21 : ప్రస్తుతం జరగనున్న సార్వత్రిక ఎన్నికలు వైసీపీ ప్రభుత్వానికి చావోరేవో తేల్చుకోవాల్సిన పరిస్థితి కావడంతో ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోకూడదని వైసీపీ నేతలు పథకాలు రచించుకుంటున్నారు. అందులో భాగంగా మండలంలోని వలంటీర్లపై ఒత్తిడి తెస్తూ రాజీనామాలు చేయిస్తున్నారు. మండలంలోని 16 సచివాలయాల పరిధిలో 285 మంది వలంటీర్లు ఉన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ మొదలు ఇప్పటి వరకు 30 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. భీమవరం గ్రామంలోని 2 సచివాలయాల పరిధిలో 28 మంది వలంటీర్లు ఉండగా వైసీపీ కోసం ప్రత్యక్షంగా ఎన్నికల ప్రచారం చేసేందుకు 26 మంది ఒకేసారి రాజీనామాలు చేయడం విశేషం. అలాగే ఉలవపాడు సచివాలయం3, పెదపట్టపుపాలెం నుంచి నలుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. ఇవి ఇంకా పెరిగే అవకాశాలు లేకపోలేదు. ఇదేవిధంగా కొన్ని గ్రామాల నుంచి కూడా ఒత్తిడి ఎదుర్కొంటున్నట్లు సమాచారం. చంద్రబాబునాయుడు వలంటీర్లకు రూ.10.000 ప్రకటించడం కూడా కొంతమేర వలంటీర్లలో ఆశలు పుట్టించడంతో రాజీనామాలకు కొందరు వలంటీర్లు ససేమేర అంటున్నారు. అలాంటి వాళ్లను స్థానిక వైసీపీ నాయకత్వం బెదిరింపులకు దిగుతున్నారు.

● వలంటీర్లపైనే ఆధారపడుతున్న వైసీపీ శ్రేణులు


వలంటీర్లకు కేటాయించిన 50 కుటుంబాలకు సంబంధించిన ఓట్ల బాధ్యత వారిదేనని వైసీపీ స్థానిక నేతలు ఒత్తిడ్డి చేస్తున్నట్లు సమాచారం. ప్రతిరోజు వలంటీర్ల పరిధిలోని ఇళ్లకు వెళ్లి వైసీపీ ప్రభుత్వ పథకాలను వివరించడం, జగన్ మళ్లీ రాకుంటే పథకాలు ఆపేస్తారని ప్రచారం చేయాలని నేతలు చెప్తున్నారని రాజీనామా చేయడం ఇష్టం లేని కొందరు వలంటీర్లు చెబుతున్నారు. ప్రతి ఇంటికి ఎన్నికల తాయిలాలు డబ్బు, మద్యం పంపిణీ కూడా రాజీనామ చేసిన వలంటీర్లు తీసుకొని బాధ్యతగా పనిచేయాలని, పార్టీ ఆదేశాలను తప్పక పాటించాలని స్థానిక నాయకులు మార్గనిర్దేశకాలు చేసినట్లు తెలుస్తోంది. దీంతో కొందరు వలంటీర్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు.

మాటిస్తే ఓటు వేసే వాళ్లం...



నాకు 73 ఏళ్లు. గతంలో జరిగిన ఎన్నికలకు, నేడు జరుగు తున్న ఎన్నికలకు తేడా గమనించా.అప్పట్లో నాయకులు గ్రామాల్లో ఇళ్లకు వచ్చినప్పుడు మాట ఇస్తే, ఎదుటి వాళ్లు ఎంత ప్రయ త్నించినా మొదట చెప్పిన వారికే ఓటు వేసే వాళ్లం. ఇప్పుడు ఈరోజు ఓ పార్టీ రేపొక పార్టీలో తిరు గుతున్నారు. అప్పట్లో పోటీ చేసిన అభ్యర్థుల ఖర్చులకు మేమే చందాల వేసి డబ్బులు ఇచ్చేవాళ్లం.

- కొండాపురం





చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా నెల్లూరు ఎంపీ స్థానానికి భిన్నవ్యక్తిత్వాల మధ్య పోరు నడుస్తోంది. టీడీపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి (వీపీఆర్), వైసీపీ అభ్యర్థిగా వేణుంబాక విజయసాయిరెడ్డి (వీఎస్ఆర్)ల మధ్య ప్రతిష్టాత్మక పోటీ సాగుతోంది. కొద్ది రోజుల క్రితం వరకు వీరిద్దరూ ఒకే పార్టీ నేతలు. ఇద్దరు కూడా రాజ్యసభ సభ్యులే. అంతేకాదు ఒకే జిల్లా వాసులు. అయితే వీరి వ్యక్తిత్వాలు మాత్రం పూర్తిగా భిన్నమైనవిగా ప్రజలు భావిస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని వందలాది గ్రామాలు వీపీఆర్‌ను జలదాతగా గుర్తుంచుకుంటే.. విజయసాయి మాత్రం సొంత ఊరికి ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఏదోరకంగా తమను ఆదుకుంటారని నమ్మకంతో ప్రజలు వీపీఆర్ ఇంటికి క్యూ కడుతుంటే.. విజయసాయి రాజకీయ కక్షదారుడని విశాఖవాసులు ఘోషిస్తున్నారు. గో బ్యాక్ అంటూ నినదిస్తున్నారు. పేద విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పించే విద్యాదాతగా వీపీఆర్‌ను జిల్లా ప్రజలు గుర్తుంచుకుంటే.. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని రాజకీయ కేంద్రంగా మార్చిన నింద విజయసాయిని వెంటాడుతోంది. ఇలా.. వీరిద్దరి మధ్య వెలుగుకు, చీకటికి ఉన్నంత తేడా కనిపిస్తోందనేది జనవాక్యం. ఈ రసవత్తర పోరులో ప్రజలు ఎటువైపు నిలుస్తారు... ఎవరిని ఆదరిస్తారు? అనే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ నడుస్తోంది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

భిన్నవ్యక్తిత్వాల మధ్య పోరు

ఎవరిదో జోరు!

- నెల్లూరు పార్లమెంటుకు వేమిరెడ్డి వర్సెస్ వేణుంబాక !
- జిల్లావ్యాప్తంగా సేవలతో వీపీఆర్
- సొంత ఊరికే చుక్కలు చూపించిన వీఎస్ఆర్
- జలదాతగా ప్రభాకరుడు
- అవినీతి మరకలతో విజయసాయి

వీపీఆర్‌కు దాతగా గుర్తింపు

వీపీఆర్ రాజకీయాల్లోకి అడుగు పెట్టకముందు నుంచే దాతగా జిల్లా ప్రజల్లో గుర్తింపు పొందారు. వీపీఆర్ ట్రస్ట్ స్థాపించి వ్యాపార రంగానికి సమాంతరంగా జిల్లాలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఫ్లోరైడ్ బాధిత గ్రామాల ప్రజల దృష్టిలో జలదాతగా గుర్తింపు పొందారు. సొంత నిధులతో వందకు పైగా మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. పేద విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్న ఉద్దేశంతో ఎనిమిదేళ్ల క్రితమే పాఠశాల స్థాపించారు. అక్కడుండేవారికి పుస్తకాలు, భోజన వసతిని ఉచితంగానే అందజేస్తున్నారు. జిల్లాతోపాటు దేశ వ్యాప్తంగా ఎన్నో అనాథ శరణాలయాలకు విరాళాలు అందజేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు, ఆలయాల పునరుద్ధరణకు భారీ మొత్తాలను అందించారు. వీటన్నింటికి మించి సాయం కోరిన వారిని ఒట్టి చేతులతో పంపని మంచి వ్యక్తిగా ప్రజల దృష్టిలో నిలిచారు. ఈ కార్యక్రమాలే ఆయనకు రాజకీయ పదవులు తెచ్చిపెట్టాయి. అయితే కుట్ర రాజకీయాలను జీర్ణించుకోలేక వైసీపీని వీడి టీడీపీలో చేరారు. దీంతో పక్షం రోజుల పాటు ఆయన నివాసానికి జనం పోటెత్తివచ్చి సంఘీభావం తెలిపారు. ఆరేళ్లపాటు వైసీపీలో క్రియాశీల నాయకుడిగా వ్యవహరించినా, చిన్న అవినీతి మరక కూడా లేకుండా బయటకు వచ్చారు. ఆయన పార్టీలో చేరిక సందర్భంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడే స్వయంగా నెల్లూరుకు వచ్చి వీపీఆర్ దంపతులకు స్వాగతం పలికారు. ఆ దంపతులు టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేసే క్రమంలో ప్రత్యర్థుల నుంచి తీవ్ర విమర్శలు ఎదురైనా మౌనంగానే ఉండిపోయారు. తన గురించి నీతి లేని వ్యాఖ్యలు చేసే వారి సంగతి ఆ దేవుడే చూసుకుంటాడని ఓర్పు వహించారు. రాజకీయాల్లో వివాద రహితుడిగా, అజాత శత్రువుగా గుర్తింపు పొందారు.

విశాఖను వణికించిన వీఎస్ఆర్

నెల్లూరు ముద్దుబిడ్డగా ప్రచారం చేసుకుంటున్న విజయసాయిరెడ్డి జిల్లాకు చేసిన సేవ ఏదైనా ఉందా ? అంటే ఏమి లేదనే చెప్పాలి. చివరకు సొంత ఊరికి కూడా పెద్దగా ఏమి చేయలేదు. సుమారు 12ఏళ్ల పాటు రాజ్యసభ సభ్యుడిగా, వైసీపీలో నంబర్ 2గా గుర్తింపు పొందిన వీఎస్ఆర్ తన మార్కు కనిపించేలా జిల్లాకు ఒక్క పని కూడా చేయలేదు. సర్వేపల్లి నియోజకవర్గం ముత్తుకూరు మండలం, తాళ్లపాక ఆయన సొంతూరు. రెండున్నరేళ్ల క్రితం ఆ గ్రామాన్ని ఆయన దత్తత తీసుకున్నారు. కమ్యూనిటీ హాల్, కల్యాణ మండం కట్టిస్తానన్నారు. రూ.14 కోట్లతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. అవేవి చేయలేదు. ప్రభుత్వ నిధులతో నాలుగు రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు వేశారు తప్ప ఆయన సొంత నిధులు రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. ఇకపోతే ప్రభుత్వ నిధులతోనైనాసరే ఇచ్చిన ప్రధాన హామీలు నెరవేర్చలేకపోయారు.

జాతీయస్థాయిలో గుర్తింపు

ఇక పేరు ప్రఖ్యాతుల విషయానికి వస్తే జాతీయ స్థాయిలో ప్రచారంలోకి వచ్చారు. జగన్ అక్రమాస్తుల కేసులో ఏ-2 నిందితుడిగా ఈడీ కోర్టుల చుట్టూ తిరుగుతు న్నారు. విశాఖపట్నం విషయంలో మరోసారి జాతీయస్థాయిలో వార్తల్లోకి ఎక్కారు. విశాఖ జిల్లాలో ప్రతిపక్ష పార్టీ నాయ కుల ఆర్థిక మూలాలను దెబ్బ తీయడమే ధ్యేయంగా కుట్రలు పన్నారనే అభియో గాలు ఎదుర్కొన్నారు. రాజకీయ కక్షలతో గీతం వర్సిటీ ప్రహరీ పడగొట్టారని, విశాఖ మాజీ ఎంపీ, మాజీ మేయర్ ఇంట్లో ప్రభుత్వ స్థలం కలిసి ఉందని ఆ ఇల్లు పడగొట్టించారని, గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ఆపిం చారని పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. 50 ఏళ్లుగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న రూ.వేల కోట్ల విలువ జేసే దసపల్ల భూములను నిషేధిత జాబితా నుంచి తొల గించి తమ వారి పేర్లు మీద రెవెన్యూ రికార్డుల్లో ఎక్కించుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూముల్లో విజయసాయి బినామీలు అపార్టుమెంట్లు కడుతు న్నారని, ఆ అపార్టుమెంట్లకు వెళ్లే వంద అడుగుల రోడ్డు కూడా ప్రభుత్వ సొమ్ము తో వేస్తున్నారని విశాఖ నగరం ఘోషించింది. కేంద్రం నిధులతో నిర్మిస్తున్న విశాఖ బీచ్- భోగాపురం బీచ్ వరకు కోస్టల్ కారిడార్ పథకం కింద నిర్మిస్తున్న నాలుగు లైన్ల రోడ్డును విజయసాయి పథకం ప్రకారం భీమిలి వైపు మళ్లించాడని, అంతకుముందే అక్కడున్న భూములను కారుచౌకగా కొనుగోలు చేసి, రోడ్డు వచ్చిన తరువాత అధిక ధరకు అమ్ముకున్నాడని విశాఖ కోడై కూసింది. అంతేకాక ఆంధ్ర యూనివర్సిటీని సైతం విజయసాయి రాజకీయ కేంద్రంగా మార్చారనే విమర్శలు వెల్లువెత్తాయి. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను ఎంపిక చేసే బాధ్యత ఆంధ్రవర్సిటీ వీసీ ప్రసాద్‌రెడ్డికి అప్పగించారని, దీంతో టికెట్ కోసం వచ్చే రాజకీయ నాయకులతో ఆంధ్రవర్సిటీ రాజకీయ కేంద్రంగా మారిపోయిందని పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ఐదేళ్లుగా విజయసాయికి వ్యతిరేకంగా విశాఖలో తరచూ ఉద్యమాలు, నిరసనలు జరుగుతూనే ఉన్నాయి.



వ్యవసాయ కూలీలకు భలే గిరాకీ!

- సేద్యం పనులు లేకపోయినా ప్రచారంతో ఉపాధి

రాజకీయ ఉపాధి

సార్వత్రిక ఎన్నికల సమరం మొదలవడంతో వ్యవసాయ కూలీలకు గిరాకీ పెరిగింది. అభ్యర్థుల ప్రచారాలకు జనాదరణ కోసం ఆయా రాజకీయా పార్టీల నేతలు రైతు కూలీలను తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం రబీ వ్యవసాయ సీజన్ పూర్తయి రైతాంగమంతా ఎడగారుకు హాలిడే ప్రకటించడంతో వ్యవసాయ కూలీలకు పనులు లేకుండాపోయాయి. ఇదే సమయంలో ఎన్నికలు రావడంతో సేద్యం పనులకు ప్రత్యామ్నాయంగా ప్రచారాలు కలిసొచ్చాయి. దీంతో మనిషి లెక్కల కోసం ఇంట్లో భార్యభర్తలతోపాటు పిల్లలను సైతం ఎన్నికల ప్రచారాలకు తీసుకెళ్తున్నారు. నారేతలు, కలుపు, వడ్ల లోడింగ్‌లకు కూలీలను తీసుకెళ్లే మేస్త్రీలకు ప్రస్తుతం ఎక్కడా లేని గిరాకీ ఉంది. ఎన్నికల ప్రచారాలకు వచ్చిన వారికి రూ.300లతోపాటు భోజనం పెట్టిస్తున్న అభ్యర్థులు కూలీలను తీసుకువచ్చిన మేస్త్రీలకు ప్రత్యేక ప్యాకేజీలను అందిస్తున్నారు. కూలీల డిమాండ్‌ను బట్టీ వీరికి ఆఫర్లు ఇస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో ఉదయం ఒక పార్టీకి వెళ్లిన వ్యవసాయ కూలీలు సాయంత్రం మరో పార్టీకి వెళ్లి రోజుకు రూ.600 చొప్పున కూడా సంపాదించుకుంటున్నారు.

- నెల్లూరు రూరల్

ఓటు... భలే రేటు !

అదీ మందు

నియోజకవర్గంలో అసలు పోరు ఇప్పుడే ఆరంభమైంది. ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఎవరెవరు ఎన్నికల బరిలో ఉండేది తేలిపోయింది. ఆత్మకూరులో ప్రధానంగా టీడీపీ, వైసీపీల మధ్యే పోటీ నెలకొంది. అటు రామనారాయణరెడ్డి, ఇటు విక్రమ్‌రెడ్డి బలమైన వారు కావడంతో ఓటుకు భలే గిరాకీ ఏర్పడింది. దీంతో అభ్యర్థులు కూడా డబ్బు మూటలతో సిద్ధమవుతు న్నారు. ఈసారి ఇక్కడ ఎన్నికల ఖర్చు రూ.100 కోట్లకు పైమాటేనని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గత ఎన్నికల కంటే ఈసారి డబ్బు పంపిణీ మూడు నుంచి నాలుగురెట్లు ఉంటుందని పార్టీ వర్గాలు అంచనాలు వేస్తున్నాయి. కాగా ఈసారి ఎన్నికల్లో కులంతో పాటు డబ్బుకు ప్రాధాన్యం పెరిగింది. ద్వితీయ శ్రేణి నేతలకు ప్రధానపార్టీల అభ్యర్థులు డబ్బుతో ఎర వేస్తున్నారు. దీంతో ఓ పార్టీ నుంచి మరో పార్టీలోకి వలసలు పెరుగుతున్నాయి. నియోజకవర్గంలోని అనంతసాగరం, ఏఎస్‌పేట, చేజర్ల, సంగం, ఆత్మకూరు, మర్రిపాడు మండలాల్లో కొంతమంది ద్వితీయ శ్రేణి నాయకులకు డిమాండ్ ఏర్పడింది. వీరికి గాలం వేసేందుకు అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ప్రచారానికి వచ్చే కార్మికులకు కూడా గిరాకీ పెరిగింది. ఒక్కొక్క చోట అభ్యర్థి వెంట వచ్చేవారికి రూ.300 నుంచి రూ.700లు వరకు ఇస్తున్నారు.

- ఆత్మకూరు

అంతా కలసిపోయారు !



గతంలో వారంతా రాజకీయ ప్రత్యర్థులు. ఎక్కడైనా ఎదురు పడితే కూడా ఒకరివైపు ఒకరు చూసుకునేవారు కాదు. తాజా రాజకీయ పరిణామాలు వారిని మార్చేశాయి. 1999, 2004, 2009లో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, 2012 ఉపఎన్నికల్లో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, బొల్లినేని వెంకటరామారావు, 2014లో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, బొల్లినేని వెంకటరామారావు, పీ. చెంచల బాబు యాదవ్, 2019లో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, బొల్లినేని వెంకటరామారావులు టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ తరఫున ఉదయగిరిలో పోటీ చేశారు. రాజకీయ ప్రత్యర్థులుగా కత్తులు దూసుకున్నారు. అయితే ప్రస్తుతం వారంతా ఒక్కటయ్యారు. ఉదయగిరి నియో జకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ విజయానికి పాటుపడుతున్నారు. ఈ క్రమంలో వారు కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డితో కలసి శనివారం రాత్రి నెల్లూరులోని ఓ హోటల్‌లో తాజా రాజకీయ పరిస్థితులు, కాకర్ల విజయానికి చేపట్టే చర్యలపై చర్చలు జరిపారు. ఆ ఫొటో కాస్త సోషల్ మీడియా వైరల్ కాగా, జిల్లాలో చర్చనీయాంశమైంది. అందుకే అంటారు రాజకీయా ల్లో ఎవరూ మిత్రులు కాదు.. శత్రువులు కాదని..!

- ఉదయగిరి రూరల్



అంకమ్మ దర్శనం ఆనవాయితీ

- నాయకుడు ఎవరైనా.. పార్టీ ఏదైనా..!

సెంటిమెంట్

పార్టీ ఏదైనా.. నాయకుడు ఎవరైనా కందుకూరులో గ్రామదేవత అంకమ్మను దర్శించుకోవాల్సిందే. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించాకే ఏ కార్యక్రమమైనా ప్రారంభించాల్సిందే. కొన్ని దశాబ్దాలుగా ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులు కానీ నాయకులు కానీ ఈ సెంటిమెంట్‌ను బలంగా నమ్ముతారు. ఒకరిద్దరు నాయకులు ఈ ఆనవాయితీని పట్టించుకోనప్పుడు వారిని విజయం వరించలేదన్న నమ్మకం కూడా బలంగా ఉంది. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి అంకమ్మ అన్న బలమైన విశ్వాసం ఈ ప్రాంత ప్రజల్లో ఉండటమే ఇందుకు కారణం. పాతతరం నేతలు దివి కొండయ్య చౌదరి, మానుగుంట ఆదినారాయణరెడ్డి, ఇతర నేతలు ఈ సాంప్రదాయాన్ని పాటించారు. ఆతర్వాత తరానికి చెందిన మానుగుంట మహీధరరెడ్డి, దివి శివరాంలు కూడా ఇదే సాంప్రదాయాన్ని కొనసాగించారు. మొదట్లో ఈ సెంటిమెంట్‌ను అంతగా పట్టించుకోని మహీధరరెడ్డి ఆతర్వాత కాలంలో అమ్మవారి మహత్యాన్ని గుర్తించి, పాటించారు. ప్రస్తుత నేతలు ఇంటూరి నాగేశ్వరరావు, బుర్రా మధుసూదన్‌యాదవ్, ఇంటూరి రాజేష్ తదితరులు సైతం ఈ సెంటిమెంట్‌ను ఫాలో అవుతున్నారు.

- కందుకూరు

ఇది కొన్ని వేల కుటుంబాల సమస్య. ఓ చోటేమో వర్షం కురిస్తే బ్రిడ్జి మునిగిపోతుంది. ఆ గ్రామానికి వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పడవల్లో వెళ్లాల్సి ఉంటుంది. మరో చోటేమో ఎప్పుడో నిర్మించిన బ్రిడ్జి అది. ఎప్పుడు కూలిపోదామా అని ఎదురుచూస్తోంది. ముత్తుకూరు, వెంకటాచలం మండలాల్లోని ఈ రెండు చోట్లా కొత్త వంతెనలు నిర్మించేందుకు 2022లో జిల్లాకు వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేస్తున్నట్లు స్వయంగా ప్రకటించారు. ఏడాదన్నర గడిచినా కనీసం టెండర్లు కూడా పూర్తి చేయలేకపోయారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చిన్న బ్రిడ్జిని కూడా నిర్మించలేకపోయారని ఆ రెండు మండలాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కరొస్తే ఒట్టు

వంతెన కష్టాలు

ఎప్పటికి తీరేనో!?

- నక్కలవాగు, ఉప్పుటేరులపై ప్రమాదకరంగా బ్రిడ్జీలు
- కొత్తవి నిర్మాణానికి ఏడాదిన్నర క్రితం సీఎం జగన్ హామీ
- నిధులు మంజూరైనా ముందుకురాని కాంట్రాక్టర్లు
- చొరవ చూపని పాలకులు, అధికార యంత్రాంగం
- ముత్తుకూరు, వెంకటాచలం మండలాలకు శాపం

నెల్లూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ముత్తుకూరు మండలం పొట్లెంపాడు వద్ద నక్కల వాగుపై ఉన్న బ్రిడ్జిని దశాబ్దాల క్రితం నిర్మించారు. ప్రస్తుతం ఈ బ్రిడ్జికి రెండు వైపులా గోడలు దెబ్బతిని ఎప్పుడు కూలిపోతుందో తెలియని దుస్థితి నెలకొంది. అందులోనూ ఇది చిన్న బ్రిడ్జి కావడంతో రాకపోకలు ఇబ్బందిగా మారింది. ముత్తుకూరు, బ్రహ్మదేవిల నుంచి పొట్లెంపాడు వెళ్లేందుకు ఇదొక్కటే మార్గం. నక్కలవాగు పైనున్న బ్రిడ్జి మీదుగానే వెంకటాచలం మండలానికి కనెక్టివిటీ ఉంది. నక్కలవాగుపై బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మించాలని పరిసర గ్రామాల ప్రజలు ఎప్పటి నుంచో కోరుతూ వస్తున్నారు. అలానే వెంకటాచలం మండలం తిరుమలమ్మపాలెం వద్ద ఉప్పుటేరు మీద ప్రస్తుతం చిన్న బ్రిడ్జి ఉంది. తిరుమలమ్మపాలెం వెళ్లేందుకు ఇదొక్కటే మార్గం. వర్షం కురిస్తే ఉప్పుటేరు పొంగుతుంది. అప్పుడు బ్రిడ్జి కూడా మునిగిపో తుంది. ఆటు పోట్లు వచ్చినప్పుడు కూడా ఇదే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ సమయంలో రాకపోకలకు పడవలే దిక్కు. ఇది ప్రమాదకరం కావడంతో కొత్త బ్రిడ్జి నిర్మించాలని తిరుమలమ్మపాలెం గ్రామ ప్రజలు కోరుతూ వస్తున్నారు. ఈ క్రమంలో 2022 అక్టోబరులో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృష్ణ పట్నం థర్మల్ ప్లాంట్ యూడో యూనిట్ ప్రారంభానికి జిల్లాకు విచ్చేశారు. ఆ సందర్భంగా నక్కల వాగు, ఉప్పు టేరులపై బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నట్లు సీఎం సభా వేదికపై ప్రకటించారు. నక్కల వాగుపై బ్రిడ్జికి రూ.10 కోట్లు, ఉప్పుటేరుపై బ్రిడ్జికి రూ.12 కోట్లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆ వెంటనే ఈ పనులను ఆర్‌అండ్‌బీ అధికారులకు అప్పగించారు. ఈ రెండు బ్రిడ్జిలకు ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపారు.

చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా ప్రభుత్వం వేధిస్తుండటంతో కొత్తగా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఈ రెండు బ్రిడ్జీల విషయంలో కూడా ఇదే జరిగింది. ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపిన ఆరు నెలలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు కేటాయిస్తూ పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. ఉప్పుటేరుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.13 కోట్లు, నక్కల వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేస్తున్నట్లు గతేడాది జూన్‌లో జీవోలు వెలువడ్డాయి. ఆగస్టు తర్వా త అధికారులు ఈ రెండు వంతెనలకు రెండు సార్లు టెండర్లు ఆహ్వానిం చారు. కానీ ఒక్కరంటే ఒక్క కాంట్రాక్టర్ కూడా బిడ్ దాఖ లు చేయ లేదు. స్వయంగా సీఎం హామీ ఇచ్చిన పనులు కూడా జరిగే పరిస్థితి లేకుండా పోయిందంటే వాస్తవాలను అర్థం చేసుకోవచ్చు. కాంట్రాక్టర్లను రప్పించి వెంకటాచలం, ముత్తుకూరు మండలాల ప్రజలకు అవసరమైన బ్రిడ్జిలను నిర్మించడంలో మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. నిధులు ఇస్తున్నామని ప్రకటించి ప్రజ లను మభ్యపెట్టారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ముత్తుకూరు : ప్రమాదకరంగా నక్కలవాగుపై బ్రిడ్జి

మరోసారి టెండర్లు పిలుస్తాం!

నక్కలవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.10 కోట్లు, ఉప్పుటేరుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.13 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. వాటికి అనుగుణంగా టెండర్లు పిలిచాం. కానీ ఒక్క కాంట్రాక్టర్ కూడా టెండర్ వేయలేదు. ఎన్నికల కోడ్ ముగిశాక మరోసారి టెండర్లు పిలుస్తాం.

- ఎం గంగాధర, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ



వెంకటాచలం : తిరుమలమ్మపాలెం వద్ద ఉప్పుటేరుపై బ్రిడ్జి

కోవూరు సర్వేపల్లి

జగనన్న ఇళ్లు మొండి గోడలకే పరిమితం..!

దిక్కుతోచని స్థితిలో లబ్ధిదారులు

తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 21: మండలంలోని కొత్తపాలెం, వెంకన్న పాలెం, వరిగొండ పంచాయతీలలో సుమారు 300 జగనన్న గృహ నిర్మాణాలు మొండిగోడలకే పరిమితమయ్యాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేద వర్గాలకు తామే గృహాలు కట్టిస్తామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు అండగా ఉంటామని వైసీపీ పాలకులు చెప్పిన మాటలు నీటిమూటలుగానే మిగిలిపోయాయని వాపోతున్నారు. ఒక్కో గృహానికి సుమారు రూ.45వేలు నుంచి రూ.55వేలు లబ్ధిదారులు ఖాతాల నుంచి డ్రా చేసి కాంట్రాక్టర్ చేతికి ఇచ్చారు. రెండు నెలలకే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి ఇస్తామన్న కాంట్రాక్టర్ ఆచూకీ ఇప్పటికీ తెలియరాలేదని జేస్ లెవల్ వరకు కట్టినట్లు గృహ నిర్మాణ శాఖాధికారుల సహాయం తో బిల్లులు చేయించు కున్నట్లు లబ్ధిదారుల ద్వారా తెలుస్తోంది. మొత్తంమీద జగనన్న గృహ నిర్మాణాలు పూర్తికాకపోవడంతో లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.


కొత్తపాలెంలో మొండిగోడలుగా దర్శనమిస్తున్న జగనన్న ఇళ్లు

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

పొదలకూరు, ఏప్రిల్ 21: ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కె ఆరీఫ్ హాఫీజ్ సీఐ రాంబాబుకు సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ ఆదివారం పొదలకూరు పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పొదలకూరు సర్కిల్ ఆఫీసు పరిధులు, భౌగోళిక స్థితిగతులు, క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లు, తాజా పరిస్థితులు, తదితర వివరాలను సీఐ రాంబాబును అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉంటూ, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేలా సంసిద్ధంగా ఉండాలన్నారు. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. చెక్‌పోస్టు వద్దే కాకుండా ప్రత్యామ్నాయ దారులపై కూడా నిఘా ఉంచాలన్నారు. అన్ని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో కేంద్ర సాయుధ దళాలతో రూట్ మార్చ్ నిర్వహించి ప్రజలు వారి ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా భరోసా కల్పించాలని ఆదేశించారు. ఎన్నికల ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్లను వెంటనే బైండోవర్ చేసి, వారి కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. నాన్‌బెయిలబుల్ వారెంట్లను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఎన్నికల నియమ నిబంధలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నియమావళిని అందరూ పాటిస్తూ వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమించినట్లు సమాచారం తెలిస్తే సీ విజిల్ యాప్ ద్వారా, టోల్‌ఫ్రీ నెంబరు 112కు కాల్ చేసి, సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.



పొదలకూరు పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్

బుచ్చి టీడీపీలో ఇక ప్రశాంతం

● ఒక్కటైన పాత, కొత్త నేతలు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 21: బుచ్చి టీడీపీలో ఇక ప్రశాంతమేనని పలువురు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం బుచ్చిరెడ్డిపాళెం లోటస్ గ్రాండ్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పాత, కొత్త టీడీపీ ప్రధాన నాయకులు ఒక్కటయ్యారు. దీంతో నాయకుల మధ్య సఖ్యత కుదిరినట్టేనని పలువురు పేర్కొంటున్నారు. సమావేశమైనవారిలో ఎంవీ శేషయ్య, హరికృష్ణ, ఏటూరి శివరామకృష్ణారెడ్డి, ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, పుట్టా సుబ్రమణ్యంనాయుడు, వింజం రామానాయుడు, దుగ్గిశెట్టి హరనాథ్, తిరువాయిపాటి నందకుమార్, కావలి వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఘనంగా శ్రీవారి వసంతోత్సవాలు

రాపూరు(డక్కిలి), ఏప్రిల్ 21: పెంచలకోన క్షేత్రంలో ఆదివారం శ్రీవారి వసంతోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం విశేష పూజలు సాయంత్రం అగ్ని ఆరాధన, శేషవాహన సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానార్చకులు వేదపండితులు వేదమంత్రోచ్చారణ మధ్య వసంతోత్సవాలు నిర్వహించారు. అలాగే భక్తుల సౌకర్యార్థం అన్న సంతర్పణ, తాగునీటి సరఫరా చేసినట్లు ఉప కమిషనర్, కార్యనిర్వాహణాధికారి కేవి సాగర్‌బాబు తెలిపారు.

కోవూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నారపరెడ్డి

మనుబోలు, ఏప్రిల్ 21: కోవూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మండలంలోని అక్కంపేట గ్రామానికి చెందిన నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి టిక్కెట్ దక్కించుకున్నారు. పదేళ్ళుగా నారపరెడ్డి వైసీపీలో ఉంటూ, మంత్రి కాకాణికి గడిచిన రెండు ఎన్నికల్లో ముఖ్య అనుచరుడిగా ఉన్నాడు. గతనెలలో కాంగ్రెస్ గూటికి చేరిన కిరణ్‌రెడ్డి అధ్యక్షురాలు షర్మిల అండదండలతో ఏకంగా ఎమ్మెల్యే టిక్కెట్ సాధించడం విశేషం.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

విడవలూరు : రామతీర్థం, రామలింగాపురం గ్రామానికి చెందిన తంబి రవి, సుకుమార్, సురేష్, శివకృష్ణ వారి అనుచరులు సుమారు 100 మంది వైసీపీ కార్యకర్తలు స్థానిక టీడీపీ నాయకులు ఆవుల వాసు, శ్రీహరికోట గోపి ఆధ్వర్యంలో కోవూరు ఉమ్మడి అభ్యర్థి ప్రశాంతిరెడ్డి సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు.

కాకాణి చేసిన పాపాలే శాపాలై వెంటాడుతున్నాయి : సోమిరెడ్డి


బత్తులపల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

పొదలకూరు, ఏప్రిల్ 21 : ఐదేళ్లుగా మంత్రి కాకాణి చేసిన పాపాలే శాపాలుగా మారి ఈదఫా ఎన్నికల్లో వెంటాడుతున్నాయని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బత్తులపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ 2014 తరహాలోనే మరోసారి సర్వేపల్లి నియోజకవర్గం వ్యాప్తంగా కల్తీ మద్యం నిల్వలు కాకాణి దించేశారన్నారు. దశాబ్ద కాలంగా కాకాణి చేస్తున్న పాపాలు పండి నియోజకవర్గంలోని కీలక నేతలు అంతా ఒక్కొక్కరు ఆయనను వీడి టీడీపీలోకి వస్తున్నారన్నారు. పొదలకూరులో చంద్రబాబు ప్రజా గళం విజయవంతం కావడం చూసి బిత్తరపోయిన కాకాణి జనాలను మభ్యపెట్టి అసత్య ప్రచారాలు చేసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వాటిని ప్రజలు నమ్మరన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, అలుపూరు శ్రీనివాసులు, నెల్లూరు శ్రీనివాసులురెడ్డి, కుంకు శ్రీహరినాయుడు, నాగభూషణ్ నాయుడు, రామచంద్రనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన రాపూరమ్మ కొలుపు

రాపూరు(డక్కిలి), ఏప్రిల్ 21: స్థానిక గ్రామ దేవత రాపూరమ్మ కొలుపు ఆదివారం అమ్మవారి నిమజ్జనంతో ముగిసింది. ప్రతిఏడాది అమ్మవారి కొలుపును గ్రామస్థులు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. శనివారం మొదలైన వేడుకలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని మెక్కులు తీర్చుకున్నారు.


ప్రత్యేక అలంకారంలో రాపూరమ్మ

గ్రామాల్లో పారామిలటరీ బలగాల కవాతు


గ్రామాల్లో పర్యటిస్తున్న పారా మిలటరీ బలగాలు

మనుబోలు, ఏప్రిల్ 21: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పొదలకూరు సీఐ రాంబాబు ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. కొమ్మలపూడి, చెర్లోపల్లి, చెరుకుమూడి, కొలనుకుదురు, కట్టువపల్లి గ్రామాల్లో కేంద్ర పారామిలటరీ బలగాలు, బీఎస్ఎఫ్ జవాన్లు కలిసి గ్రామాల్లో తిరిగి ఓటర్లు ధైర్యంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటుహక్కు వినియోగించుకోవాలంటూ కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

వెంకటాచలం, ఏప్రిల్ 21: మండలంలోని కసుపూరు, చవటపాళెం, కందలపాడు, షపాబావి, వడ్డిపాళెం గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక నెల్లూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సు అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాల గురించి వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు డి సురమౌళి, సభ్యులు శేఖర్, శ్రీను , షకీలా, ప్రదీప్, శ్రీదేవి, రాజేంద్రప్రసాద్, సుమలత, సుభాష్ తదితరులున్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

కొడవలూరు ఏప్రిల్ 21: మండలంలో నార్తురాజుపాళెం ప్రధాన కూడలి వద్ద మహాలక్ష్మమ్మ సేవా సమితి అధ్యక్షుడు చీపినేని బాలకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికులు, వృద్ధుల దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ ఎంఎల్‌టీ కమిటీ సభ్యులు భరత్, కల్యాణ్, రామ్, తేజ తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై కోదండ రాముడి దర్శనం

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 21: పెద్దూరులో సీతాలక్ష్మణ సమేత కోదండ రామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి స్వామి వారు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారు మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. రాత్రి స్థానిక కల్యాణ వేంకటేశ్వర కోలాట బృందం, శ్రీ వాసవి భజన మండలి ఆధ్వర్యంలో కోలాటం అలరించింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి 7 గంటలకు కల్యాణోత్సవం, 3గంటలకు గజవాహన సేవలో స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు.


గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన కోదండరాముడు

కసుమూరు దర్గాలో నటుడు సుమన్ పూజలు

వెంకటాచలం, ఏప్రిల్ 21: కసుమూరు మస్తాన్‌వలీ దర్గాను ఆదివారం ప్రముఖ సినీ నటుడు సుమన్ దర్శించుకున్నారు. దర్గా ముజావర్లు ఆయన పేరిట దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కేఎస్ ఆసీఫ్, ఎంఎస్ మొహ్మమద్, ఎంఎస్ దస్తగిరి, సయ్యద్ షబ్బీర్, ఉప సర్పంచు బాబర్ రషీద్ పాల్గొన్నారు.


దర్గాలో ప్రత్యేక పూజల్లో సినీనటుడు సుమన్

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొమ్మి లక్ష్మయ్యనాయుడు నియామకం

ఆత్మకూరు, ఏప్రిల్ 21: తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడును రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారాపు అచ్చెం నాయుడు ఆదివారం రాత్రి ఓ ప్రకటనలో విడుదల చేశారు. కొమ్మి అభిమానులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.


కొమ్మి లక్ష్మయ్యనాయుడు

24న కావలికి మంద క్రిష్ణమాదిగ రాక

● ఎన్డీఏ అభ్యర్థుల విజయం ప్రణాళికపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

కావలి, ఏప్రిల్ 21: ఎన్డీఏ అభ్యర్థుల విజయం కోసం ప్రణాళికను రూపొందించుకునేందుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణమాదిగ ఈనెల 24న కావలికి వస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ నేతలు తెలిపారు. కావలిలో ఆదివారం ఎమ్మెస్పీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి అక్కిలగుంట ఏసు మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఎమ్మార్పీఎస్ ముఖ్య నేతల సమావేశంలో ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయక్రిష్ణ మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేద్కర్ మాదిగ, నియోజకవర్గ కోఆర్డినేటర్ గోచిపాతల వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధనకు సహకరిస్తున్న ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం నెల్లూరు పార్లమెంట్ స్థాయి ఏడు నియోజకవర్గాల సమావేశం ఈనెల 24న కావలిలో జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో మంద క్రిష్ణమాదిగ పాల్గొని కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా మాదిగలు పనిచేసే విధంగా తగు సూచనలు ఇచ్చి నిర్ణయాలు తీసుకుంటారన్నారు. ఈ సమావేశం విజయవంతానికి ఎమ్మార్పీఎస్ దాని అనుబంధ సంస్థల నేతలు, మాదిగ పెద్దలు, యువకులు పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు మహేష్ మాదిగ, ఏసుపోగు జయరాజు, చేవూరి కిరణ్, చేవూరి వరప్రసాద్, కర్రా మల్లికార్జున, నవీన్, మంద మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీరాపేరులో పడి మహిళ మృతి

ఏఎస్‌పేట, ఏప్రిల్ 21: మండలకేంద్రం సమీపంలోని బీరాపేరు వాగులో పడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. కర్నూలు జిల్లా ఆదోని పట్టణానికి చెందిన పర్వీన్(45) అనే మహిళకు మానసిక సమస్య ఉండడంతో వారి కుటుంబ సభ్యులు రెండేళ్ల కిందట ఏఎస్ పేటకు దర్గాకు వచ్చారు. అప్పటినుంచి ఇక్కడే కొన్నిరోజులు ఉండి దర్గాను దర్శించుకుని వెళ్లేవారు. ఈ తరుణంలో గురువారం వారి కుటుంబసభ్యులు ఏఎస్ పేట దర్గాకు తీసుకుని వచ్చారు. అదేరోజు సాయంత్రం నుంచి ఆమె కన్పించ కుండా పోయింది. అప్పటి నుంచి ఆమె కోసం వారి కుటుంబసభ్యులు గాలిస్తూనే ఉన్నారు. ఆదివారం ఉదయం బీరువారు వాగులో ఓ మహిళ శవం నీటిపై తేలిఉండటాన్ని గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పర్వీన్ మృతదేహంగా నిర్ధారించారు. అనంతరం పోస్టుమార్టం నిమ్మితం ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.


బీరాపేరులో తేలాడుతున్న మహిళ మృతదేహం

వడదెబ్బతో హమాలీ కూలీ దుర్మరణం

మర్రిపాడు, ఏప్రిల్ 21: మండలకేంద్రానికి చెందిన హమాలీ కూలి వెంకటేశ్వర్లు (రామారావు) (48) ఆదివారం ఎండ తాపానికి తట్టుకోలేక వడ దెబ్బతో మృతి చెందాడు. మర్రిపాడు సెంటర్‌లో మూటలు మోస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఉదయం హాస్పిటల్ వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన వెంటనే సొమ్మసిల్లి పడిపోయాడు. మృతి చెందాడని నిర్ధారించుకున్న కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

వైసీపీ అభ్యర్థి ప్రచారంలో అపశ్రుతి

● బాణసంచా రవ్వ పడి గడ్డివామి దగ్ధం ● రూ.2 లక్షల ఆస్తి నష్టం


ఎక్స్‌కవేటర్‌తో కదిలిస్తూ ఆర్పుతున్న మంటలు

కావలి రూరల్, ఏప్రిల్ 21: కావలి పట్టణం బుడంగుంట గేట్ రోడ్డులోని 19వ వార్డులో ఆదివారం వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి చేపట్టిన ప్రచారంలో అపశృతి జరిగింది. బాణసంచా కాల్చడంతో నిప్పు రవ్వలు పడి ఆదివారం గడ్డివామి దగ్ధమైంది. ఈ ప్రమాదంలో బొట్లగుంట లక్ష్మయ్యనాయుడుకు చెందిన రూ.2లక్షల విలువైన 10 ట్రక్కుల గడ్డివామి పూర్తిగా దగ్ధమైంది. బాధితుల సమాచారంలో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చేసరికి మంటలు చుట్టుముట్టడంతో వామి కాలి బూడిదయ్యింది. ఈ మంటలు పక్కనే ఉన్న గుంటుపల్లి బ్రహ్మయ్య గడ్డివామికి మంటలు అంటుకోకుండా కాలుతున్న గడ్డివామికి నీర్లు కొడుతూ ఎక్స్‌కవేటర్‌తో గడ్డిని కదలిస్తూ మంటలు ఆర్పివేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ వార్డు ఇన్‌చార్జి ఏగూరు చంద్రశేఖర్, పీఆర్‌కే అమీర్ ఖాన్, కరిముల్లా, డీవీరమణయ్య, వెంకటేశ్వర్లు, జగన్, సుభాని, జిలానీ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు.

● **ఎన్నికల నిబంధనలు పట్టని నేతలు, పట్టించుకోని అధికారులు**

సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రచారాల్లో బాణసంచా కాల్చరాదన్న నిబంధనలను రాజకీయ పార్టీల నేతలు తుంగలో తొక్కుతున్నారు. అయినా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	130
లేయర్ లైవ్	98
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	260
లేయర్	167

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 7015
వెండి కిలో ధర	రూ. 86,100
వెండి ఒక గ్రాము	రూ. 88.10

ఆశీర్వదించండి.. సేవకురాలిగా ఉంటా : ప్రశాంతి రెడ్డి


ఇందుకూరుపేట : టీడీపీలో చేరిన వారితో ప్రశాంతిరెడ్డి, కోటంరెడ్డి, కల్యాణ్‌రెడ్డి

ఇందుకూరుపేట, ఏప్రిల్ 21 : ఆశీర్వదించండి.. మీ సేవకురాలిగా ఉంటానని కోవూరు శాసనసభ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నాగరాజుతోపు, లేబూరు, పున్నూరు, రావూరు, గ్రామాలలో ఆదివారం ప్రశాంతిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీచేసి తెలుగుదేశం ప్రభుత్వం రాగానే అమలుచేసే పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వృద్ధాప్య పెన్షన్ రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచుతామని, ఆక్వా రైతులకు రూ.1.50పైసలకే యూనిట్ విద్యుత్ అందిస్తామని, గ్రామాలలో తాగు, సాగునీరు సమస్య పరిష్కరిస్తామన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, రావెళ్ల వీరేంద్రచౌదరి, దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, చెంచుకిషోర్ యాదవ్, నరేంద్రరెడ్డి, మునగాల రంగారావు, బీజేపీ నాయకులు పి.సురేంధర్‌రెడ్డి, కైలాసం శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు

మండలంలోని జగదేవిపేటలో ఆదివారం వైసీపీ నుంచి టీడీపీలోకి గ్రామ ఉప సర్పంచ్ కదురు జమున ఆధ్వర్యంలో 200మంది కార్యకర్తలు చేరారు. ఈ కార్యక్రమంలో కదురు రామిరెడ్డి, కదురు రాధాక్రష్ణారెడ్డి, కదురు మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా కృషిచేసి టీడీపీని గెలిపిద్దాం

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల్లో సమిష్టిగా కృషిచేసి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోవూరు ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తనయుడు అర్జున్‌రెడ్డి పిలుపునిచ్చారు. విడవలూరులోని టీడీపీ కార్యాలయంలో జిల్లా అధికార ప్రతినిధి చెముకుల కృష్ణచైతన్య, మండల పార్టీ అధ్యక్షుడు చెముకుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన బీసీ, బహుజనుల శంఖారావం కార్యక్రమంలో ప్రశాంతిరెడ్డి అల్లుడు శ్రీనివాసులురెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్జున్‌రెడ్డి మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి బీసీలను నానా విధాలుగా హింసలకు గురిచేయడమే కాకుండా వారి ఆస్తులను ధ్వంసం చేశారని విమర్శించారు. మళ్లీ అధికారం కోసం బీసీలందరూ వైసీపీ వైపే ఉన్నారని కల్లబొల్లిమాటలు చెబుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల కోసం దివంగత ఎన్టీఆర్ పార్టీని స్థాపించారన్నారు. ఆయన ఆశయాలను పుణికిపుచ్చుకున్న చంద్రబాబునాయుడు బీసీల సంక్షేమం కోసం కృషి చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో బహుజనులందరూ ఏకమై రాష్ట్రంలో చంద్రబాబునాయుడుని, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కోవూరు ఉమ్మడి అభ్యర్థి అయిన ప్రశాంతిరెడ్డిలను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు చిమట వెంకటేశ్వర్లు, చిట్టిబాబు, ఆవుల వాసు, కేవీ శేషయ్య, ఆవుల రవిచంద్ర, రామిశెట్టి వెంకటేశ్వర్లు, ఇమామ్‌బాషా, కొడిమెర్ల శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంతిరెడ్డి తనయుడు అర్జున్‌రెడ్డి


కొడవలూరు : యల్లయపాళెం గ్రామంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఏకోల్లు వంశీధర్ తదితరులు

వేమిరెడ్డి దంపతులను గెలిపించాలి

కొడవలూరు ఏప్రిల్ 21 : కూటమి శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు చెముకుల భాస్కర్ అన్నారు. మండలంలో రేగడిచెలిక గ్రామంలో కార్యకర్తలతో ఆదివారం ఆత్మీయ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ వేమిరెడ్డి దంపతులు గత కొన్నేళ్లుగా పేదలకు అనేక సేవా కార్యక్రమాలు చేసి వారిని ఆదుకుంటున్నారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి జరగక పేదలు అల్లాడిపోతున్నారన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వంలో వేసిన రోడ్లు తప్ప ఎక్కడా బుట్ట మట్టి వేయలేదన్నారు. గ్రామీణ ప్రాంత అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం మన్నారు. నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడవాలంటే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఎమ్మెల్యేగా రావాలన్నారు. అలాగే ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు చెముకుల వెంకయ్య, కటారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవే ప్రశాంతిరెడ్డి ధ్యేయం : ఏకోల్లు

ప్రజలకు సేవా చేసేందుకే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి రాజకీయాల్లోకి వచ్చారని టీడీపీ సీనియర్ నాయకుడు ఏకోల్లు వంశీధర్‌రెడ్డి అన్నారు. మండలంలో యల్లయపాళెం గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి టీడీపీ అధికారంలో వస్తే ప్రజలకు కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు రాష్ట్ర ప్రజలకు శ్రీరామరక్ష అన్నారు. ప్రజలు అరాచక పాలనకు చరమగీతం పాడాలన్నారు. వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు రియాజ్ బాషా ,రాఘవేంద్ర , జయరాంరెడ్డి, ప్రకాశం, చంద్ర తదితరులు పాల్గొన్నారు .

నెల్లూరు సిటీ
నెల్లూరు రూరల్

అన్నీ సగం పనులే!

- దౌర్జన్యంగా పేదల ఇళ్ల కూల్చివేత
- కోర్టుకు వెళ్లడంతో సగంలో నిలిపివేత
- సగం రోడ్డు నిర్మాణం
- కాలనీ వాసుల కోసం నిర్మించిన వంతెన కూల్చివేత
- వెంకటేశ్వరపురంలో నిత్యం ట్రాఫిక్ కష్టాలు
- రోడ్డు, బ్రిడ్జి పూర్తయితే 30వేల మందికి మేలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 21 : నగరంలోని 53, 54 డివిజన్ల పరిధిలో వైసీపీ ప్రభుత్వం అంతా సగం....సగం పనులు చేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. ప్రధానంగా వెంకటేశ్వరపురం, జనార్దనరెడ్డికాలనీ ప్రాంతాల మీదుగా టిడ్కో అపార్ట్‌మెంట్లు, జగనన్న లేఅవుట్ వరకు రహదారి, వంతెన నిర్మించాల్సి ఉంది. నిత్యం దాదాపు 30వేల మంది ప్రజలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రోడ్డు నిర్మాణాన్ని వైసీపీ పాలకులు ఆనాలోచితంగా సగం...సగం పనులు చేసి వదిలేశారు. దీంతో నిత్యం ప్రజలు ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొంటున్నారు. రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న సుమారు 50 ఇళ్లను, వాటిలోని నివాసస్తులకు పరిహారం అందజేసి కూల్చివేయాల్సి ఉండగా వైసీపీ నాయకులు దౌర్జనంగా ఇళ్ల కూల్చివేతలు ప్రారంభించారు. బాధితులు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవడంతో సగం నివాసాలను కూల్చి నిలిపివేశారు. ఇదిలా ఉండగా సగం కూల్చివేతలు చేసిన ప్రాంతంలో హడావిడిగా కాంట్రాక్టర్ సగం రోడ్డు వేసి ఆపేశారు. ఉన్న ఫళంగా కూల్చేసిన వంతెనను కూడా నిర్మించకుండా అలాగే వదిలేశారు. ఇలా వైసీపీ పాలనలో అన్నీ సగం.. సగం పనులతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. సందడిలో సడేమియా అన్న చందంగా కూల్చేసిన బ్రిడ్జ్‌కు ఇరువైపులా ఉన్న ఎర్రమట్టిని అక్రమార్కులు తరలించుకుపోయారు. ఇంత జరుగుతున్నా అధికారులుగానీ, పాలకులుగానీ నిమ్మకునీరెత్తినట్లు ఉండటంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.





వెంకటేశ్వరపురంలో సగం వేసిన రహదారి, పేదలు కోర్టుకు వెళ్లడంతో నిలిచిపోయిన కూల్చివేత పనులు

● వరదలు వస్తే రాకపోకలు బంద్

వెంకటేశ్వరపురం, జనర్దన్‌రెడ్డికాలనీ మధ్య ఉన్న వంతెనను కూల్చివేసిన వైసీపీ ప్రభుత్వం నూతన బ్రిడ్జి మాత్రం నిర్మించలేదు. దీంతో పెన్నా నదికి వరదలు సంభవించిన ప్రతిసారీ ఆ రెండు ప్రాంతాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోంది.

ఎన్నికల పర్వం

ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

● ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 21 : ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి ఓ ప్రకటనలో కోరారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పీవో, ఏపీవో, ఓపీవో, ఎంసీసీ, ఎఫ్ఎస్ఏ, ఎస్ఎస్టీ, వీఎస్టీ, అత్యవసర సర్వీసుల్లో పనిచేసే వారందరూ పోస్టల్ బ్యాలెట్ పొందటానికి అర్హులని తెలిపారు. వీరంతా వారు పనిచేస్తున్న రిటర్నింగ్ అధికారి పరిధిలో పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు ఫారం-12ను పూర్తి చేసి అక్కడే సమర్పించాలని కోరారు. దీనివలన ఉద్యోగులు ఇతర జిల్లాలు, పొరుగు నియోజకవర్గాల్లో ఎక్కడ ఓటు ఉన్నా వారు పని చేస్తున్న ప్రాంతంలోనే ఓటు వేసేలా సౌకర్యం కల్పిస్తున్నారని వివరించారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

● టీడీపీ నగర అభ్యర్థి పొంగూరు నారాయణ కుమార్తె సింధూర


బీజేపీ సదస్సులో మాట్లాడుతున్న సింధూర

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 21 : రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ మంత్రి, నగర టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ కుమార్తె సింధూర తెలిపారు. నగరంలోని 47వ డివిజన్‌లో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వైసీపీ అరాచక పాలనకు చమరగీతం పాడేందుకు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు కంకణం కట్టుకున్నాయన్నారు. దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపడమే నరేంద్రమోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ లక్ష్యమన్నారు. గతంలో వీరి పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. ఎన్నో పరిశ్రమలు తీసుకురావడంతోపాటు పథకాలన్నీ కూడా విజయవంతంగా అమలు చేశారన్నా రు. రాష్ట్రానికి రాజధాని ఉండాలన్న లక్ష్యంతో అమరావతి రాజధాని కోసం చంద్రబాబు నాయుడు, నారాయణ ఎంతో శ్రమించారని చెప్పారు. ప్రభుత్వం మారకుండా ఉండి ఉంటే అమరావతి రాజధాని దేశంలోనే నెంబర్ వన్‌గా ఉండేదన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి పార్టీలు అత్యధిక సీట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేయడం తథ్యమన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, నేతలు మిడతల రమేష్, జగదీష్, యశ్వంత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి ప్రజల్లో విశేష ఆదరణ...

నగరంలో ఏ ప్రాంతానికి వెళ్లినా టీడీపీకి ప్రజల్లో విశేష స్పందన లభిస్తోందని సింధూర తెలిపారు. నగరంలోని 47వ డివిజన్‌లో ఆదివారం ఆమె ప్రచారం నిర్వహించి మాట్లాడారు. నారాయణ మంత్రిగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి పనులు ప్రజల గుండెల్లో నిలిచిపోయా యని, వారే స్వయంగా తమను ఆహ్వానిస్తూ గత అభివృ ద్ధి పనులను గుర్తు చేస్తున్నారని చెప్పారు. నెల్లూరుకు ఏదో చేయా లన్న తపన, లక్ష్యంతో నారాయణ పనిచేస్తున్నారని, గత టీడీపీ ప్రభుత్వంలో ఎంతో అభివృద్ధి జరిగిందని, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పూర్తిగా కుంటు పడడంతోపాటు పేదల జీవితాలు కూడా అస్తవ్యస్తంగా తయారయ్యా యన్నారు. ఇవన్నీ మారాలంటే కూటమి అధికారంలోకి రావాలన్నారు. నాయకులు సుబ్బారావు, గణేష్ కుమార్, నేతలు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో నారాయణ కుమార్తె సింధూర

బిడ్డల భవిష్యత్ కోసం టీడీపీని గెలిపించండి

● ఆత్మీయ సమావేశాల్లో రూరల్ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 21 : మన బిడ్డల భవిష్యత్ బాగుండాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం 26వ డివిజన్ విక్రమ్ నగర్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. అద్భుతమైన అమరావతి రాజధానిని నిర్మిస్తేనే రాష్ట్రానికి దేశంలో గుర్తిం పు వస్తుందన్నారు. తద్వారా అనేక జాతీయ స్థాయి పరిశ్రమలు వచ్చి అందులో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఇవన్నీ మన బిడ్డలకు బంగారు భవిష్యత్తునిస్తాయని చెప్పారు. అనుభవం కలిగిన చంద్రబాబు సీఎం అయితే రాష్ట్రానికి అనేక ఉపయోగాలున్నాయని తెలిపారు. అనంతరం మండలంలోని గొల్లకందుకూరు గ్రామానికి చెందిన పౌనక శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. కాగా, నగరంలోని 30, 31, 36, 41 డివిజన్లలోని పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలకు శ్రీధర్‌రెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.


మహిళల ఆశీస్సులు అందుకుంటున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

బీజేపీ ఎన్నికల ప్రచారం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 21: బీజేపీ, జనసేన బలపరిచిన టీడీపీ అభ్యర్థులు పొంగూరు నారాయణ, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించాలని కోరుతూ నగరంలోని ఎఫ్‌సీఐ కాలనీలో బీజేపీ నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్ మాట్లాడుతూ సంపాదన కోసం కాకుండా ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చిన నారాయణ, ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్లపల్లి కొండయ్య, మందా రవి, కప్పల పెంచలయ్య యాదవ్, నటుకుల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలతో పేదరిక నిర్మూలన : కేతంరెడ్డి



నెల్లూరు (విద్య), ఏప్రిల్ 21 : బాబుష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీలో చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలతో పేదరిక నిర్మూలన జరుగుతుందని టీడీపీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తెలిపారు. నగరంలోని 15వ డివిజన్‌లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ గ్యారెంటీలు ప్రజల్లో పాతుకుపోయాయన్నారు. నిరుపేదలను అభివృద్ధి చేసేలా పూర్ టూ రిచ్, ప్రతి ఇంటికి రక్షిత తాగునీరు, బీసీల అభివృద్ధికి రక్షణ చట్టం, విద్యార్థులకు, యువతకు స్వయం ఉపాధి, ఉద్యోగాల కోసం యువగళం, రైతులకు తోడుగా అన్నదాత, మహిళాభ్యున్నతికి మహాశక్తి పథకాలకు ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా కూటమికి అండగా ఉండి ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కార్పొరేటర్ రాజశేఖర్ టీడీపీలో చేరిక

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 21 : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు సమక్షంలో నెల్లూరు నగరం 9వ డివిజన్‌కు చెందిన కార్పొరేటర్ దామవరపు రాజశేఖర్ టీడీపీలో చేరారు. వైసీపీకి చెందిన రాజశేఖర్ ఆదివారం విజయవాడలోని చంద్రబాబు నివాసంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

1978 ఫలితాలు పునరావృతం : చేవూరు

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 21 : ప్రస్తుత పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలలో 1978 నాటి ఎన్నికల ఫలితాలు పునరావృతం అవుతాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని ఇందిరాభవన్‌లో మైనార్టీలతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ 1978లో ఇందిరాగాంధీని అన్ని పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని అలాంటి స్థితిలో ఇందిరమ్మ ఎన్నికలలో ప్రజల వద్దకే వచ్చారన్నారు. దీంతో ఆమె మంచి మెజార్టీతో గెలిచిందని చెప్పారు. ప్రస్తుతం కూడా చాపకింద నీరులా ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి కొప్పుల రాజు మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుందని తెలిపారు. కలెక్టర్‌గా నాలుగేళ్లు ఇక్కడ పనిచేశానని, జిల్లా ప్రజలతో విడలేని బంధం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ అసెంబ్లీ అభ్యర్థి ఫయాజ్, ఉడతా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దేవకుమార్‌రెడ్డి

శేషవాహనంపై శబరి శ్రీరాముడు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 21 : నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో శ్రీరామచంద్రుని బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి శేషవాహనంలో స్వామివారికి నగరోత్సవం వైభవంగా జరిగింది. మంగళవాయిద్యాలు, విద్యుద్దీపాలంకరణ బాణాసంచా వేడుకలతో ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు ధ్వజారోహణం, హోమం, అర్చన జరిగాయి. సాయంత్రం హోమం, బలిహరణం, లౌలీ ఈవెంట్స్ ఆధ్వర్యంలో శాస్త్రీయ, జానపద నృత్యాలు అలరించా యి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను చెన్నూరు వెంకటేశ్వర‌రెడ్డి, అన్నం దయాకర్‌గౌడ్, దడ్డోలు రమణయ్య, బుర్రా వెంకటేశ్వర్లు, చంద్రారెడ్డి, రాంనగర్ యూత్ పర్యవేక్షించారు.



వైభవంగా రంగడి పంగున్యోత్తర కల్యాణం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 21 : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి పంగున్యోత్తర కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం రంగనాథస్వామికి, తాయార్లకు తిరుమంజనం కన్నుల పండువగా జరిగింది. సాయంత్రం స్థల పురాణ పఠనం చేశారు. అనంతరం రంగనాథస్వామి, రంగనాయకమ్మ కల్యాణానికి ఎదురుకోలు ఉత్సవాన్ని అర్చకస్వాములు నయనానందకరంగా నిర్వహించారు. ఆ తర్వాత పంగున్యోత్తర కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్, ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శ్రీరంగనాథ సన్నిధిలో నిత్యం ఆవు నెయ్యి దీపారాధన జరుగుతోందని, ఆ నేతి దీపారాధనకు భక్తులు రోజుకు రూ.2వేలు చెల్లిస్తే వారి గోత్ర నామాలతో పూజ చేస్తారని, భక్తులంద రూ భాగస్వాములు కావాలని కోరారు.



అలరించిన కవి సమ్మేళనం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 21 : నగరంలోని వర్ధమాన సమాజం భవనంలో ఆదివారం రాత్రి జరిగిన కవి సమ్మేళనం అలరించింది. సృజన సాంస్కృతిక, సాహిత్య వేదిక ఆధ్వర్యంలో మన నెల్లూరు మన కీర్తి సంప్రదాయాలు అనే కార్యక్రమంలో భాగంగా కవి సమ్మేళనం జరిగింది. జిల్లా వ్యాప్తంగా హాజరైన కవులు తమ కవితలు వినిపించారు. ఈ కార్యక్రమంలో చిన్ని నారాయణరావు, పెనబాక సుజాతరెడ్డి, ఈ శివకుమార్‌రెడ్డి, డీ కేశవనారాయణ మూర్తి, బీ ప్రసన్నలక్ష్మి, రేఖారాణి, డాక్టర్ మారం సుధాకర్, నిర్వాహకుడు దగ్గుపాటి రాధాకృష్ణ పాల్గొన్నారు. కవులకు ప్రశంసా పత్రాలు అందించి సన్మానించారు.

చంద్రప్రభ వాహనంపై వేణుగోపాలుడు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 21 : మూలాపేట రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి స్వామివారికి చంద్రప్రభ అలంకారంలో నగరోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం తిరుమంజనం, కృష్ణయజుర్వేద పారాయణం, నాలాయిరా దివ్యప్రబంధ ఘోష్టి, విశేష పూజలు, పూలంగి సేవ జరిగాయి. అనంతరం యాళి అలంకారంలో పేట ఉత్సవం జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులకు కనువిందు చేశాయి. కాగా, నగరంలోని ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండ రామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఉదయం తిరుమంజనం, విశేష అలంకారం, పూజలు, సింహవాహన అలంకారంలో ఉత్సవం కన్నుల జరిగాయి. రాత్రి చంద్ర ప్రభలో నగరోత్సవం వైభవంగా జరిగింది.

● సంతపేట అంజనేయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఉదయం అభిషేకాలు, విశేష పూజలు, పూలంగిసేవ జరిగాయి. అనంతరం గిన్నె భిక్ష ఉత్సవం జరిగింది. సాయంత్రం హోమం, విశేష పూజలు, రాత్రి స్వామివారికి గంధర్వ వాహన అలంకారంలో పేట ఉత్సవం కన్నుల పండువగా జరిగాయి.

● వేదాయపాళెం త్యాగరాజస్వామి మందిరంలో జరుగుతున్న కోదండరాముని బ్రహ్మోత్సవా ల్లో ఆదివారం ఉదయం తిరుమంజనం కనుల పండువగా జరిగింది. సాయంత్రం ఊంజల్‌సేవ, సామూహిక శ్రీవెంకటేశ్వర సహస్ర నామార్చన పారాయణం, తిరిచ్చి ఉత్సవం జరిగాయి.


చంద్రప్రభ అలంకారంలో వేణుగోపాల స్వామి

వ్యాయామంతోనే ఆరోగ్యం

● ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 21 : ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని డాక్టర్ ప్రతిభా భారతి సూచించారు. ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆహార నియమాలు పాటిస్తూ వ్యాయామాలు చేయడం ద్వారా ఎన్నో వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. ఆధునిక జీవన శైలిలో క్రమబద్ధమైన ప్రణాళికలు లేకపోవడంతో పలువురు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనంతరం వాకర్స్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రామమోహన్‌రెడ్డి, కార్యదర్శి షేక్ నసీర్ అహ్మద్, కోశాధికారి శానంపూడి సుబ్బ రాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

సుబ్బారెడ్డికి యువ ఆచార్య అవార్డు


అవార్డు అందుకుంటున్న డాక్టర్ సుబ్బారెడ్డి

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 21 : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ బీ వెంకట సుబ్బారెడ్డి యువ ఆచార్య అవార్డు అందుకున్నారు. విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం వైఎస్ మూర్తి ఆడిటోరియంలో బ్రైనోవిజన్ సంస్థ భారత్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్సీ అవార్డు పేరుతో అఖిలభారత స్థాయి అవార్డు కార్యక్రమాన్ని నిర్వహించింది. విద్యారంగానికి సంబంధించి వివిధ విభాగాల్లో విశేష సేవలందించిన వారికి అవార్డులు అందజేశారు. అందులో వెంకట సుబ్బారెడ్డి కూడా ఉన్నారు. ఆయన మాట్లాడుతూ గత 14 ఏళ్లుగా సంఘ సంక్షేమ కృషి విభాగం ద్వారా విద్యార్థులతో కమ్యూనిటీ కార్యక్రమాలు నిర్వహించడం, కొవిడ్ సమయంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు చేపట్టడం తదితర కారణాలతో ఈ అవార్డుకు ఎంపిక చేశారని చెప్పారు. ఆయనను వీఎస్‌యూ అధికారులు, అధ్యాపకులు అభినందించారు.

పీజీ వైద్య విద్యార్థులకు ఏసీఎల్ఎస్‌లో శిక్షణ తప్పనిసరి

● ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధర దేవి

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 21 : వైద్యవిద్యలో పీజీ కోర్సు విద్యార్థులకు అడాన్స్‌డ్ కార్డియో వాస్కులర్ లైఫ్ సపోర్టు(ఏసీఎల్ఎస్)లో శిక్షణ తప్పనిసరని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపా ల్ డాక్టర్ వసుంధర దేవి వెల్లడించారు. ఆదివారం ప్రభుత్వ వైద్య కళాశాలలో అమెరికా హార్ట్ అసోసియేషన్ గుర్తింపు పొందిన గాంధీ మెడికల్ కళాశాల నుంచి డాక్టర్ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఏసీఎల్ఎస్ బృందం వైద్యులకు, పీజీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ ద్వారా పీజీ వైద్య విద్యార్థులు మరింత మేధోశక్తిని పెంచుకోవచ్చన్నారు. వచ్చే నెల నుంచి పీజీ వైద్య విద్యార్థులకు ఇక్కడే ఏపీఎల్ఎస్ శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ శిక్షణలో డాక్టర్ శ్రీలత, డాక్టర్ పావని, డాక్టర్ ఆదిత్య, ప్రదీప్, కోఆర్డినేటర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.


శిక్షణలో పాల్గొన్న వైద్యులు, పీజీ విద్యార్థులు

డ్రైనేజీ కాలువ వద్ద తాగునీటి కలుషితం

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 21 : నగరంలోని మినీబైపాస్ రోడ్డుపై నారా యణ స్కూల్ పక్కనే మొక్కలు విక్రయించే స్థలం వద్ద డ్రైనేజీ కాలువ ఉంది. దీనికి ఆనుకుని ఉన్న తాగునీటి పైపు (డిస్ట్రిబ్యూటరీలైన్) లైనుపై వాల్వు అమర్చారు. ఆ ప్రాంతంలో నీరు లీకవుతోంది. ఇది వాల్వు లీకేజీ నా, పైపుల లీకేజీనా తెలియదు కానీ తాగునీరు మాత్రం పక్కనే ఉన్న డ్రైనేజీ కాలువలోకి వెళ్తోంది. నీటి సరఫరా ఆగిపోయిన వెంటనే కాలువ లోని మురుగు నీళ్లు వెనక్కు వచ్చే అవకాశం ఉన్నందున అవన్నీ తిరిగి పైపులైనులో కలిసి తాగునీరు కలుషితమవుతోందని నగర వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.







నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన ప్రముఖ నాయకులు - లోకేశ్, నానీలతో మాజీ జడ్పీటీసీ సరిత,రమణమూర్తి దంపతులు

చంద్రగిరి వైసీపీకి దెబ్బ మీద దెబ్బ

టీడీపీలోకి మాజీ జడ్పీటీసీ సరితా రమణమూర్తి, బడి సుధా యాదవ్, గణపతి నాయుడు

లోకేష్ సమక్షంలో చేరిన పలువురు నేతలు

టీడీపీలో అంతకంతకూ పెరుగుతున్న జోష్

తిరుపతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గంలో వైసీపీకి దెబ్బ మీద దెబ్బ పడుతోంది. ముఖ్యనేతలు తమను ఎదగనివ్వకుండా అడ్డుకుంటున్నారని ఐదేళ్ళ నుంచీ తీవ్ర అసంతృప్తిని అణచిపెట్టుకుని వున్న పలువురు గ్రామ, మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు ఎన్నికల వేళ ఆ పార్టీని వీడి టీడీపీలో చేరుతున్నారు. తాజాగా ఆదివారం రాష్ట్ర ఓబీసీ ఫోరమ్ కన్వీనర్, తిరుపతి రూరల్ మండల పరిధిలోని పుదిపట్ల సర్పంచ్ బడి సుధా యాదవ్, పద్మావతీపురం మాజీ సర్పంచ్ గణపతి నాయుడు, అతడి భార్య తిరుచానూరు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్‌పర్సన్ శ్రీవిద్య, చంద్రగిరి మాజీ జడ్పీటీసీ సరితా రమణమూర్తిలతో పాటు పలువురు గ్రామ, మండల నాయకులు ఉండవల్లిలో నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ వారిని యువనేతకు పరిచయం చేశారు. అందరికీ పార్టీ కండువాలు కప్పిన లోకేశ్ చంద్రగిరిలో టీడీపీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీపై నమ్మకముంచి చేరిన వారికి మంచి భవిష్యత్తు వుంటుందని భరోసా ఇచ్చారు. యువనేత సమక్షంలో పార్టీలో చేరిన వారిలో వైసీపీ సీనియర్ నాయకుడు రమణ, పుదిపట్ల ఎంపీటీసీ శ్రీకాంత్, సాయినగర్ ఎంపీటీసీ వినోద్, మల్లంగుంట మాజీ సర్పంచ్ దిలీప్, పుదిపట్ల ఉప సర్పంచ్ మునిరత్నం నాయుడు, శ్రీనివాసపురం ఉప సర్పంచ్ సునీల్, విండో డైరెక్టర్ మునికృష్ణారెడ్డి తదితరులున్నారు.

ముఖ్య నేతల చేరికతో వైసీపీకి కోలుకోలేని దెబ్బ

చంద్రగిరి నియోజకవర్గంలో ఎక్కడికక్కడ సొంత బలం కలిగిన సుధా యాదవ్, గణపతి నాయుడు, మునికృష్ణారెడ్డి తదితరులు టీడీపీలో చేరడంతో వైసీపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. వీరిలో మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి అనుచరుడైన సుధా యాదవ్ గత ఎన్నికల తర్వాత వైసీపీలో చేరినప్పటికీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనను ఎదగనివ్వకుండా అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ ఎదురు తిరిగారు. తిరుపతి రూరల్ పుదిపట్ల పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేసిన అతడిని వైసీపీ నేతల ఒత్తిళ్ళతో పోలీసు అధికారులు వ ఎ ప్పు తి ప్పలు పెట్టారు. పలు కేసులు పెట్టారు. చెవిరెడ్డి కుటుంబం యావత్తూ పుదిపట్లలోనే మకాం వేసింది. అయినా 500 పైచిలుకు ఓట్ల మెజారిటీతో సుధా యాదవ్ సర్పంచుగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచీ ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. ఓ దశలో గల్లా కుటుంబం మద్దతుతో చంద్రగిరి టీడీపీ టికెట్ కోసం గట్టిగా ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే పులివర్తి నానీ నియోజకవర్గంలో పాతుకుపోవడం, పార్టీ శ్రేణుల్లో పట్టు పెంచుకోవడం, దానికి తోడు అదివరకే నారా లోకేశ్ ఆయన్ను అభ్యర్థిగా ప్రకటించేసి వుండడంతో సుధా యాదవ్ ప్రయత్నాలు ఫలించలేదు. పులివర్తి నానీ చొరవ తీసుకుని సుధా యాదవ్‌ను అటు అధినేత చంద్రబాబుతోనూ, ఇటు యువనేత నారా లోకేశ్‌తోనూ కలిపి మాట్లాడించారు. పార్టీలో చేరి విజయానికి కృషి చేయాలని, భవిష్యత్తులో తప్పక ప్రాధాన్యత ఇస్తామని వారిద్దరూ హామీ ఇవ్వడంతో ఆదివారం ఆయన టీడీపీలో చేరిపోయారు. పద్మావతీపురం మాజీ సర్పంచ్ గణపతి నాయుడుకు స్థానికంగా ప్రజాబలముంది. ఆయన చేరిక కూడా నిస్సందేహంగా తిరుపతి రూరల్ తిరుచానూరు, పరిసర ప్రాంతాల్లో టీడీపీని బలోపేతం చేసింది.

ఇటీవలే చేరిన పలువురు ప్రముఖులు

కొద్ది నెలల కిందట తిరుచానూరు మాజీ సర్పంచ్ సీఆర్ రాజన్ వైసీపీ నుంచీ టీడీపీలో చేరగా ఇటీవలే ఆయనను చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడిగా పార్టీ నియమించింది. టికెట్ ఆశించిన డాలర్స్ దివాకర్ రెడ్డి సైతం కొద్ది రోజుల కిందట చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. అదే విధంగా చంద్రగిరి మండలంలో ప్రముఖ పారిశ్రామికవేత్త ఈవీ రమణమూర్తి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ముడిపల్లి సురేష్‌రెడ్డి, పాకాల జడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, ఆమె భర్త నంగా బాబురెడ్డి, ఎంపీటీసీ కస్తూరి, మాజీ ఎంపీపీ లక్ష్మీకాంతమ్మ, మాజీ సర్పంచ్ జ్ఞానేశ్వరి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ లింగయ్యనాయుడు, చిన్నగొట్టిగల్లు వైస్ ఎంపీపీ సునీత, ఆమె భర్త దామోదర్, ఆర్సీపురంలో నీలకంఠ చౌదరి తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. నియోజకవర్గంలో ఇలాంటి అంగబలం, అర్థబలం కలిగిన నాయకులు చేరుతుండడంతో టీడీపీ శ్రేణుల్లో నైతిక స్థైర్యం ఇనుమడిస్తోంది. అదే సమయంలో అధికార పార్టీ వర్గాలు వరుస వలసలతో డీలా పడుతున్నాయి.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

● ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో చంద్రబాబు

తిరుపతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గెలుపే లక్ష్యంగా పనిచేయాలని టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సూచించారు. ఉండవల్లిలో ఆదివారం తన నివాసంలో వారికి బీ ఫారాలను చంద్రబాబు అందజేశారు.చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు,తిరుపతి,చిత్తూరు జిల్లాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు బీ ఫారాలు అందుకున్నారు. అనంతరం చంద్రబాబు అభ్యర్థుల చేత ప్రమాణం చేయించారు. ఉమ్మడి మ్యానిఫెస్టోను ప్రతి గడపకూ తీసుకెళ్లాలని సూచించారు. అదే సమయంలో వైసీపీ ప్రభుత్వం, సీఎం జగన్ అప్రజాస్వామిక పాలనను ప్రజలకు వివరించాలన్నారు. విజయంతో తిరిగిరావాలని ఆశీర్వదించారు.



చంద్రబాబు చేతుల మీదుగా బీ ఫామ్‌లు అందుకున్న టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

కలెక్టర్ తనిఖీలు

సత్యవేడు, ఏప్రిల్ 21: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదివారం సత్యవేడు మండలంలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించారు. తొలుత దాసుకుప్పం పోలీస్ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. రాష్ట్ర సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టుల్లో ఓటర్లను ప్రభావితం చేసే నగదు, మద్యం రవాణా కాకుండా నిఘా వుంచాలని సూచించారు.దాసుకుప్పంలోని ఆదర్శ పాఠశాలలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమును, పోలింగ్ సిబ్బందికి ఇచ్చే ఎన్నికల సామగ్రిని, కంపార్ట్‌మెంట్ యూనిట్ తదితరాలను పరిశీలించారు. ఈవీఎం సెకండ్ ర్యాండమైజేషన్‌ను సెక్టార్ వారీ ఏర్పాటుతో, బందోబస్తు నడుమ చేపట్టాలని సూచించారు. పక్కనే ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ హెల్ప్‌డెస్క్‌ను తనిఖీ చేశారు.ఎన్నికల అధికారి నరసింహులు, తహసీల్దారు, సెక్టోరల్ అధికారులు, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ



సామాజికంగా అట్టడుగు వర్గమైన దళిత కుటుంబం నుంచీ వచ్చారాయన. ప్రధానోపాధ్యాయుడి కొడుకుగా చదువుకు ప్రాముఖ్యత ఇచ్చారు.ఉన్నత విద్యావంతుడిగా ఎదిగారు. మూడు పర్యాయాలు సివిల్స్ రాసి వరుసగా ఐఆర్ఎస్, ఐపీఎస్, ఐఏఎస్ సాధించారు. వీటిలో ఐఏఎస్‌ను ఎంచుకుని తమిళనాడు కేడర్‌లో ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయికి చేరుకున్నారు. నాటి సీఎం జయలలిత స్ఫూర్తితో ప్రజాసేవ వైపు దృష్టి సారించి రాజకీయాల్లో అడుగుపెట్టారు. ప్రజారాజ్యం తర్వాత వైసీపీలో చేరి తొలుత తిరుపతి ఎంపీగా, ఆపై గూడూరు ఎమ్మెల్యేగా గెలిచారు. దళితులను గౌరవించడం లేదంటూ ఆ పార్టీని, మనస్సాక్షి లేని వ్యక్తంటూ అధినేత జగన్‌నూ వద్దనుకున్నారు. మరో చోట ఎమ్మెల్యే టికెట్ ఇస్తామన్నా తృణప్రాయంగా తిరస్కరించి క్రమశిక్షణ కలిగిన పార్టీగా పేరున్న బీజేపీలో చేరారు. తాజా ఎన్నికల్లో ఎన్డీయే తరపున తిరుపతి ఎంపీగా పోటీ చేస్తున్న ఆయనే డాక్టర్ వెలగపల్లి వరప్రసాద్. వైసీపీతో పదేళ్ళ ప్రస్థానంలో ఎదుర్కొన్న అవమానాలు, అవహేళనలు, ఏ పరిస్థితుల్లో పార్టీని వీడాల్సివచ్చిందన్న అంశాలపై తన మనసులోని మాటలను ఆంధ్రజ్యోతితో పంచుకున్నారాయన.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

జగన్ అవమానించడంతో వైసీపీని వీడా!

- వైసీపీలో దళితులను ఎదగనివ్వరు
- కేంద్రంలో,రాష్ట్రంలో రాబోయేది ఎన్డీయే ప్రభుత్వమే
- అవకాశమిస్తే తిరుపతి పార్లమెంటు నియోజకవర్గాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతా
- తిరుపతి ఎన్డీయే ఎంపీ అభ్యర్థి వరప్రసాద్



నాన్న నేర్పిన క్రమశిక్షణతోనే ఈ స్థితికి ఎదిగా!

మాది కృష్ణా జిల్లా కొమ్మలమూడి గ్రామం. నాన్న చిరంజీవులు గుడివాడ సమీపంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు. అమ్మ మిరియమ్మ గృహిణి. నాన్న వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు కావడంతో విలువలతో బతకడం నేర్పారు. ఆయన నేర్పిన క్రమశిక్షణతోనే చిన్నప్పటి నుంచీ కష్టపడి చదివా. చదువులో రాణించా. మచిలీపట్నం నోబుల్ హైస్కూలులో టెన్త్, అక్కడే అదే కాలేజీలో ఇంటర్ పూర్తి చేశా. ఆంధ్రా వర్శిటీలో ఎమ్మెస్సీ బయో కెమిస్ట్రీ అయ్యాక అక్కడే పీహెచ్‌డీ పూర్తి చేశా.

బయో కెమిస్ట్ నుంచీ ఐఏఎస్ దాకా సుదీర్ఘ ప్రస్థానం

చదువు పూర్తయ్యాక బయో కెమిస్ట్ నుంచీ ఐఏఎస్ సాధించే దాకా ఉద్యోగ రంగంలో నాది సుదీర్ఘ ప్రస్థానం. పీహెచ్‌డీ అయ్యాక పుదుచ్చేరి ప్రభుత్వాస్పత్రిలో బయో కెమిస్ట్‌గా తొలి ఉద్యోగం వచ్చింది. తర్వాత జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలో అధికారిగా చేశా. ఆపై నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీలో రెండేళ్ళు అధికారిగా కొనసాగా. ఆ సమయంలో ఎస్బీఐలో కూడా ఉద్యోగమొచ్చినా చేరలేదు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాలో గ్రేడ్ బీ అధికారిగా రెండేళ్ళు విధులు నిర్వర్తించా.

సివిల్స్‌లో మూడు సార్లూ ఎంపికయ్యా!

ఇన్సూరెన్సు,బ్యాంకింగ్ ఉద్యోగాలతో సంతృప్తి చెందలేకపోయా. పదిమందికీ ఉపయోగపడే ఉద్యోగం చేయాలని ఆలోచించి సివిల్స్ రాయాలని నిర్ణయించుకున్నా. 1981లో తొలిసారి సివిల్స్ రాస్తే ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యా. ఆదాయపన్ను శాఖలో ఉద్యోగం వచ్చింది. 1982లో రెండో సారి రాస్తే ఐపీఎస్ వచ్చింది. కానీ చేరలేదు. మూడవసారి 1983లో సివిల్స్ రాసి ఐఏఎస్‌కు ఎంపికయ్యా. తమిళనాడు కేడర్ ఎంచుకున్నా. అక్కడ సబ్ కలెక్టర్ మొదలుకుని కలెక్టర్, పలు శాఖల కమిషనర్‌గా, పలు కార్పొరేషన్లకు ఎండీగా, ఛైర్మన్‌గా, చివరికి ప్రిన్సిపల్ కార్యదర్శి స్థాయి దాకా వివిధ హోదాల్లో పనిచేశా.

నిజాయితీగా పార్టీలో కొనసాగితే... కుట్రతో గూడూరు పంపించారు!

గత టీడీపీ ప్రభుత్వంలో 23మంది ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలు వైసీపీని వదిలిపెట్టి టీడీపీలో చేరారు. నేను మాత్రం జగన్‌ను, పార్టీని గౌరవించి క్రమశిక్షణతో పార్టీలోనే కొనసాగా. ప్రత్యేక హోదా కోసం పదవికి రాజీనామా చేయాలని ఆదేశిస్తే శిరసావహించా. ఎంతో నిజాయితీగా పనిచేసిన నాకు 2019 ఎన్నికల్లో తిరిగి ఎంపీ టికెట్ ఇస్తారని భావించా. కానీ సజ్జల రామకృష్ణారెడ్డిని కలవమని చెప్పారు. అప్పటికి ఆయన జగన్‌కు సన్నిహితుడు తప్ప సలహాదారు కాదు. వెళ్ళి కలిస్తే మీ పార్లమెంటు పరిధిలో మీకు ఎమ్మెల్యేలు సహకరించడం లేదని, కాబట్టి గూడూరులో పోటీ చేయాలని చెప్పారు. గూడూరులోనూ ఎమ్మెల్యేగా గెలిచా. కేవలం కుట్రతో, అసూయతో నా ఎదుగుదలను ఓర్వలేకనే రెండవ సారి ఎంపీగా పోటీ చేయనివ్వలేదు.

వైసీపీలో దళితులను గౌరవించరు

వైసీపీలో దళితులను గౌరవించరు. వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎదగనివ్వరు.రాష్ట్రంలో 29 మంది ఎస్సీ ఎమ్మెల్యేలుంటే వారిలో 27మందిని మార్చారు. తద్వారా దళిత నాయకత్వాన్ని అవమానించారు. రాజకీయాల్లో నాయకులను తయారు చేయాలే తప్ప బానిసలను కాదు.

మనస్సాక్షి లేని వ్యక్తి సీఎం జగన్!

సీఎం జగన్‌కు మనస్సాక్షి లేదు. మనిషికి విలువ ఇవ్వని వ్యక్తి అతడు. 2019లో అధికారంలోకి వచ్చాక కమ్మ సామాజికవర్గాన్ని దూరం చేసుకోవద్దని చెప్పా. వినిపించుకోలేదు.తోడబుట్టిన సోదరి షర్మిలను ఆదరించమని సలహా ఇచ్చా. పట్టించుకోలేదు. మద్యపాన నిషేధం అనేది నాకు అత్యంత ఇష్టమైన అంశం. ఎస్సీ, ఎస్టీ వంటి అట్టడుగు వర్గాల పేదలను అన్ని విధాలా నిర్వీర్యం చేస్తున్నది మద్యపానమే. నిషేధిస్తానని జగన్ మేనిఫెస్టోలో చెప్పారు. అమలు చేయాలని బతిమాలినా లెక్క చేయలేదు.

ఇసుక తవ్వకాలు ఆపమంటే గెటౌట్ అన్నారు!

జగన్‌తోనే కాదు అతడి చుట్టూ వుండే కోటరీతోనూ అనేక అవమానాలు ఎదుర్కొన్నా. స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలు అక్రమంగా పెద్దఎత్తున జరుగుతున్నాయని, దాన్ని ఆపించాలని అడిగినందుకు విజయసాయిరెడ్డి గెటౌట్ అన్నారు. చిల్లకూరు మండలం బల్లవోలు గ్రామంలో అక్రమ మైనింగ్ జరుగుతుంటే వైసీపీ నాయకుడు అమరనాథరెడ్డి అడ్డుపడ్డాడని అతన్ని అరెస్టు చేయించి జైల్లో పెట్టారు. నేను వెళ్ళి అతడిని విడిపించినందుకు ఎందుకు విడిపించారు, మీరెందుకు అక్కడికి వెళ్ళారని విజయసాయిరెడ్డి ప్రశ్నించారు.

రైతు సొసైటీ పెట్టి సిలికా విక్రయించాలన్నా పట్టించుకోలేదు!

గూడూరులో సిలికా పెద్దఎత్తున లభిస్తుంది. అక్కడ ఒక్కరే సిలికా తవ్వుకుని అమ్ముకుంటున్నారు. విస్తృతంగా ప్రభుత్వ భూముల్లో వున్న సిలికాను ఒక్కరే ఎలా తవ్వుకుంటారని ప్రశ్నిస్తే ఎవరూ వినిపించుకోలేదు. రైతులతో సొసైటీ ఏర్పాటు చేసి దాని ద్వారా సిలికా అమ్మించాలని, ఆదాయం నేరుగా పేద రైతులకు అందేలా చూడాలని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోలేదు.

క్రమశిక్షణ కలిగిన పార్టీ అనే బీజేపీలో చేరా!

బీజేపీ క్రమశిక్షణ కలిగిన పార్టీ. ప్రధాని మోదీపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవు. ఆయన పాలన బాగుంది. తిరుపతి ఎంపీగా వున్నప్పుడు కూడా ఎలాంటి అపాయింట్‌మెంట్ లేకుండానే ఆరు సార్లు కలిశా. దేశాన్ని కాపాడాలనేదే ఆయన లక్ష్యం.ఇటీవల పార్టీకి నా బయోడేటా పంపగానే అధ్యక్షుడు అపాయింట్‌మెంట్ ఇచ్చారు. వెళ్ళి కలసి తిరుపతి నుంచీ ఎంపీగా పోటీచేసే అవకాశం కల్పించాలని అభ్యర్థించా. అడిగిన వెంటనే తిరుపతి ఎంపీ అభ్యర్థిగా టికెట్ కేటాయించారు. కేంద్రంలోనూ,రాష్ట్రంలోనూ రాబోయేది ఎన్డీయే ప్రభుత్వమే.ప్రజలు ఆశీర్వదిస్తే రెండు ప్రభుత్వాల సంపూర్ణ సహకారంతో తిరుపతి పార్లమెంటు నియోజకవర్గాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతా!

జయలలిత స్ఫూర్తితో ప్రజాసేవ వైపు దృష్టి

తమిళనాడులో బ్యూరోక్రాట్‌గా పనిచేసే సమయంలో సీఎంగా జయలలితను చాలా దగ్గరనుంచీ పరిశీలించి చూసే అవకాశం లభించింది. ప్రజలకు సేవ చేయాలనే ఆమె ఆలోచనలు, సంక్షేమ కార్యక్రమాల అమలు పట్ల ఆమె చర్యలు నన్ను తీవ్రంగా ప్రభావితం చేశాయి. రాజకీయాల్లో చేరి ప్రజలకు సేవ చేయాలన్న ఆలోచన రావడంతో 1996లోనే ఉద్యోగానికి రాజీనామా చేయాలని భావించా. కానీ పిల్లల చదువులు పూర్తి కాకపోవడంతో జీవిత భాగస్వామి లక్ష్మి సలహా మేరకు ఉద్యోగంలో కొనసాగాల్సి వచ్చింది. తర్వాత 2009లో ప్రజారాజ్యం పార్టీలో చేరి తిరుపతి ఎంపీగా పోటీ చేశా. ఆ ఎన్నికల్లో ఓటమి చెందినా ప్రజల్లోనే వుంటూ అన్ని వర్గాలతో కలసి రాజకీయాలు నేర్చుకున్నా.

అవమానించిన జగన్ ముఖం చూడకూడదనుకున్నా!

గత ఎన్నికల్లో తిరుపతి ఎంపీగా వున్న నన్ను గూడూరు అసెంబ్లీకి పోటీ చేయమన్నారు. ఈ ఎన్నికల్లో గూడూరు కూడా వద్దని సత్యవేడు వెళ్ళమని చెప్పారు. మీరు నా మనసులో వున్నారు... వెళ్ళి సత్యవేడులో నామినేషన్ వేయండి... అంటూ తీయటి మాటలు చెప్పారు. దానికోసం మళ్ళీ సలహాదారులను కలమన్నారు. నాకంటే చిన్నవాళ్ళను, అనుభవం లేని వాళ్ళను వెళ్ళి కలవమని చెప్పడం నన్ను బాధించింది. ఎవరో నా భవిష్యత్తును డిసైడ్ చేయడం ఏమిటి అని ఆలోచించి వద్దనుకున్నాను. నన్ను అవమానించిన జగన్ ముఖం ఇక చూడకూడదని నిర్ణయించుకున్నా.

సంక్షేమ పథకాలన్నీ జగన్నాటకమే!

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ జగన్నాటకమే. ఉదాహరణకు హౌసింగ్ స్కీమ్ తీసుకుంటే నిధులన్నీ కేంద్రానివి. పలు కార్యక్రమాలు ఉపాధి హామీ నిధులతో నడుస్తున్నాయి. అవీ కేంద్రం నుంచీ వస్తున్నవే. కులాల వారీ కార్పొరేషన్లు ఏర్పాటు చేశారు. కానీ వాటికి నిధుల్లేవు. కనీసం వాహనాలు కూడా లేవు. కానీ జగన్ సలహాదారులకు మాత్రం ఐఏఎస్‌లకు మించి లక్షలకు లక్షలు జీతాలు చెల్లిస్తున్నారు. ఆశ్చర్యకర విషయమేమిటంటే ఆ సలహాదారులెవరూ పార్టీకి గానీ, ఎన్నికల్లో పార్టీ గెలుపుతో గానీ సంబంధం వున్నవారు కాదు.

జగన్‌పై జాలిపడి వైసీపీలో చేరా!

2012లో జగన్ జైల్లో వున్న సమయమది. ఆయన ఆహ్వానం మేరకు వెళ్ళి కలిశా. అప్పటికి అతడికి తండ్రి లేడు. అన్నదమ్ములూ లేరు. పార్టీ అధికారంలో లేకపోగా దానికి భవిష్యత్తు వుందో లేదో కూడా తెలియదు. అతని పరిస్థితి చూస్తే జాలి వేసింది. అందుకే ఆహ్వానించగానే పార్టీలో చేరా. 2014 ఎన్నికల్లో ఎన్నో షరతులు పెట్టినా అంగీకరించా.పార్టీకి సానుకూల పవనాలు లేవు. ఆదాయం అసలే లేదు. అందుకని ఏడుగురు ఎమ్మెల్యే అభ్యర్థులకు ఎన్నికల్లో సాయం చేశా. పార్టీకి కూడా సాయపడ్డా. తక్కువ మెజారిటీతో ఆ ఎన్నికల్లో గెలిచా.

కుటుంబం గురించి...

మాది కులాంతర వివాహం.లక్ష్మిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నా. ఇద్దరు పిల్లలు.కొడుకు నవీన్ గుప్తా. ఐఐఎం అహమ్మదాబాద్ నుంచీ ఎంబీఏ చేశారు. ప్రస్తుతం మా కుటుంబ విద్యా సంస్థల బాధ్యత తీసుకున్నారు. ఇక కుమార్తె స్ఫూర్తి డాక్టర్. కొంతకాలం అమెరికాలో వుండి ఇక్కడ సేవలందించాలని వచ్చేశారు. ఇపుడు మా కుటుంబానికి చెందిన ఆస్పత్రి బాధ్యతలు చూస్తున్నారు. సమాజంలో విద్య, ఆరోగ్యం అందరికీ అవసరం. అందుకే వ్యాపారంలో కూడా ఈ రెండు రంగాలనే ఎంచుకుని విద్యా సంస్థ, వైద్య సంస్థ నిర్వహిస్తున్నాం.

మా ఊళ్లో

మాటిస్తే ఓటు వేసే వాళ్లం...



నాకు 73 ఏళ్లు. గతంలో జరిగిన ఎన్నికలకు, నేడు జరుగు తున్న ఎన్నికలకు తేడా గమనించా.అప్పట్లో నాయకులు గ్రామాల్లో ఇళ్లకు వచ్చినప్పుడు మాట ఇస్తే, ఎదుటి వాళ్లు ఎంత ప్రయ త్నించినా మొదట చెప్పిన వారికే ఓటు వేసే వాళ్లం. ఇప్పడు ఈరోజు ఓ పార్టీ రేపొక పార్టీలో తిరు గుతున్నారు. అప్పట్లో పోటీ చేసిన అభ్యర్థుల ఖర్చులకు మేమే చందాల వేసి డబ్బులు ఇచ్చేవాళ్లం. - కొండాపురం

చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా నెల్లూరు ఎంపీ స్థానానికి భిన్నవ్యక్తిత్వాల మధ్య పోరు నడుస్తోంది. టీడీపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి (వీపీఆర్), వైసీపీ అభ్యర్థిగా వేణుంబాక విజయసాయిరెడ్డి (వీఎస్ఆర్)ల మధ్య ప్రతిష్టాత్మక పోటీ సాగుతోంది. కొద్ది రోజుల క్రితం వరకు వీరిద్దరూ ఒకే పార్టీ నేతలు. ఇద్దరు కూడా రాజ్యసభ సభ్యులే. అంతేకాదు ఒకే జిల్లా వాసులు. అయితే వీరి వ్యక్తిత్వాలు మాత్రం పూర్తిగా భిన్నమైనవిగా ప్రజలు భావిస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని వందలాది గ్రామాలు వీపీఆర్‌ను జలదాతగా గుర్తుంచుకుంటే.. విజయసాయి మాత్రం సొంత ఊరికి ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఏదోరకంగా తమను ఆదుకుంటారని నమ్మకంతో ప్రజలు వీపీఆర్ ఇంటికి క్యూ కడుతుంటే.. విజయసాయి రాజకీయ కక్షదారుడని విశాఖవాసులు ఘోషిస్తున్నారు. గో బ్యాక్ అంటూ నినదిస్తున్నారు. పేద విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పించే విద్యాదాతగా వీపీఆర్‌ను జిల్లా ప్రజలు గుర్తుంచుకుంటే.. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని రాజకీయ కేంద్రంగా మార్చిన నింద విజయసాయిని వెంటాడుతోంది. ఇలా.. వీరిద్దరి మధ్య వెలుగుకు, చీకటికి ఉన్నంత తేడా కనిపిస్తోందనేది జనవాక్యం. ఈ రసవత్తర పోరులో ప్రజలు ఎటువైపు నిలుస్తారు... ఎవరిని ఆదరిస్తారు? అనే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ నడుస్తోంది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

భిన్నవ్యక్తిత్వాల మధ్య పోరు

ఎవరిదో జోరు!

- నెల్లూరు పార్లమెంటుకు వేమిరెడ్డి వర్సెస్ వేణుంబాక !
- జిల్లావ్యాప్తంగా సేవలతో వీపీఆర్
- సొంత ఊరికే చుక్కలు చూపించిన వీఎస్ఆర్
- జలదాతగా ప్రభాకరుడు
- అవినీతి మరకలతో విజయసాయి



వీపీఆర్‌కు దాతగా గుర్తింపు

వీపీఆర్ రాజకీయాల్లోకి అడుగు పెట్టకముందు నుంచే దాతగా జిల్లా ప్రజల్లో గుర్తింపు పొందారు. వీపీఆర్ ట్రస్ట్ స్థాపించి వ్యాపార రంగానికి సమాంతరంగా జిల్లాలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఫ్లోరైడ్ బాధిత గ్రామాల ప్రజల దృష్టిలో జలదాతగా గుర్తింపు పొందారు. సొంత నిధులతో వందకు పైగా మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. పేద విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్న ఉద్దేశంతో ఎనిమిదేళ్ల క్రితమే పాఠశాల స్థాపించారు. అక్కడుండేవారికి పుస్తకాలు, భోజన వసతిని ఉచితంగానే అందజేస్తున్నారు. జిల్లాతోపాటు దేశ వ్యాప్తంగా ఎన్నో అనాథ శరణాలయాలకు విరాళాలు అందజేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు, ఆలయాల పునరుద్ధరణకు భారీ మొత్తాలను అందించారు. వీటన్నింటికి మించి సాయం కోరిన వారిని ఒట్టి చేతులతో పంపని మంచి వ్యక్తిగా ప్రజల దృష్టిలో నిలిచారు. ఈ కార్యక్రమాలే ఆయనకు రాజకీయ పదవులు తెచ్చిపెట్టాయి. అయితే కుట్ర రాజకీయాలను జీర్ణించుకోలేక వైసీపీని వీడి టీడీపీలో చేరారు. దీంతో పక్షం రోజుల పాటు ఆయన నివాసానికి జనం పోటెత్తివచ్చి సంఘీభావం తెలిపారు. ఆరేళ్లపాటు వైసీపీలో క్రియాశీల నాయకుడిగా వ్యవహరించినా, చిన్న అవినీతి మరక కూడా లేకుండా బయటకు వచ్చారు. ఆయన పార్టీలో చేరిక సందర్భంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడే స్వయంగా నెల్లూరుకు వచ్చి వీపీఆర్ దంపతులకు స్వాగతం పలికారు. ఆ దంపతులు టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేసే క్రమంలో ప్రత్యర్థుల నుంచి తీవ్ర విమర్శలు ఎదురైనా మౌనంగానే ఉండిపోయారు. తన గురించి నీతి లేని వ్యాఖ్యలు చేసే వారి సంగతి ఆ దేవుడే చూసుకుంటాడని ఓర్పు వహించారు. రాజకీయాల్లో వివాద రహితుడిగా, అజాత శత్రువుగా గుర్తింపు పొందారు.



విశాఖను వణికించిన వీఎస్ఆర్

నెల్లూరు ముద్దుబిడ్డగా ప్రచారం చేసుకుంటున్న విజయసాయిరెడ్డి జిల్లాకు చేసిన సేవ ఏదైనా ఉందా ? అంటే ఏమి లేదనే చెప్పాలి. చివరకు సొంత ఊరికి కూడా పెద్దగా ఏమి చేయలేదు. సుమారు 12ఏళ్ల పాటు రాజ్యసభ సభ్యుడిగా, వైసీపీలో నంబర్ 2గా గుర్తింపు పొందిన వీఎస్ఆర్ తన మార్కు కనిపించేలా జిల్లాకు ఒక్క పని కూడా చేయలేదు. సర్వేపల్లి నియోజకవర్గం ముత్తుకూరు మండలం, తాళ్లపాక ఆయన సొంతూరు. రెండున్నరేళ్ల క్రితం ఆ గ్రామాన్ని ఆయన దత్తత తీసుకున్నారు. కమ్యూనిటీ హాల్, కల్యాణ మండం కట్టిస్తానన్నారు. రూ.14 కోట్లతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. అవేవి చేయలేదు. ప్రభుత్వ నిధులతో నాలుగు రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు వేశారు తప్ప ఆయన సొంత నిధులు రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. ఇకపోతే ప్రభుత్వ నిధులతోనైనాసరే ఇచ్చిన ప్రధాన హామీలు నెరవేర్చలేకపోయారు.

జాతీయస్థాయిలో గుర్తింపు

ఇక పేరు ప్రఖ్యాతుల విషయానికి వస్తే జాతీయ స్థాయిలో ప్రచారంలోకి వచ్చారు. జగన్ అక్రమాస్తుల కేసులో ఏ-2 నిందితుడిగా ఈడీ కోర్టుల చుట్టూ తిరుగుతు న్నారు. విశాఖపట్నం విషయంలో మరోసారి జాతీయస్థాయిలో వార్తల్లోకి ఎక్కారు. విశాఖ జిల్లాలో ప్రతిపక్ష పార్టీ నాయ కుల ఆర్థిక మూలాలను దెబ్బ తీయడమే ధ్యేయంగా కుట్రలు పన్నారనే అభియో గాలు ఎదుర్కొన్నారు. రాజకీయ కక్షలతో గీతం వర్సిటీ ప్రహరీ పడగొట్టారని, విశాఖ మాజీ ఎంపీ, మాజీ మేయర్ ఇంట్లో ప్రభుత్వ స్థలం కలిసి ఉందని ఆ ఇల్లు పడగొట్టించారని, గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ఆపిం చారని పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. 50 ఏళ్లుగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న రూ.వేల కోట్ల విలువ జేసే దసపల్ల భూములను నిషేధిత జాబితా నుంచి తొల గించి తమ వారి పేర్లు మీద రెవెన్యూ రికార్డుల్లో ఎక్కించుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూముల్లో విజయసాయి బినామీలు అపార్టుమెంట్లు కడుతు న్నారని, ఆ అపార్టుమెంట్లకు వెళ్లే వంద అడుగుల రోడ్డు కూడా ప్రభుత్వ సొమ్ము తో వేస్తున్నారని విశాఖ నగరం ఘోషించింది. కేంద్రం నిధులతో నిర్మిస్తున్న విశాఖ బీచ్- భోగాపురం బీచ్ వరకు కోస్టల్ కారిడార్ పథకం కింద నిర్మిస్తున్న నాలుగు లైన్ల రోడ్డును విజయసాయి పథకం ప్రకారం భీమిలి వైపు మళ్లించాడని, అంతకుముందే అక్కడున్న భూములను కారుచౌకగా కొనుగోలు చేసి, రోడ్డు వచ్చిన తరువాత అధిక ధరకు అమ్ముకున్నాడని విశాఖ కోడై కూసింది. అంతేకాక ఆంధ్ర యూనివర్సిటీని సైతం విజయసాయి రాజకీయ కేంద్రంగా మార్చారనే విమర్శలు వెల్లువెత్తాయి. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను ఎంపిక చేసే బాధ్యత ఆంధ్రవర్సిటీ వీసీ ప్రసాద్‌రెడ్డికి అప్పగించారని, దీంతో టికెట్ కోసం వచ్చే రాజకీయ నాయకులతో ఆంధ్రవర్సిటీ రాజకీయ కేంద్రంగా మారిపోయిందని పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ఐదేళ్లుగా విజయసాయికి వ్యతిరేకంగా విశాఖలో తరచూ ఉద్యమాలు, నిరసనలు జరుగుతూనే ఉన్నాయి.



వ్యవసాయ కూలీలకు భలే గిరాకీ!

- సేద్యం పనులు లేకపోయినా ప్రచారంతో ఉపాధి

రాజకీయ ఉపాధి

సార్వత్రిక ఎన్నికల సమరం మొదలవడంతో వ్యవసాయ కూలీలకు గిరాకీ పెరిగింది. అభ్యర్థుల ప్రచారాలకు జనాదరణ కోసం ఆయా రాజకీయా పార్టీల నేతలు రైతు కూలీలను తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం రబీ వ్యవసాయ సీజన్ పూర్తయి రైతాంగమంతా ఎడగారుకు హాలిడే ప్రకటించడంతో వ్యవసాయ కూలీలకు పనులు లేకుండాపోయాయి. ఇదే సమయంలో ఎన్నికలు రావడంతో సేద్యం పనులకు ప్రత్యామ్నాయంగా ప్రచారాలు కలిసొచ్చాయి. దీంతో మనిషి లెక్కల కోసం ఇంట్లో భార్యభర్తలతోపాటు పిల్లలను సైతం ఎన్నికల ప్రచారాలకు తీసుకెళ్తున్నారు. నారేతలు, కలుపు, వడ్ల లోడింగ్‌లకు కూలీలను తీసుకెళ్లే మేస్త్రీలకు ప్రస్తుతం ఎక్కడా లేని గిరాకీ ఉంది. ఎన్నికల ప్రచారాలకు వచ్చిన వారికి రూ.300లతోపాటు భోజనం పెట్టిస్తున్న అభ్యర్థులు కూలీలను తీసుకువచ్చిన మేస్త్రీలకు ప్రత్యేక ప్యాకేజీలను అందిస్తున్నారు. కూలీల డిమాండ్‌ను బట్టీ వీరికి ఆఫర్లు ఇస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో ఉదయం ఒక పార్టీకి వెళ్లిన వ్యవసాయ కూలీలు సాయంత్రం మరో పార్టీకి వెళ్లి రోజుకు రూ.600 చొప్పున కూడా సంపాదించుకుంటున్నారు.

- నెల్లూరు రూరల్

ఓటు... భలే రేటు !

అదీ మందు

నియోజకవర్గంలో అసలు పోరు ఇప్పుడే ఆరంభమైంది. ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఎవరెవరు ఎన్నికల బరిలో ఉండేది తేలిపోయింది. ఆత్మకూరులో ప్రధానంగా టీడీపీ, వైసీపీల మధ్యే పోటీ నెలకొంది. అటు రామనారాయణరెడ్డి, ఇటు విక్రమ్‌రెడ్డి బలమైన వారు కావడంతో ఓటుకు భలే గిరాకీ ఏర్పడింది. దీంతో అభ్యర్థులు కూడా డబ్బు మూటలతో సిద్ధమవుతు న్నారు. ఈసారి ఇక్కడ ఎన్నికల ఖర్చు రూ.100 కోట్లకు పైమాటేనని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గత ఎన్నికల కంటే ఈసారి డబ్బు పంపిణీ మూడు నుంచి నాలుగురెట్లు ఉంటుందని పార్టీ వర్గాలు అంచనాలు వేస్తున్నాయి. కాగా ఈసారి ఎన్నికల్లో కులంతో పాటు డబ్బుకు ప్రాధాన్యం పెరిగింది. ద్వితీయ శ్రేణి నేతలకు ప్రధానపార్టీల అభ్యర్థులు డబ్బుతో ఎర వేస్తున్నారు. దీంతో ఓ పార్టీ నుంచి మరో పార్టీలోకి వలసలు పెరుగుతున్నాయి. నియోజకవర్గంలోని అనంతసాగరం, ఏఎస్‌పేట, చేజర్ల, సంగం, ఆత్మకూరు, మర్రిపాడు మండలాల్లో కొంతమంది ద్వితీయ శ్రేణి నాయకులకు డిమాండ్ ఏర్పడింది. వీరికి గాలం వేసేందుకు అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ప్రచారానికి వచ్చే కార్మికులకు కూడా గిరాకీ పెరిగింది. ఒక్కొక్క చోట అభ్యర్థి వెంట వచ్చేవారికి రూ.300 నుంచి రూ.700లు వరకు ఇస్తున్నారు.

- ఆత్మకూరు

అంతా కలసిపోయారు !



గతంలో వారంతా రాజకీయ ప్రత్యర్థులు. ఎక్కడైనా ఎదురు పడితే కూడా ఒకరివైపు ఒకరు చూసుకునేవారు కాదు. తాజా రాజకీయ పరిణామాలు వారిని మార్చేశాయి. 1999, 2004, 2009లో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, 2012 ఉపఎన్నికల్లో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, బొల్లినేని వెంకటరామారావు, 2014లో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, బొల్లినేని వెంకటరామారావు, పీ. చెంచల బాబు యాదవ్, 2019లో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, బొల్లినేని వెంకటరామారావులు టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ తరఫున ఉదయగిరిలో పోటీ చేశారు. రాజకీయ ప్రత్యర్థులుగా కత్తులు దూసుకున్నారు. అయితే ప్రస్తుతం వారంతా ఒక్కటయ్యారు. ఉదయగిరి నియో జకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ విజయానికి పాటుపడుతున్నారు. ఈ క్రమంలో వారు కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డితో కలసి శనివారం రాత్రి నెల్లూరులోని ఓ హోటల్‌లో తాజా రాజకీయ పరిస్థితులు, కాకర్ల విజయానికి చేపట్టే చర్యలపై చర్చలు జరిపారు. ఆ ఫొటో కాస్త సోషల్ మీడియా వైరల్ కాగా, జిల్లాలో చర్చనీయాంశమైంది. అందుకే అంటారు రాజకీయా ల్లో ఎవరూ మిత్రులు కాదు.. శత్రువులు కాదని..!

- ఉదయగిరి రూరల్



అంకమ్మ దర్శనం ఆనవాయితీ

- నాయకుడు ఎవరైనా.. పార్టీ ఏదైనా..!

సెంటిమెంట్

పార్టీ ఏదైనా.. నాయకుడు ఎవరైనా కందుకూరులో గ్రామదేవత అంకమ్మను దర్శించుకోవాల్సిందే. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించాకే ఏ కార్యక్రమమైనా ప్రారంభించాల్సిందే. కొన్ని దశాబ్దాలుగా ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులు కానీ నాయకులు కానీ ఈ సెంటిమెంట్‌ను బలంగా నమ్ముతారు. ఒకరిద్దరు నాయకులు ఈ ఆనవాయితీని పట్టించుకోనప్పుడు వారిని విజయం వరించలేదన్న నమ్మకం కూడా బలంగా ఉంది. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి అంకమ్మ అన్న బలమైన విశ్వాసం ఈ ప్రాంత ప్రజల్లో ఉండటమే ఇందుకు కారణం. పాతతరం నేతలు దివి కొండయ్య చౌదరి, మానుగుంట ఆదినారాయణరెడ్డి, ఇతర నేతలు ఈ సాంప్రదాయాన్ని పాటించారు. ఆతర్వాత తరానికి చెందిన మానుగుంట మహీధరరెడ్డి, దివి శివరాంలు కూడా ఇదే సాంప్రదాయాన్ని కొనసాగించారు. మొదట్లో ఈ సెంటిమెంట్‌ను అంతగా పట్టించుకోని మహీధరరెడ్డి ఆతర్వాత కాలంలో అమ్మవారి మహత్యాన్ని గుర్తించి, పాటించారు. ప్రస్తుత నేతలు ఇంటూరి నాగేశ్వరరావు, బుర్రా మధుసూదన్‌యాదవ్, ఇంటూరి రాజేష్ తదితరులు సైతం ఈ సెంటిమెంట్‌ను ఫాలో అవుతున్నారు.

- కందుకూరు

ఇది కొన్ని వేల కుటుంబాల సమస్య.. ఓ చోటేమో వర్షం కురిస్తే బ్రిడ్జి మునిగిపోతుంది. ఆ గ్రామానికి వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పడవల్లో వెళ్లాల్సి ఉంటుంది. మరో చోటేమో ఎప్పుడో నిర్మించిన బ్రిడ్జి అది. ఎప్పుడు కూలిపోదామా అని ఎదురుచూస్తోంది. ముత్తుకూరు, వెంకటాచలం మండలాల్లోని ఈ రెండు చోట్లా కొత్త వంతెనలు నిర్మించేందుకు 2022లో జిల్లాకు వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేస్తున్నట్లు స్వయం గా ప్రకటించారు. ఏడాదన్నర గడిచినా కనీసం టెండర్లు కూడా పూర్తి చేయలేకపోయారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చిన్న బ్రిడ్జీని కూడా నిర్మించలేకపోయారని ఆ రెండు మండలాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కరొస్తే ఒట్టు

వంతెన కష్టాలు

ఎప్పటికి తీరేనో!?

- నక్కలవాగు, ఉప్పుటేరులపై ప్రమాదకరంగా బ్రిడ్జీలు
- కొత్తవి నిర్మాణానికి ఏడాదిన్నర క్రితం సీఎం జగన్ హామీ
- నిధులు మంజూరైనా ముందుకురాని కాంట్రాక్టర్లు
- చొరవ చూపని పాలకులు, అధికార యంత్రాంగం
- ముత్తుకూరు, వెంకటాచలం మండలాలకు శాపం

నెల్లూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ముత్తుకూరు మండలం పొట్టెంపాడు వద్ద నక్కల వాగుపై ఉన్న బ్రిడ్జిని దశాబ్దాల క్రితం నిర్మించారు. ప్రస్తుతం ఈ బ్రిడ్జికి రెండు వైపులా గోడలు దెబ్బతిని ఎప్పుడు కూలిపోతుందో తెలియని దుస్థితి నెలకొంది. అందులోనూ ఇది చిన్న బ్రిడ్జి కావడంతో రాకపోకలు ఇబ్బందిగా మారింది. ముత్తుకూరు, బ్రహ్మదేవిల నుంచి పొట్టెంపాడు వెళ్లేందుకు ఇదొక్కటే మార్గం. నక్కలవాగు పైనున్న బ్రిడ్జి మీదుగానే వెంకటాచలం మండలానికి కనెక్టివిటీ ఉంది. నక్కలవాగుపై బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మించాలని పరిసర గ్రామాల ప్రజలు ఎప్పటి నుంచో కోరుతూ వస్తున్నారు. అలానే వెంకటాచలం మండలం తిరుమలమ్మపాలెం వద్ద ఉప్పుటేరు మీద ప్రస్తుతం చిన్న బ్రిడ్జి ఉంది. తిరుమలమ్మపాలెం వెళ్లేందుకు ఇదొక్కటే మార్గం. వర్షం కురిస్తే ఉప్పుటేరు పొంగుతుంది. అప్పుడు బ్రిడ్జి కూడా మునిగిపో తుంది. ఆటు పోట్లు వచ్చినప్పుడు కూడా ఇదే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ సమయంలో రాకపోకలకు పడవలే దిక్కు. ఇది ప్రమాదకరం కావడంతో కొత్త బ్రిడ్జి నిర్మించాలని తిరుమలమ్మపాలెం గ్రామ ప్రజలు కోరుతూ వస్తున్నారు. ఈ క్రమంలో 2022 అక్టోబరులో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృష్ణ పట్నం థర్మల్ ప్లాంట్ యూడో యూనిట్ ప్రారంభానికి జిల్లాకు విచ్చేశారు. ఆ సందర్భంగా నక్కల వాగు, ఉప్పు టేరులపై బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నట్లు సీఎం సభా వేదికపై ప్రకటించారు. నక్కల వాగుపై బ్రిడ్జికి రూ.10 కోట్లు, ఉప్పుటేరుపై బ్రిడ్జికి రూ.12 కోట్లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆ వెంటనే ఈ పనులను ఆర్‌అండ్‌బీ అధికారులకు అప్పగించారు. ఈ రెండు బ్రిడ్జిలకు ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపారు.

చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా ప్రభుత్వం వేధిస్తుండటంతో కొత్తగా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఈ రెండు బ్రిడ్జీల విషయంలో కూడా ఇదే జరిగింది. ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపిన ఆరు నెలలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు కేటాయిస్తూ పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. ఉప్పుటేరుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.13 కోట్లు, నక్కల వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేస్తున్నట్లు గతేడాది జూన్‌లో జీవోలు వెలువడ్డాయి. ఆగస్టు తర్వా త అధికారులు ఈ రెండు వంతెనలకు రెండు సార్లు టెండర్లు ఆహ్వానిం చారు. కానీ ఒక్కరంటే ఒక్క కాంట్రాక్టర్ కూడా బిడ్ దాఖ లు చేయ లేదు. స్వయంగా సీఎం హామీ ఇచ్చిన పనులు కూడా జరిగే పరిస్థితి లేకుండా పోయిందంటే వాస్తవాలను అర్థం చేసుకోవచ్చు. కాంట్రాక్టర్లను రప్పించి వెంకటాచలం, ముత్తుకూరు మండలాల ప్రజలకు అవసరమైన బ్రిడ్జిలను నిర్మించడంలో మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. నిధులు ఇస్తున్నామని ప్రకటించి ప్రజ లను మభ్యపెట్టారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ముత్తుకూరు : ప్రమాదకరంగా నక్కలవాగుపై బ్రిడ్జి

మరోసారి టెండర్లు పిలుస్తాం!

నక్కలవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.10 కోట్లు, ఉప్పుటేరుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.13 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. వాటికి అనుగుణంగా టెండర్లు పిలిచాం. కానీ ఒక్క కాంట్రాక్టర్ కూడా టెండర్ వేయలేదు. ఎన్నికల కోడ్ ముగిశాక మరోసారి టెండర్లు పిలుస్తాం.

- ఎం గంగాధర, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ



వెంకటాచలం : తిరుమలమ్మపాలెం వద్ద ఉప్పుటేరుపై బ్రిడ్జి

తిరుపతి

జన కేతనం

www.andhrajyothy.com

సోమవారం 22 ఏప్రిల్ 2024



ఇదీ మందు




వైసీపీకి రాకుంటే కేసే

వైసీపీలోకి వస్తావా... రావా... అని అలుపెరగకుండా పార్టీలోకి పిలుస్తూనే ఉన్నారు. టీడీపీ వదిలి నేను రాను సామీ.. ఉన్నతావులోనే కుదురుగా ఉంటా అని ఆయనా చెబుతూనే ఉన్నాడు. సామదానభేద దండోపాయాలు తెలిసిన నాయకులు కదా మన తిరప్తోళ్లు.. పిలిచీ పిలిచీ ఇంకన దండోపాయానికి దిగారు. కేసుల మీద కేసులు పెడుతూ ఇప్పటికన్నా రా..బ్బా అని పిలుస్తూనే ఉన్నారు. ఈ కత తిరుపతి 50వ డివిజన్ తిమ్మినాయుడుపాళెం దళితవాడలో జరతగా ఉండాది. ఇక్కడ కాయం వెంకటరత్నం అనే తెలుగుదేశం పార్టీ నాయకుడు ఉన్నారు. పిలిస్తే పలికే నాయకుడిగా డివిజన్‌లో పేరుంది. మంచి అనుచరులున్నారు. వెంకటరత్నంతో పాటు వీరందరినీ వైసీపీలోకి రమ్మని పిలుస్తున్నారు. రాకపోవడంతో కేసులు పెట్టిస్తున్నారు. దళితవాడలో వైసీపీ వర్గం ద్వారా చిన్నపాటి గొడవలు సృష్టించి తర్వాత పెద్దవిగా చేయడం... వాటిల్లో టీడీపీ సానుభూతిపరులపైనే కేసులు బనాయించడం చేస్తున్నారు. 2019లో ఒకటి, 2020లో రెండు, 2023లో నాలుగు కేసులు పెట్టించారు. 30మంది టీడీపీ సానుభూతిపరులు, పదిమంది మహిళలూ ఇప్పటికే బాధితులయ్యారు. పెడితే పెట్టుకోండి కేసులు.. అంటూ వీరంతా వెరవకుండా గట్టిగా నిలబడ్డారు.

-తిరుపతి (జీవకోన)

పార్టీ పాయ పేరూ పాయ!



రాజకీయాల్లో ఓడలు బండ్లవడం సహజమే. సూళ్లూరుపేట నియోజకవర్గంలో టీడీపీ అంటేనే ఆ కుటుంబంగా, ఆ కుటుంబం అంటేనే టీడీపీగా దశాబ్దాల పాటు నడిచింది. టీడీపీ ఆవిర్భావం నుంచీ ఏ ఎన్నికల్లో అయినా వారు చెప్పినవారికే టికెట్ ఇవ్వడం ఆనవాయితీగా నడిచింది. ఆ కుటుంబంలో అన్న మరణించాక తమ్ముడు ఆ వారసత్వాన్ని కొనసాగించారు. నియోజకవర్గంలో ఆయన మాటే శాసనంగా నడిచింది. ఆయనకు జిల్లా స్థాయిలో మంచి పదవి కూడా పార్టీ ఇచ్చింది. అయితే టీడీపీ అధికారం కోల్పోవడంతోనే వారి తీరు మారిపోయింది. వేధింపులు, కేసులతో దూకుడు ప్రదర్శించిన వైసీపీని ఎదుర్కోలేక తెరమరుగైపోయారు. కేసులు ఎదుర్కొనే పార్టీ శ్రేణులకు అండగా ఉండలేదు. దాంతో కేడర్ కూడా ఆ నాయకుడితో సంబంధం లేకుండా ముందుకు నడవడం అలవాటు చేసుకున్నారు.ఉలుకూ పలుకూ లేకుండా మాయమైపోయిన ఆయన హఠాత్తుగా ఎన్నికలకు ముందు నేనొచ్చేశానోచ్! అంటూ ఊడిపడ్డారు. పార్టీ పగ్గాలు ఎవరూ అప్పగించకుండానే చేతికి తీసుకున్నట్టుగా మాట్లాడారు. మళ్లీ టీడీపీ పునర్వైభవం చూస్తారని చెప్పారు.అటు పార్టీ అధిష్టానం గానీ, ఇటు స్థానిక నాయకులు గానీ ఆయన మాటలు నమ్మలేదు. అభ్యర్థి ఎంపిక విషయంలోనూ ఆయన అభిప్రాయం అడగలేదు. దీంతో అలిగిన ఆ నాయకుడు ఏకంగా వైసీపీలో చేరిపోయాడు. యథాప్రకారం మందిలో ఒకడిగా ఉనికి లేకుండా మిగిలిపోయాడు. ఆయన గత వైభవం కళ్లజూసిన తరం మాత్రం అయ్యో.. ఎట్లా బతికిన కుటుంబం.. అని నిట్టూరుస్తున్నారు.

- తడ

ఇదేంది మస్తానమ్మా..?



ఉల్లంఘనులు

ఆమె రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేసిన పదవిలో ఉన్నారు. అందులోనూ అధికార భాషా సంఘం సభ్యురాలు. నెలకు లక్ష రూపాయలకు పైగా ప్రజాధనాన్ని వేతనంగా అందుకుంటున్నారు. కానీ అవేవీ ఆమెకు పట్టవు. వైసీపీని తిరిగి అధికారంలోకి తీసుకురావడమే పనిగా పెట్టుకున్నారు. తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి గెలుపు కోసం ఆయన తండ్రి కరుణాకర్‌రెడ్డి చేపడుతున్న ప్రచారంలో ఈమె మహిళా కార్యకర్తలా పనిచేస్తున్నారు. ఎన్నికల నిబంధనలు తెలియనట్టు కరపత్రాలను పంచుతూ కనిపిస్తున్నారు. అంతేకాదు అధికారాన్ని అడ్డుపెట్టుకుని తన సామాజిక వర్గాన్ని ఏకం చేసి, వైసీపీకి ఓట్లుగా మార్చే పనిలోనూ బిజీగా ఉన్నట్టు తెలుస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

డిపాజిట్ దక్కడం అంటే...!

నోట్ దిస్ పాయింట్

'ఎన్నికల్లో మనోడికి డిపాజిట్ దక్కలేదు బాసూ' అనే మాట వింటూ ఉంటాం. ఇంతకీ డిపాజిట్ దక్కకపోవడం అంటే ఏమిటో తెలుసా? ఎన్నికల్లో పోటీ చేసేవారు 1951 ప్రజాప్రాతినిధ్యం చట్టం ప్రకారం కొంత డబ్బు డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికల్లో అయితే జనరల్ కేటగిరి వాళ్లు రూ 10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ 5 వేలు డిపాజిట్ కింద చెల్లించాలి. ఎంపీ అభ్యర్థులైతే 25 వేలు, రిజర్వేషన్ స్థానాల్లో అయితే 12.5 వేలు చెల్లించాలి. నామినేషన్ వేసే సమయంలో ఈ సొమ్ము చెల్లించాల్సి వుంటుంది. ఓట్లు లెక్కింపు పూర్తి అయిన తర్వాత విజయం సాధించిన వారి వివరాలు ప్రకటిస్తారు. పోలైన ఓట్లల్లో ఆరింట ఒకవంతు అంటే 16.6 శాతం ఓట్లు సాధించిన వారికి కట్టిన డిపాజిట్ సొమ్ము వెనక్కి తిరిగి ఇచ్చేస్తారు. మిగిన వారికి ఇవ్వరు. అందుకే డిపాజిట్ కూడా దక్కలేదు అంటారు.


- వెంకటగిరి

ఆటోలకు డిమాండ్



ఎన్నికల పుణ్యమా అని ఆటోవాళ్లకి గిరాకీ పెరిగింది. రోజంతా తిరిగితే ఆరేడు వందలు చేతికొచ్చేది ఎక్కువ. ఇప్పుడు ఎన్నికల ప్రచార అవసరాల కోసం ఆటోలను పార్టీలు ముందు బుక్ చేసేసుకుంటున్నాయి. వీటిని ప్రచారరథాలుగా మార్చేసుకుని పల్లెలు తిప్పుతున్నాయి. మండలానికి పది నుంచి పదిహేను ఆటోలు ఇలా తిరుగుతున్నాయి.కొందరు ఆటోలకు డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేసి అభ్యర్థులు చేపట్టిన కార్యక్రమాలు ప్రదర్శిస్తుండగగా, మరి కొందరు ఆటోల్లో అభ్యర్థుల పేరున పాటలు రికార్డు చేసి వినిపిస్తున్నారు. ఎన్నికల ఆటోలకు రోజుకి వెయ్యి రూపాయలు ఇస్తున్నారు. భోజనం కూడా పార్టీలదే. దీంతో ఎన్నికలొచ్చినపుడే కదా నాలుగు రూపాయలు సంపాయించుకోవాలి అని ఎండలు మండుతున్నా లెక్క చేయకుండా ఆటోలవాళ్లు ప్రచారాల్లో బిజీగా ఉంటున్నారు. ఈ ఎఫెక్ట్ సాధారణ ప్రయాణీకుల మీద పడింది. ఆటోలు దొరకడం అటుంచి రేట్లు పెంచేశారు.

- వెంకటగిరి



పులికాట్‌లో పూడిపోయిన జగన్ హామీ

● ఎన్నికల ముందు శంకుస్థాపన డ్రామా ● అభాసుపాలయిన సీఎం ప్రకటన

"నేను అధికారంలోకి వచ్చాక ఏడాదిలోపే పులికాట్ సరస్సులో పూడిక తీయిస్తాను. దశాబ్దాల సమస్యకు పరిష్కారం చూపిస్తాను. మత్స్యకారుల కళ్లలో ఆనందం నింపుతాను."

2018 మార్చిలో నాయుడుపేటలో పాదయాత్ర సందర్భంగా జగన్ ఇచ్చిన హామీ ఇది.

జగన్ కోరుకున్నట్టే అధికారం లభించింది. ఈమాట చెప్పి సరిగ్గా ఆరేళ్లు పూర్తయింది. పూడిక తీసి, పులికాట్‌కి ప్రాణం పోశారా?

తడ

సూళ్ళూరుపేట, గూడూరు నియోజకవర్గాల పరిధిలో విస్తరించిన పులికాట్ ఉప్పునీటి సరస్సులో రెండు వంతులు ఏపీలో వుండగా ఒక వంతు తమిళనాడులో వుంది. సరస్సులోకి సముద్రపు నీరు ప్రవేశించేందుకు వాకాడు మండలం పూడిరాయదొరువు, కొండూరుపాళెల వద్ద రెండు ముఖద్వారాలున్నాయి. తమిళనాడులో మరొకటి ఉంది. 40 ఏళ్ల కిందటి వరకూ ముఖ ద్వారాల వద్ద ఏటా పూడిక తొలగించేవారు. దీంతో సరస్సులో సముద్రపు నీరు ఏడాది పొడవునా నిలిచి వుండేది. మత్స్యకారులకు ఉపాధిగా నిలిచేది. సైబీరియా నుంచీ ఏటా వచ్చే లక్షకు పైగా వలస పక్షులు విడిది చేసేవి.

మత్స్యకారుల నోట మట్టి

సరస్సులో పూడిక తొలగించకపోవడంతో 18 మత్స్యకార గ్రామాల్లోని 12,500 మంది మత్స్యకారులకు ఉపాధి కష్టమైంది. మట్టి మేటతో సముద్రపు నీరు సరస్సులోకి రావడం లేదు. వర్షాకాలంలో మూడు నెలలు మాత్రమే వస్తోంది. గతంలో 62 రకాలకు చెందిన 1200 టన్నుల మత్స్య సంపద ద్వారా ఏటా రూ.350 కోట్ల నుంచీ రూ.500 కోట్ల మేర వ్యాపారం జరిగేది. 117 రకాల విదేశీ పక్షులు ఏటా అక్టోబరులో వచ్చి విశ్రాంతి తీసుకునేవి. గుడ్లు పొదిగి పిల్లలు కాస్త పెద్దవయ్యాక వెనుదిరిగేవి. పూడిక తీత పనులు జరగక, ఆహారం దొరక్క ఏటా వాటి రాక తగ్గుముఖం పడుతోంది.

ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదు



పులికాట్ పూడికతీత విషయంలో వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. టీడీపీ ప్రభుత్వం గతంలో రూ.48 కోట్లు కేటాయించింది. పనులు మొదలయ్యేసరికి ప్రభుత్వం మారిపోయింది. వైసీపీ నేతలు మాటలు చెబుతున్నారే గాని పనులు కావడం లేదు. పూడికతీత సమస్య మత్స్యకారులను వెంటాడుతూనే ఉంది.

- బొమ్మన శ్రీధర్, మాజీ జడ్పీటీసీ, తడ

పర్యావరణ సంక్షోభాన్ని గుర్తించిన చంద్రబాబు

2018 జనవరి 7న నెల్లూరుకు వచ్చిన నాటి సీఎం చంద్రబాబు పర్యావరణ సంక్షోభాన్ని గుర్తించి పులికాట్‌లో పూడికతీతకు రూ.48 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. సర్వే చేయాలని సకాన్ సంస్థకు ఆదేశాలిచ్చారు. చర్యలకు ఉపక్రమించేలోపే ఎన్నికల హడావిడి మొదలవ్వడంతో ఆచరణ సాధ్యం కాలేదు.

జగన్ ఉత్తుత్తి హడావుడి

పాదయాత్ర సందర్భంగా పూడిక తీయిస్తానంటూ హామీ ఇచ్చిన జగన్ అధికారంలోకి వచ్చినా దీన్ని పట్టించుకోలేదు. తీరా ఎన్నికలు సమీపించాక గతేడాది నవంబరులో హడావుడి చేశారు. రూ.100 కోట్లతో సాగరమాల ప్రాజెక్టు ద్వారా పనులు చేయిస్తామంటూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ప్రకటించారు. అదే నెల 21న సీఎం జగన్ శంకుస్థాపన చేస్తారన్నారు. తుపాను వల్ల ఆయన పర్యటన రద్దయింది. వాస్తవానికి పనులకు సంబంధించి కేంద్రం నుంచి కొన్ని అనుమతులు వచ్చాయే తప్ప నిధుల కేటాయించలేదు. ఎన్నికల నేపథ్యంలో మత్స్యకారులను నమ్మించేందుకు ప్రయత్నించి అధికార పార్టీనేతలు భంగపడ్డారు.

ఎన్నికల ముందు హడావుడి

నాలుగున్నర సంవత్సరాల పాటు సమస్యను పట్టించుకోలేదు. మూడు నెలల ముందు శంకుస్థాపన అంటూ హడావుడి చేశారు. పనులు మాత్రం మొదలుకాలేదు. ఈసారి కూడా జగన్ మాల ఎన్నికల హామీగానే మిగిలిపోయింది.

- సెల్వి సుధాకర్, మత్స్యకార నాయకుడు, భీములవారిపాళెం



సీన్ రివర్స్

శ్రీకాళహస్తి వర్తమానం

శ్రీకాళహస్తిలో ఈసారి సీన్ రివర్సవుతోంది. ఒకసారి ఓటమి సానుభూతి.. వైసీపీ వేవ్‌లో ఎమ్మెల్యేగా గెలుపొందిన మధుసూదన్‌రెడ్డికి ప్రస్తుతం ఎదురుగాలి వీస్తోంది. విపరీతమైన అవినీతి ఆరోపణలున్నాయి. నిత్య వివాదాస్పద నేతగా ముద్ర వేసుకున్నారు. ఎవరిపైనా రానంతగా భూకబ్జాలు, దాడులు, దౌర్జన్యాలు, అక్రమ, కేసులు వంటి విమర్శలు ఆయనపై వచ్చాయి.

- శ్రీకాళహస్తి



- వైసీపీ ఎమ్మెల్యేపై విపరీతమైన అవినీతి ఆరోపణలు
- ద్వితీయ శ్రేణి నాయకులు కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి
- ప్రభావత నేతల చేరికతో టీడీపీలో జోష్
- కలసివస్తున్న బీజేపీ, జనసేన మద్దతు

శ్రీకాళహస్తి వైసీపీ శ్రేణుల్లో అంతులేని అసంతృప్తి అలముకుంది. ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి వైఖరితో సొంత పార్టీలోని ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల్లో భరించలేని అసహనం, అసంతృప్తి నెలకొంది. గుర్తింపు రాకపోవడం, పదవులు దక్కకపోవడం, పనులు జరగకపోవడం వంటి కారణాలతో అసంతృప్తి పేరుకుపోయింది. గ్రూపులు పెరిగిపోయాయి. వలస నేతలకు పెద్దపీట వేయడం వీరి అసంతృప్తికి మరింత ఆజ్యం పోసింది. ఎమ్మెల్యే కుటుంబం చుట్టూ కోటరీ ఏర్పడింది. కోటరీ నేతల అతిపెత్తనంతో ఆత్మాభిమానం దెబ్బతింటోందని పార్టీ శ్రేణులు ఆవేదన చెందుతున్నాయి. ఏకగ్రీవంగా ఎన్నికైన ముగ్గురు జడ్పీటీసీలు ఇలాంటి కారణంతోనే వైసీపీకి ఝలక్ ఇచ్చారు. ఈ అనూహ్య పరిణామంతో వైసీపీ చతికిలపడింది. గత ఎన్నికల్లో వైసీపీకి అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సత్రవాడ మునిరామయ్య, నాయకులు లక్కమనేని మధు వంటి నేతలు పార్టీని వీడారు. వైసీపీ అభ్యర్థి ఓటమే లక్ష్యంగా వీరంతా పనిచేస్తున్నారు. మరోపక్క భూకబ్జాలు, దాడులు, దౌర్జన్యాలు, అక్రమాల్లో ఇక్కడి ఎమ్మెల్యే తీవ్రమైన అపప్రద మూటగట్టుకున్నారు. శ్రీకాళహస్తి మున్సిపల్ ఎన్నికలు జరగకపోవడంతో వైసీపీలోని ఆశావాహులు భంగపడ్డారు. వార్డుల్లో చిన్నాచితకా నాయకులందరూ పార్టీకి దూరమయ్యారు. ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి నియామకాల విషయంలోను మధు విఫలమయ్యారని సొంత పార్టీ నేతలు భగ్గుమంటున్నారు. పట్టణంలో దాడులు పెరిగిపోయాయి. స్వపక్షంలోను దాడులకు తెగబడటం పార్టీ పరువును బజారుకీడ్చింది. ప్రశాంత శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో రౌడీయిజం పెరిగిందన్న ఆవేదన స్థానికుల్లో నెలకొంది. ఈనేపథ్యంలో ఎన్నికల్లో పార్టీ శ్రేణులు కలసిరాక ఎమ్మెల్యే ఎదురీదుతున్నారు.

పోటెత్తిన వలసలు

సాధారణంగా ఎన్నికలకు ముందు వలసలు మామూలే. కానీ, శ్రీకాళహస్తిలో 14నెలల ముందే మాజీ ఎమ్మెల్యే సత్రవాడ ముని రామయ్య టీడీపీలో చేరారు. ఆ తర్వాత మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు గతేడాది జూలైలో భారీగా అనుచర వర్గంతో సొంత గూటికి చేరారు. ముగ్గురు జడ్పీటీసీలు, ఆతర్వాత కొందరు ఎంపీటీసీలు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు ఇక పలువురు మాజీ కౌన్సిలర్లు వైసీపీని వీడారు. టీడీపీ బలం పుంజుకోవడంతో నెల రోజులుగా చేరికలు మరింత పెరిగాయి.



కూటమితో అదనపు బలం

ఎన్డీఏ కూటమితో టీడీపీ అభ్యర్థికి అదనపు బలం చేకూరింది. బలమైన ఓటు బ్యాంకు ఉన్న బలిజ సామాజిక వర్గానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, ఆపార్టీ శ్రేణులు తోడయ్యారు. జనసేన నుంచీ నేతలు, శ్రేణులు ఉత్సాహంగా పనిచేస్తున్నారు.

బలం పుంజుకున్న సుధీర్

టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి బాగా బలం పుంజుకున్నారు. అభివృద్ధి ప్రదాతగా, పాలనాదక్షుడిగా పేరొందిన గోపాలకృష్ణారెడ్డికి వారసుడు సుధీర్ గెలిస్తే మళ్లీ ప్రశాంత వాతావరణం నెలకొంటుందనే మాట ప్రజల్లో వినిపిస్తోంది. రెండేళ్ల కిందట గోపాలకృష్ణారెడ్డి కన్నుమూశారు. ఆయన కర్మక్రియల రోజునే సోదరుడు హరినాథరెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. ఇద్దరు పెద్ద దిక్కులను కోల్పోయిన సుధీర్‌కు తల్లి బృందమ్మ, భార్య రిషితారెడ్డి వెన్నంటి నిలుస్తున్నారు. ఎన్నడూ గడప దాటని ఆ ఇద్దరూ బరువైన బాధ్యతలను భుజానికి ఎత్తుకున్నారు. నియోజకవర్గంలో ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ పలుమార్లు గడప గడపను చుట్టేశారు. ఇక, గతంలో సుధీర్ రెడ్డి మాట కటువు అన్నవారే నేడు ఆయన కలుపుగోలుతనం, అభివృద్ధి పనులపై మాట్లాడే విజన్, నిజాయితీతో కూడిన విధానాలను ప్రశంసిస్తున్నారు. కేడర్‌నూ ఆయన మృదువుగా పలకరిస్తూ కలుపుకొని వెళ్తున్నారు.

చెవిలో పువ్వు



చంద్రగిరి 50 పడకల ప్రభుత్వాస్పత్రి భవనం

చంద్రగిరిలో వంద పడకల ఆస్పత్రి

"పాలనా కేంద్రంగా చరిత్ర కలిగిన చంద్రగిరి నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు చేయిస్తా."

- చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే

గత ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ఈ హామీ ఒక్క అంగుళం కూడా ముందుకు కదల్లేదు. 1999-2004 నడుమ టీడీపీ ప్రభుత్వం ఇక్కడ వంద పడకల ఆస్పత్రికి తగిన భవనాలు నిర్మించింది. అయితే తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. అప్పటి ఎమ్మెల్యే గల్లా అరుణకుమారి 2006లో ఇదే భవనంలో 30 పడకల ఆస్పత్రిని ప్రారంభించారు. 2019 ఎన్నికలకు ముందు టీడీపీ ప్రభుత్వంలో ఆస్పత్రి స్థాయిని 50 పడకలకు పెంచుతూ పులివర్తి నానీ జీవో తెప్పించారు. ఇప్పటికీ అదే స్థాయిలో ఆస్పత్రి నడుస్తోంది. గత ఎన్నికల్లో ఆస్పత్రి స్థాయిని వంద పడకలకు పెంచుతానని హామీ ఇచ్చిన చెవిరెడ్డి ఈ ఐదేళ్లలో దాని గురించి పట్టించుకోలేదు. ప్రభుత్వంలో తనకున్న పలుకుబడితో తుడా ఛైర్మన్‌గా, ప్రభుత్వ విప్‌గా, టీటీడీలో ఎక్స్ అఫిషియో సభ్యుడిగా పదవులకు మాత్రం జీవోలు తెప్పించుకున్నారు. అలాగే తన కుమారుడిని తుడా ఛైర్మన్‌గా నియమిస్తూ కూడా జీవో తెప్పించుకోగలిగారు. అదే సమయంలో పదిమందికీ పనికొచ్చే ఆస్పత్రి స్థాయి పెంపు విషయంలో జీవో తీసుకురాకుండా హామీ మరచిపోయారు.

● గూడూరు చరిత్ర

ఉద్దండుల పురిటిగడ్డ

అపార ఖనిజ సంపద.సుదీర్ఘ సముద్రతీరంతో గూడూరు నియోజకవర్గం విశిష్టతను సంతరించుకుంది. రాష్ట్ర రాజకీయాల్లో కీలకభూమిక పోషించిన ఉద్దండుల గడ్డ కూడా ఇది. మాజీ మంత్రి బల్లి దుర్గాప్రసాద్‌రావు నాలుగు సారు విజయకేతనం ఎగురవేశారు. కాంగ్రెస్ అభ్యర్థి పత్రా ప్రకాశ్‌రావు మూడు సార్లు విజయం సాధించారు. గూడూరు రాజకీయాలను శాసించిన నల్లపరెడ్డి, నేదురుమల్లి కుటుంబాలు కాలక్రమంలో నియోజకవర్గాన్ని ఎస్సీకి రిజర్వు చేయడంతో ఇతర స్థానాలకు వెళ్లారు.


నియోజకవర్గం ఆవిర్భవించింది : 1952

ఎన్నిసార్లు ఎన్నికలు జరిగాయి : 15

ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం :

1952-	పెల్లేటి గోపాలకృష్ణారెడ్డి	కాంగ్రెస్
1955	పెల్లేటి. గోపాలకృష్ణారెడ్డి	కాంగ్రెస్
1957	మేర్లపాక మునుస్వామి	కాంగ్రెస్
1962	మేర్లపాక మునుస్వామి	కాంగ్రెస్
1967	వేమారెడ్డి రామచంద్రారెడ్డి	ఇండిపెండెంట్
1972	నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి	ఇండిపెండెంట్
1978	పత్రా ప్రకాశరావు	కాంగ్రెస్
1983	జోగి మస్తానయ్య	తెలుగుదేశం
1985	బల్లి దుర్గాప్రసాద్‌రావు	తెలుగుదేశం
1989	పత్రా ప్రకాశ్‌రావు	కాంగ్రెస్
1994	బల్లి దుర్గాప్రసాద్‌రావు	తెలుగుదేశం
1999	బల్లి దుర్గాప్రసాద్‌రావు	తెలుగుదేశం
2004	పత్రా ప్రకాశ్‌రావు	కాంగ్రెస్
2009	బల్లి దుర్గాప్రసాద్‌రావు	తెలుగుదేశం
2014	పాశం సునీల్‌కుమార్	వైసీపీ
2019	వెలగపల్లి వరప్రసాద్‌రావు	వైసీపీ

మండలాలు: గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు



మున్సిపాలిటీ : గూడూరు

ఓటర్ల సంఖ్య: 2,43,624

పురుషులు: 1,18,435

స్త్రీలు: 1,25,155

ఇతరులు: 34

- గూడూరు అర్బన్

నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి: పాశం



చంద్రబాబు నుంచి బీఫాం అందుకుంటున్న పాశం

గూడూరు, ఏప్రిల్ 21: ఉమ్మడి కూటమి తరుఫున టీడీపీ నియోజకవర్గ అభ్యర్థిగా సోమవారం నామినేషన్ వేయనున్నానని, ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ ప్రకటనలో కోరారు. ఆదివారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ అధినేత చంద్రబాబు చేతుల మీదుగా బీఫాంను అందుకున్నాని పేర్కొన్నారు. ఈనెల 22న సోమవారం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని వినాయకస్వామి ఆలయం నుంచి ర్యాలీగా బయలుదేరి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నామి నేషన్‌ను దాఖలు చేస్తానని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని టీడీపీ, జన సేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నాలని కోరారు.

బీఫాం అందుకున్న విజయశ్రీ



నాయుడుపేట, ఏప్రిల్ 21: సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ ఆదివారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నుంచి బీఫాంను అందుకున్నారు. సూళ్లూరుపేటలో నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థి విజయశ్రీ భారీ మెజార్టీతో గెలుపొందుతారని ఆదివారం జనసేన సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

రాక్షస పాలనకు చరమగీతం పాడుదాం


సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, ఏప్రిల్ 21 : రాష్ట్రంలో ఐదేళ్లపాటు సాగిన రాక్షస పాలనకు ఓటు అనే ఆయుధంతో చరమగీతం పాడుదామని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. కోట పట్టణంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా వీధుల్లో ఇంటింటా తిరిగి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రజలను ఐదేళ్లపాటు పట్టి పీడించిన రాక్షసపాలన చరమగీతం పాడాలంటే ప్రతి ఒక్కరు చైతన్యవంతులై ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పాశం సునీల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, మధుయాదవ్, సురేష్, బాలకృష్ణయాదవ్, వంశీ, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరు చేరికతో టీడీపీలో హుషారు



చిట్టమూరు, ఏప్రిల్ 21: వైసీపీ సీనియర్ నాయకుడు గునపాటిపాళేనికి చెందిన దువ్వూరు మధుసూదన రెడ్డి టీడీపీలో చేరడంతో చిట్టమూరు టీడీపీలో హుషారు మొదలైంది. వైసీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న మధుసూదన రెడ్డి చేరికతో గునపాడు సెగ్మెంట్‌లో గునపాటిపాళెం, గునపాడు, మెటు, పెళ్లకూరుల్లో టీడీపీ బలోపేతమైంది. ఈ సెగ్మెంట్ పరిధిలో సర్పంచులు, జట్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యుల విజయానికి ఆయన కృషి చేశారు. యేళ్ల తరబడి నిల్వ ఉన్న స్వర్ణముఖినది ఇసుకను, చుట్టుపక్కల గ్రామాల రైతులతో చర్చించకనే నింబంధనలకు విరుద్ధంగా తరలిస్తుండడంపై వైసీపీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. ఖాతరు చేయకపోవడంతో వైసీపీని వదిలి టీడీపీలో చేరారు.ఆయన చేరికతో చిట్టమూరు మండలంలోని కొన్ని పంచాయతీలతో పాటు కోట, వాకాడు మండలాల్లో బంధువులను, అనుచరులను టీడీపీలో చేర్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. టీడీపీలో దువ్వూరు చేరికతో చిట్టమూరు మండలంలో రాజకీయాలు వేడెక్కాయి.

కూటమి అభ్యర్థుల గెలుపుతోనే రాష్ట్ర భవిష్యత్తు


బాలాయపల్లిలో కూటమి నేతల ప్రచారం

బాలాయపల్లి, ఏప్రిల్ 21: కూటమి అభ్యర్థుల గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఎస్ఎస్ఆర్ నాయుడు అన్నారు. బాలాయపల్లిలో ఆదివారం బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ, బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావును గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్‌నాయుడు, రాయి సత్యంనాయుడు, మురళి, చంటి, అనూష తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం


ప్రచారంలో బీజేపీ నాయకులు

గూడూరు, ఏప్రిల్ 21: రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఏ.బాలకృష్ణమనాయుడు పిలుపునిచ్చారు. పట్టణంలో కూటమి అభ్యర్థుల విజయానికి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వైసీపీ అరాచక పాలనను గద్దె దించేందుకు టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్, బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావును గెలిపించాలన్నారు. దయాకర్, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, ఏప్రిల్ 21: మండలంలోని తూర్పు కనుపూరులో కొలువై ఉన్న ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం నివేదించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చంద్రబాబుతోనే మహిళా సాధికారత


సూపర్ సిక్స్ గురించి మహిళలకు వివరిస్తున్న టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 21: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే మహిళా సాధికారిత సాధ్యమని పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ అన్నారు. ఆదివారం రాత్రి సూళ్లూరుపేట పట్టణంలోని బాహుజీ కాలనీ, బాలాజి నగర్, రైల్వేస్టేషన్ రోడ్డులో ఇంటింటా తిరిగి టీడీపీ ప్రవేశపెట్టనున్న సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితే మహిళలకు పెద్దపీట వేస్తారన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీకి సైకిల్ గుర్తుపై, ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావుకు కమలం గుర్తుపై ఓటేయ్యాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వెంకీయాదవ్, దొడ్డి మస్తాన్, ఆలీభాయ్, వి.శ్యామ్, మెస్ రమణయ్య, మేడా సాయినారాయణ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీని గద్దె దించుదాం


ప్రచారంలో పాశం సంధ్యారాణి తదితరులు

చిల్లకూరు, ఏప్రిల్ 21: రాక్షసపాలన సాగిస్తూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించుదామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్ కుమార్ సతీమణి సంధ్యారాణి, ఆయన కుమారుడు జశ్వంత్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని దళిత వాడలో తానంకి నానాజీ ఆధ్వర్యంలో సూపర్-6 పథకాలపై అవగాహన కల్పిస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగిస్తున్న వైసీపీకి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. వైసీపీకి దోచుకోవడం, దాచుకోవడం తప్ప పాలించడం చేతకాలేదన్నారు. రాష్ట్రంలో దళితులు, మహిళలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. మహిళల కోసం టీడీపీ అధినేత చంద్రబాబు మహాశక్తి పథకం ప్రవేశపెట్టారన్నారు. తల్లికి వందనం పేరిట ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్కరి ఏడాది రూ.15వేలు, ఆడబిడ్డ నిధి నుంచి 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, దీపం పేరుతో ప్రతిఇంటికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సత్తా ఒక్క చంద్రబాబుకే ఉందన్నారు. రానున్న ఎన్నికలలో ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లురెడ్డి, బాబు, దాసరి రామయ్య, రామచంద్రారెడ్డి, నరసారెడ్డి, దినేష్, బెల్లకొండ రాజా తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంలు, నామినేషన్ కేంద్రం పరిశీలన



స్ట్రాంగ్ రూం వద్ద లాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ - తడ తహసీల్దారు కార్యాలయం వద్ద అధికారులకు కలెక్టర్ సూచనలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 21: సూళ్లూరుపేటలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను సంబంధిత అధికారులు పగడ్బందీగా నిర్వహిస్తున్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన సూళ్లూరుపేట జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. అనంతరం అక్కడి ఏర్పాట్లు, లాక్‌బుక్‌ను తనిఖీ చేశారు. ఎన్నికలకు సంబంధించిన రిసెప్షన్, పోలింగ్ కేంద్రాల వివరాలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిం చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. జిల్లాలో సూళ్లూరుపేటలో ఎన్నికల ప్రక్రియ ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల్లో వసతులు తదితరాలను ఆర్వో చంద్రముని, ఏఈఆర్వో గోపాలకృష్ణ పగడ్బందీగా నిర్వహిస్తున్నారని అభినందించారు. ఎక్కడా సమస్యలు తలెత్తకుండా ప్రశాంతగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వేనాడు, ఇరకం దీవులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

వాహన తనిఖీలు పక్కాగా చేపట్టండి

తడ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోకి వచ్చే అన్ని వాహనాలను పక్కాగా తనిఖీ చేయాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. ఆదివారం భీములవారిపాళెం ఎన్నికల చెక్‌పోస్టుకు తనిఖీ చేసి పట్టుబడ్డ సామగ్రి, నగదు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని పోస్టల్ బ్యాలెట్‌పై దృష్టి సారించాలని ఆదేశించారు. ఆర్డీవో చంద్రముని, సూళ్లూరుపేట సీఐ మధుబాబు, తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్ తదితరులున్నారు.

కోడిగుడ్ల పంపిణీ



గూడూరు/ గూడూరు అర్బన్, ఏప్రిల్ 21: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేదిక పట్టణాధ్యక్షుడు వి.రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. మూఢ నమ్మకాలను పారదోలడానికే కాకుండా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. అలాగే పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో వృద్ధులకు నిత్యావసరాలను అందజేశారు. వేసవిలో వృద్ధులు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ జనార్దన రెడ్డి వివరించారు.

మెగా వైద్య శిబిరం

నాయుడుపేట, ఏప్రిల్ 21: పట్టణంలోని స్వర్ణముఖి నది పరీవాహక ప్రాంతంలో కొలువై ఉన్న మల్లికాంబ దేవస్థానంలో ఆదివారం మెగా వైద్య ఉచిత శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో చెన్నైకు చెందిన శంకర్ నేత్రాలయ వైద్య నిపుణుడు వెంకటముని పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అలాగే కంటి శస్త్రచికిత్సలు అవసరమైన వారికి చెన్నైలోని శంకర్ నేత్రాలయలో ఉచితంగా నిర్వహించనున్నట్లు శిబిర నిర్వాహకులు పేర్కొన్నారు. మల్లికాంబ దేవస్థాన నిర్వాహకులు ఆమాస శివనారాయణ, నారాయణ, టీడీపీ నాయకులు సుధీర్‌రెడ్డి, సుధీర్ పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయండి

బాలాయపల్లి, ఏప్రిల్ 21: ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ సంగమేశ్వరరావు అన్నారు. కడగుంట, కయ్యూరు, వెంగమాంబపురంలో సీఐ నేతృత్వంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఎస్ఐ మహబాబ్ సుభాని పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తా: వరప్రసాద్


బలిజ ఆత్మీయ సమావేశంలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుతో వరప్రసాదరావు - జగ్జీవన్‌రాం పార్కులో ఓట్లు అభ్యర్థిస్తూ...

తిరుపతి, (ఉపాధ్యాయనగర్) ఏప్రిల్ 21 : నిత్యం అందుబాటులో ఉంటూ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని గత పదవీకాలంలో సైతం అభివృద్ధి చేశానని బీజేపీ తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు అన్నారు. ఆదివారం తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల పార్కు, జగ్జీవన్‌రాం పార్కులో ఆయన వాకర్లను కలుసుకొని ఓట్లను అభ్యర్థించారు. తన హాయంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. మళ్లీ అభివృద్ధి చెందాలంటే అది బీజేపీ, టీడీపీ, జనసేన కూటమితోనే సాధ్యమని ఆయన చెప్పారు. అనంతరం తిరుపతి నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన బలిజ ఆత్మీయ సమావేశంలో ఆయన తిరుపతి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అరాచక ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు జనం సిద్ధంగా ఉన్నారని తెలిపారు. దళితులంటే జగన్‌కు చులకన భావమని చెప్పారు. ఈ ప్రభుత్వంలో అభివృద్ధి కన్నా విధ్వంసమే ఎక్కువగా జరిగిందని దీనిని సహించలేకే తాను ఆ పార్టీ నుంచి బయటకు వచ్చానని చెప్పారు. ప్రస్తుతం తిరుపతిలో జరుగుతున్న అభివృద్ధి కేంద్రప్రభుత్వ చొరవే అన్నారు. స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులన్నీ పక్కదారి పట్టించిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం గ్రామాల్లో పారిశుధ్య పనులకు సైతం నిధులు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వమే మరోసారి పంచాయతీలకు నిధులను కేటాయించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమాలలో బీజేపీ నాయకులు యుగంధర్, దామోదర్, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటుపై అవగాహన ప్రచారం



కోట, ఏప్రిల్ 21 : ఓటు వజ్రాయుధమని దాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలంటూ అధికారుల బృందం పిలుపునిచ్చింది. కోట మండల పరిధిలోని చెందోడు, విద్యానగర్‌లో ఆదివారం ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీలు జరిగాయి. ఈ సందర్భంగా ఏఎన్ఎం, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఓటు ప్రాముఖ్యతను వివరిస్తూ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

టీడీపీతోనే అభివృద్ధి: నెలవల


ప్రచారంలో ప్రసంగిస్తున్న నెలవల, పరసారత్నం తదితరులు

తడ, ఏప్రిల్ 21: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం చేనిగుంట, అండగుండాల, గ్రద్దగుంట, కొండూరు, వాటంబేడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ అమలు చేయనున్న పథకాలను వివరించారు. వైసీపీ హాయంలో రాష్ట్రం 25 ఏళ్లు వెనక్కు వెళ్లిపోయిందన్నారు. సీఎం జగన్‌ను చూస్తే పారిశ్రామికవేత్తలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతు న్నారని విమర్శించారు. పరసారత్నం, వేనాటి సతీష్‌రెడ్డి, మురళీరెడ్డి, బి.శ్రీధర్, నీలకంఠం, పళణి, సెల్వం, జీవ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో వైసీపీ నాయకుల చేరిక

సూళ్లూరుపేట, ఏప్రిల్ 20: కోటపోలూరులో టీడీపీ నాయకురాలు ఇసనాక వాణి ఆధ్వర్యంలో ఆదివారం మూడు గ్రామాల నుంచి వైసీపీకి చెందిన 200మంది కార్యకర్తలు టీడీపీలో చేరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం సమక్షంలో వాణి ఇంటి వద్ద జరిగిన కార్యక్రమంలో కోటపోలూరు, పెద్దపడవ, మన్నెముత్తేరి గ్రామాల వైసీపీ కార్యకర్తలకు కండువావేసి పార్టీకిలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాణి మాట్లాడుతూ... టీడీపీని బలోపేతం పార్టీ అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొక్కు శంకరయ్య, పెళ్లకూరు మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, కొరిడి మాజీ సర్పంచ్ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్లు, వైద్య పరికరాల వితరణ

గూడూరు అర్బన్, ఏప్రిల్ 21: స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు అవసరమైన వసతులను కల్పించేందుకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను చేపడుతున్నామని క్లబ్ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి అన్నారు. ఏరియా ఆసుపత్రిలోని ప్రసూతివార్డుకు సీలింగ్‌ఫ్యాన్లు, ఆర్థో విభాగానికి పలు పరికరాలను అందజేశారు. ఆసుపత్రిలో పేదలు వైద్యసేవలు పొందుతుంటారని వారికి అవసరమైన వసతులు కల్పించాన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజా, దశరథరామిరెడ్డి, మయూరి శ్యామ్‌యాదవ్, శ్రావణ్‌కుమార్, బాలకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

అండగా చంద్రబాబు ... కొండలా జనం

టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ ● నాన్న విజయం కోసం పని చేస్తానన్న లక్ష్మీసాయిప్రియ



చంద్రబాబు నుంచి బీఫాం అందుకుంటూ... - ప్రచారంలో పింఛను రూ.4 వేలపై వృద్ధురాలికి అవగాహన కల్పిస్తున్న లక్ష్మీసాయిప్రియ

వెంకటగిరి/ డక్కిలి, ఏప్రిల్ 21: సాధారణ టీడీపీ కార్యకర్తగా వెంకటగిరిలో అడుగుపెట్టిన తనకి ఎమ్మెల్యేగా జన్మనిచ్చిన వెంకటగిరిని ప్రాణం ఉన్నంత వరకు మరవనని, తనకు టీడీపీ అధినేత చంద్రబాబు మరోసారి వెంకటగిరి అసెంబ్లీ నుంచి పోటీ చేసే అవకాశం ఇచ్చారని, ఆయనకు తాను ఎప్పటికీ రుణపడి ఉంటానని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ స్పష్టం చేశారు. చంద్రబాబు తనకు అండగా వున్నారని, మరో వైపు వెంకటగిరి నియోజకవర్గంలోని జనం కొండంత అండగా నిలుస్తున్నారన్నారు. ఇక వెంకటగిరిలో తన విజయం నల్లేరుపై నడకేనన్నారు. విజయం సాధించాక వెంకటగిరి నియోజకవర్గాన్ని శ్రామికుడిలా కష్టపడి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు తాను వెంకటగిరి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వెంకటగిరి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగకపోవడం వల్ల ప్రజలు అన్ని రంగాల్లో వెనుకబడి పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటగిరి నియోజకవర్గ సాగునీటి పరంగా బాగా వెనుకబడి వుందని అందుకోసం తాను రూ.400 కోట్ల తో ఆల్తూరుపాడు రిజర్వాయరును తీసుకు వచ్చి పనులు ప్రారంభిస్తే తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పనులు పూర్తయితే తనకు ఎక్కడ మంచి పేరు వస్తోందోనని భయ పడి పనులను రద్దు చేసిందన్నారు. తాను గెలిసిన వెంటనే తొలత ఆల్తూరుపాడు రిజర్వాయరు పనులు మొదలు పెట్టి నియోజకవర్గంలో సాగునీటి పరంగా సమస్యలు తలెత్తకుండా చూస్తామన్నారు. ఇంకా వెంకటగిరికి పరిశ్రమలు తీసుకు వచ్చి యువతకు ఉపాధి కల్పిస్తానన్నారు.

నాన్న విజయం కోసం పనిచేస్తా... యువతను కూడగట్టి నాన్నకు అండగా నిలిచేలా చేస్తానని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ అన్నారు. ఆదివారం ఆమె తన తండ్రి రామకృష్ణతో కలిసి విజయవాడ వెళ్లి టీడీపీ అధినేత చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తన తండికి వెంకటగిరి టీడీపీ టిక్కెట్ ఇవ్వడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. తాను ఇక్కడే వుండి అన్నీ చూసుకుంటానని తెలిపారు.


బీఫాంతో ఇంటికి చేరుకున్న రామకృష్ణకు దిష్టి తీస్తున్న దృశ్యం